epaper.vaartha.com
తెలుగు జాతీయ దినపత్రిక
WWW.VAARTHA.COM
# వార్త
హైదరాబాద్
25-12-2025
గురువారం
సంపుటి: 31
సంచిక: 324
పేజీలు: 10+4
వెల: 6.50




: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam




## ఎల్‌విఎం-3 ఎం6 రాకెట్‌ద్వారా నాలుగో ప్రయోగం కూడా సక్సెస్

### అమెరికాకు చెందిన ఉపగ్రహం రోదసిలోకి

### వాణిజ్య ప్రయోగాలకు రాచబాట వేసిన ఇస్రో

**సూళ్లూరుపేట, డిసెంబరు 24 ప్రభాతవార్త:** ఇస్రో అంతరిక్ష ప్రయోగాల్లో మరో భారీ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి సత్తా చాటింది. ఎల్‌విఎం3-ఎం6 రాకెట్‌ద్వారా అమెరికాకు చెందిన వాణిజ్య ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్-2ను నిర్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెట్టి మరోసారి గగనతలంలో కీర్తిపతాకం ఎగురవేసింది. బుధవారం శ్రీహరి కోటలోని రెండవప్రయోగ వేదికనుంచి 8.55.30 నిమిషాలకు >>2

# 87 సీట్లతో మళ్లీ వస్తాం

## 2029లోనూ కాంగ్రెస్‌దే అధికారం

### కెసిఆర్‌ను తిరిగి అధికారంలోకి రానివ్వను

### గత పదేళ్లలో ఒక్క ప్రాజెక్టూ పూర్తి కాలేదు..

### అసెంబ్లీకి వస్తే అన్ని చర్చిద్దాం

### కోస్గిలో జరిగిన కొత్త సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 24,ప్రభాతవార్త:** " మేం కక్షా రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వాళ్లే పోతారని మా పని మేం చేసుకుంటున్నాం.. కొడంగల్ వేదికగా సవాల్ విసురుతున్నా... 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 87 సీట్లతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తా. 150 నియోజక వర్గాలకు ఎన్నికలు జరిగితే 100కు పైగా స్థానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తా.. రాష్ట్రంలో మరోసారి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే" అని.. సిఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమానికి ముఖ్య మంత్రి హాజరై నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన 182 మంది కొత్త సర్పంచులు అందరినీ సిఎం శాలువాతో సన్మానించారు.


బుధవారం కోస్గి బహిరంగసభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్


అనంతరం ఆయన ప్రసంగించారు. గత పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదని, తొడుక్కోవడానికి చెప్పులు, వేసుకోవడానికి బట్టలు లేని వాళ్లకు వేల కోట్ల ఆస్తులు వచ్చాయి తప్ప పాలమూరుకు నీళ్ల రాలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పడావు పెట్టిన ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాం.అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు.. పదేళ్లలో వాళ్లు చేసిన అప్పులు మన ముందు ఉన్నాయి. నా కోపాన్ని దృష్టిలోపెట్టుకుని పగ సాధించా లనుకుంటే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఊరుకున్నా. రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా అంటున్నాడు.. ఇదేం దుబాయ్ >>2

# ఆరోగ్య శాఖలో మరో 5వేల పోస్టులు

## 2026లో భర్తీ

### స్టాఫ్‌నర్స్ అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో 2,322 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్స్) పోస్టుల భర్తీ ప్రక్రియలో మరో కీలక దశ పూర్తయింది. ఈ పోస్టులకు సంబంధించిన ఫస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బి) విడుదల చేసింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) రాసిన మొత్తం 40,423 మంది అభ్యర్థుల వివరాలను, వారు సాధించిన మార్కులతో సహా బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేం దుకు బోర్డు ప్రతి దశలోనూ అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తోంది. >>2


బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన మెదక్ చర్చి

## నేడే క్రిస్మస్

## ముస్తాబైన మెదక్ చర్చి

**సంగారెడ్డి బ్యూరో/మెదక్ టౌన్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** ఆసియా ఖండంలో రెండో అతి పెద్దదిగా పేరొందిన మెదక్ కేథడ్రల్ చర్చి ప్రముఖ పర్యాటకకేంద్రంగా నిలిచింది. ఆకలితో అలమటి >>2

# సాగుచేసే భూములకే పెట్టుబడి సాయం

## 'రైతు భరోసా'లో మార్పులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో కీలక మార్పులు చేస్తోంది. ఈ పథకం అమలు, మార్గదర్శకాలపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమైన ప్రకటన చేశారు. ఇకపై రైతు భరోసా నిధులను కేవలం సాగు చేసే రైతులకే అందించాలని ఆయన ఆదేశించారు. సాగుకు అనుకూలంగా లేని భూము లకు గతంలో ఇచ్చినట్లుగా ఇవ్వడం సాధ్యం కాదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ప్రారంభించింది. >>2

## అసెంబ్లీ సమావేశాలకు నోటిఫికేషన్ జారీ


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ సమా వేశాలు ప్రారంభం కానున్నాయి. కృష్ణా, గోదా వరి జలాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అవకాశం ఉంది. ప్రాజెక్టులు,నీటి కేటా యింపులు, రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టు లపై చేసిన వ్యయం ఇలా అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించాలని >>2

## ప్రభాకర్ రావు పెన్‌డ్రైవ్, హార్డ్‌డిస్క్ స్వాధీనం

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు బుధవారం కీలక మలుపు తిరిగింది. ప్రభాకర్ రావు నుంచి ఫోన్ ట్యాపింగ్ సమాచారం వున్న పెన్ డ్రైవ్‌తో పాటు హార్డ్ డిస్క్‌ను సిట్ బృందం స్వాధీనం చేసుకుందని సమాచారం. ఇందులో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని సిట్ అధికారులు వెలికితీసినట్లుగా తెలిసింది. ఈ సమాచారం ఆధారంగా మరికొందరు బ్యూరోక్రాట్లతో పాటు బిఆర్‌ఎస్ ముఖ్యులకు సిట్ తాఖీదులు జారీచేసి విచారించే వీలుంది. మరోవైపు ప్రభాకర్ రావు కస్టడీ గురువారంతో ముగియనుండడంతో పాటు శుక్రవారం ఉదయం విడుదల చేయాల్సిన తరుణంలో ఆయన కస్టడీని మరోదఫా పొడిగించాలని లేదా లై డిటెక్టర్ పరీక్షలకు >>2






బుధవారం కోస్గిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కొత్త సర్పంచ్‌లను సన్మానించిన సిఎం రేవంత్ రెడ్డి

# 87 సీట్లతో మళ్లీ వస్తాం

>> పాస్ పోర్ట్ బ్రోకర్ దందా కాదు నేనేం పాస్ పోర్టు బ్రోకర్ దందా చేయలేదు..అని సిఎం పేర్కొన్నారు. ఏ అంశంపై అయినా అసెంబ్లీలో చర్చించేందుకు మేం సిద్ధం. సభకు రండి.. అర్థవంతమైన చర్చ చేద్దాం.. కాళేశ్వరంపై చర్చిద్దామా, కృష్ణా గోదావరి జలాలపై చర్చిద్దాం, టెలిఫోను ట్యాపింగ్‌పై చర్చిద్దామా రండి అని విపక్ష నేతకు సవాల్ విసిరారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, ఇక రాజకీయాలు లేవు, పార్టీలు, పంతాలు వద్దు. ఇప్పుడు గ్రామ పంచాయితీ ఎన్నికలు ముగిశాయని, రాజకీయాలకు తావు లేకుండా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, విపక్ష చూపితే అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిర్మిదామ్. దేశ పునాదులు గ్రామాల్లోనే ఉన్నాయి. వారి స్ఫూర్తిని కొనసాగించాలని కొత్త సర్పంచుల సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు చేరినప్పుడే నిజమైన పాలన. నాకు ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తూ ఎక్కువ సమయం ఇవ్వలేక పోయినా.. నియోజకవర్గ కార్యకర్తలకు స్థానికంగా ఉన్న మండల పార్టీ అధ్యక్షులు అందుబాటులో ఉంటున్నారు. తెలంగాణలోనే కొడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెట్టాలి. నేను ఎక్కడున్నా.. నిరంతరం మిమ్మల్ని గమనిస్తుంటాను. నా సోదరుడిని ప్రత్యేకంగా మీ సమస్యలు తీర్చేందుకే ఎలాంటి పదవి లేకుండా నియోజకవర్గంలో అందుబాటులో ఉంచాను. 2009లో ఇక్కడి నుంచి నన్ను ఎమ్మెల్యే గెలిపించారు. మళ్లీ కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాను. కొడంగల్ ప్రజలు నన్ను గుండెల్లో పెట్టుకున్నారు. ఇక్కడికి వచ్చిన సర్పంచ్‌లలో చాలామంది మహిళలు ఉండటం సంతోషం. పేదరికం, కష్టాలు నన్ను చెప్పాలని ఆశతో ఉన్నారు. నిధులు మంజూరైనా చేయాల్సిన అభివృద్ధి ఉంది. కొడంగల్ నియోజకవర్గం దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దే. ఇక్కడి ప్రతి తండాకు గుడి, బడి, నీళ్లు, సన్న బియ్యం ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం. ఈ ప్రాంతంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక వాడ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసుకుంటాం. రాష్ట్రంలో కొడంగల్ నియోజకవర్గం ఒక రోల్ మోడల్ కావాలి. ప్రతి పౌరుడుమన కుటుంబ సభ్యుడే. అందరినీ కలుపుకుపోదాం. అండగా నిలుద్దాం. అందరూ కావాల్సిన వాళ్లే. పెద్ద హోదాలో ఉన్నప్పుడు హుందాగా వ్యవహరించాలి. గ్రామాల్లో కక్షపూరిత వాతావరణం ఉండొద్దు. నాణ్యమైన సేవలు అందించాలి. నేను మీకు పూర్తి సమయం ఇవ్వలేకపోయినా.. ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలుసు. ఏ పార్టీ నాయకులైనా వాళ్ల పేర్లు కూడా తెలుసు. కొడంగల్ నా కుటుంబం. ప్రాణ సమానం. 2018లో ఇక్కడ కుట్ర జరిగి నేను ఓడిపోయినా.. మల్కాజ్ గిరిలో ఎంపీగా నిలబడితే ఈ ప్రాంత ప్రజలు అక్కడికి వచ్చి ఓటర్లకు దండం పెట్టి నన్ను ఎంపీగా గెలిపించారు. మీ ఆశీర్వాదంతోనే సేవ చేసే భాగం కలిగింది. ఇంత గొప్ప పదవి వచ్చింది లేదు.. ఇచ్చేది లేదు.. ఇంజనీరింగ్ చదివిన యువత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేశారు. చిన్న గ్రామపంచాయతీలకు 5 లక్షలు, మేజర్ పంచాయితీలకు రూ.10 లక్షల ఎస్.డీ.ఎఫ్. నిధులను కొత్త సంవత్సరంలో ఇచ్చే బాధ్యత నాది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులకు ఇవి అదనం. ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోకపోవచ్చు. కొత్త సర్పంచుల గౌరవం నిలబెట్టేందుకే ఎస్.డీ.ఎఫ్. నిధులు మంజూరు చేస్తున్నాం. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. ప్రజలకు మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకోండి అని సిఎం తెలిపారు. 2023 డిసెంబరులో వచ్చిన ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంది. అధికారంలోకి వచ్చి పదేళ్లుగా ఇవ్వని రేషన్ కార్డులు ఇచ్చాం. రాష్ట్రంలో 3 కోట్ల 10 మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. ఇంకా రేషన్ కార్డులు లేని వారికి కార్డులు ఇచ్చి ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం ఇచ్చే బాధ్యత నాది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల్లో రేషన్ కార్డులు లేని వారి పేర్లు, ఉచిత కరెంటు లేని వారి పేర్లు, రైతు భరోసా రాని రైతుల పేర్లు రాసుకుని ఇస్తే అర్హులైన అందరికీ ఆయా పథకాలను అందిస్తాం.

**కండక్టర్ ఉద్యోగం ఊడుతుందని చెప్పండి..**

బస్సుల్లో మహిళలకు కండక్టర్ బస్ చార్జీ అడిగితే నా పేరు చెప్పండి. మా అన్న సిఎంకు చెప్తాం. మీ నౌకరి ఊడుతుంది అని చెప్పండి..అని మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో శ్రీశైలం, యాదగిరి గుట్ట, వెళ్తారో వెళ్లండి. సమ్మక్క సారక్క జాతరకు వెళ్లి దర్శనాలు చేసుకోండి. నెలకు ఒకసారి తల్లిదండ్రులను పలకరించి రండి అని ఆయన మహిళలకు సూచించారు. కోటిమంది ఆడ బిడ్డలకు సారె పేరిట చీర ఇస్తున్నాం.. ఇంకా ఎవరికైనా చీర అందక పోతే ఇవ్వాలని అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన వేదిక మీద నుంచి సీఎస్. కలెక్టర్లను ఆదేశించారు. మీ పిల్లలను పాఠశాలకు పంపించండి. చదువుతోనే వెలుగు, మార్పు వస్తుంది. ఇక్కడున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్లు చిన్నచిన్న కుటుంబాలనుంచి వచ్చినవారే అయినా వాళ్లు ఉన్నత చదువులు చదువుకున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణపేట ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ కలెక్టర్ శ్రీను, కాడ అధికారి వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి, నారాయణపేట, వికారాబాద్ జిల్లా డీఎస్పీలు, కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మరో 5వేల పోస్టులు

>> సిటీబి, కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ సర్వీసు వెయిటేజ్ మార్కులపై ఆగస్టులోనే ఒక దఫా అభ్యంతరాలను స్వీకరించి, అభ్యర్థుల సందేహాలను బోర్డు నివృత్తి చేసింది. తాజాగా విడుదల చేసిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాపైనా అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే తెలిపేందుకు మరోసారి అవకాశం కల్పించింది.అభ్యర్థులు ఈనెల 24 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు బోర్డు వెబ్‌సైట్‌లో లాగిన్ అయి తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థుల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సెకండ్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేస్తామని, ఆ తర్వాత మెరిట్ ఆధారంగా 1:1.5 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తామని బోర్డు వెల్లడించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం, ఉద్యోగాలకు ఎంపికైన వారి తుది జాబితాను విడుదల చేయనున్నారు..ఇటీవలే 1260 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల నియామక ప్రక్రియను బోర్డు పూర్తి చేసింది. ఈ 1260 మంది ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు, ఉద్యోగాలు ఎంపికయ్యే 2,322 మంది నర్సింగ్ ఆఫీసర్లు కూడా జనవరిలోనే ఉద్యోగాల్లో చేరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గడిచిన రెండేళ్లలో 7 వేలకు పైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు మరో 2,322 పోస్టులను భర్తీ చేస్తున్నది. దీంతో ప్రభుత్వ హాస్పిటళ్లలో నర్సుల కొరత పూర్తిగా తీరిపోతుందని, అవసరానికి సరిపడా సిబ్బంది అందుబాటులో ఉంటారని డాక్టర్లు చెబుతున్నారు. ఆరోగ్యశాఖలో గడచిన రెండేళ్లలోనే 11 వేలకుపైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇందులో 9 వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు, 600లకుపైగా డాక్టర్ పోస్టులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తదితర పోస్టులు ఉన్నాయి. మరో 5 వేలకుపైగా పోస్టులు భర్తీ ప్రక్రియలో ఉన్నాయి. ఇందులో 1,600లకుపైగా స్పెషలిస్ట్ డాక్టర్(సీఏఎస్ స్పెషలిస్ట్) పోస్టులు, 600లకుపైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 700లకుపైగా ఫార్మసిస్ట్ పోస్టులు, సుమారు 2 వేల వరకూ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి.

# పెన్‌డ్రైవ్, హార్డ్‌డిస్క్ స్వాధీనం

>> అనుమతివ్వాలని సర్కారు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయనుందని తెలిసింది. రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ దశకు చేరింది. రెండు వారాలుగా పోలీసు కస్టడీలో వున్న ప్రభాకర్ రావు పె ద్దగా ఎలాంటి సమాచారం పోలీసులకు వెల్లడించలేదని తెలిసింది. అయితే ఆయన వద్ద ఫోన్ ట్యాపింగ్ సమాచారం వున్న పెన్ డ్రైవ్‌తో పాటు హా ర్డ్ డిస్కును సిట్ అధికారులు బుధవారం ఉదయం జప్తు చేసినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు మిత్రుడు ఒకరి వద్ద నుంచి వీటిని జప్తు చేసినట్లు తెలి సింది. వీటిని వెంటనే విశ్లేషించిన సిట్ అధికారులకు అందులో కీలక సమాచారం లభ్యమైనట్లు తెలిసింది. ఇందులో ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమ యంలో ఏం జరిగిందనే విషయంతో పాటు ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ జరిగాయి? ఎంతకాలం జరిగాయి? దీనివల్ల ఎవరికి లబ్ధి చేకూరింది? ట్యాపింగ్‌లో పాల్గొన్న అధికారులు ఎవరు? ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్‌జరిగింది? అనే సమాచారం వుందని తెలిసింది. ఈ సమా చారం అంతా ప్రభాకర్ రావు స్నేహితుడి వద్ద లభ్యమైన పెన్ డ్రైవ్, హార్డ్ డిస్క్‌లో వుందని తెలిసింది. ఈ సమాచారం ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన విచారణలో సిట్ అధికారులకు మరింత ఉపయోగ పడుతుం దని తెలిసింది. ఈ సమాచారం ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమయంలో పోలీసు శాఖలో పాటు సచివాలయంలో కీలక స్థానాల్లో వున్న బ్యూరోక్రాట్లను విచారించేందుకు సిట్ సమాయత్తమవుతోంది. వీరిని విచారించిన తరువాత అప్పటి పాలకులైన వున్న బిఆర్ఎస్ ముఖ్యులకు నోటీసులు జారీ చేసి విచారించే వీలుంది. వీరు వెల్లడించే అంశాల ప్రకారం త రువాత ఏం చేయాలనే దానిపై సిట్ నిర్ణయించే వీలుంది.

**మరోదఫా కస్టడీ లేదా లై డిటెక్టర్ పరీక్షలకు కోరనున్న సర్కారు**

ఇదిలావుండగా ప్రభాకర్‌రావు పోలీసు కస్టడీ గురువారం సాయంత్రంతో ముగియనుండడంతో ఆయనను మరో దఫా కస్టడీ లేదా లై డిటెక్టర్ పరీక్షలకు పిటిషన్ వేయాలని సర్కారు భావిస్తున్నట్లు తెలిసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు రెండు వారాలుగా ఆయన పోలీసు కస్టడీలో వుండడం తెలిసిందే. మొదట వారం రోజుల పాటు ప్రభాకర్ రావును విచారించిన పోలీసు అధికారులు సుప్రీం కోర్టు ఆదేశం మేరకు మరో వారం రోజులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. మొదటి దఫా విచారణకు ఎసిపి స్థాయి అధికారి నేతృత్వంలో విచారణ సాగగా రెండవ దఫా విచారణ సిటీ కొత్వాల్ సజ్జనార్ నాయకత్వంలోని సిట్ బృందం విచారించింది. ఇందులో ముగ్గురు ఐపిఎస్ అధికారులతో పాటు సాంకేతిక అనుభవం పట్టువున్న మరో ఐదుగురు అధికారులున్నారు. అయితే రెండవ దఫా విచారణలో ఆయన నుంచి పెన్ డ్రైవ్, హార్డ్ డిస్క్ వంటివి లభ్యమవడం మినహా పెద్దగా సమాచారం రాకపోవడంతో ఆయనను మరోదఫా కస్టడీకి ఇవ్వాలని పోలీసు శాఖ తరపున సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలయ్యే వీలుందని తెలిపింది. ఒకవేళ ఇందుకు సుప్రీం కోర్టు అంగీకరించకుండే లై డిటెక్టర్ పరీక్షలకు అనుమతించాలని కోరే వీలుంది,

# సాగుచేసే భూములకే పెట్టుబడి సాయం

>> రైతన్నలకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు సీజన్లకు రూ.8 వేలు మొదట చెల్లించింది. ఆ తర్వాత పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.5 వేలకు పెంచింది. అయితే, ఈ పథకంలో అనర్హులు లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వచ్చాయి. వ్యవసాయం చేయని వారు, బీడు భూములు, కొండలు, గుట్టలు ఉన్న భూములకు కూడా నిధులు పొందినట్లు గుర్తించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకాన్ని రైతు భరోసా పథకంగా మార్పు చేస్తూ, ఎకరాకు పెట్టుబడి సాయం రూ.6 వేలకు పెంచింది. ఈ పథకం ద్వారా అనర్హులు సైతం లబ్ధి పొందుతున్నారని రేవంత్ ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో అర్హులైన రైతులకే ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయానికి వచ్చింది. సాగు చేసే భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించారు.గతంలో రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తుండగా..అధికారంలోఉన్న రేవంత్ సర్కార్ ఎకరాకు రూ.12 వేలు సాయం అందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది.

## వారం - వర్జ్యం

25-12-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
పంచమి మ.1.39
ధనిష్ఠ ఉ.8.17, మూల కార్తె
వర్జ్యం : మ.3.41-5.20
దు.ఉ.10.17-11.02, 2) మ.2.44-3.29
శుభసమయం :ఉ.8.15-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు. మీలో దాగివున్న నైపుణ్యం వెలుగులోనికి వస్తుంది.

**వృషభం:** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. మీకు అనుకూలాంశాలు ఎక్కువగా ఉంటాయి.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వివాహ యత్నాలు లభిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:** నూతన కాంట్రాక్టులకు సంబంధించి ఒప్పందాలు చేసుకుంటారు. విహార యాత్రలు చేస్తారు.

**సింహం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. ఉద్యోగులకు పదో న్నతులు పొందుతారు. ప్రయాణాలు జాగ్రత్త.

**కన్య :** విద్యావకాశాలు పొందుతారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు. వస్త్రలాభం.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. పదవులలో, హోదాలు లభించటానికి సమయం పడుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం:** పాతబాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాహ యత్నాలు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు:** పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించటానికి కాలం కలసి రాదు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.


**మకరం:** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. ధన లాభం.బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం:** సంక్షేమ సంఘాల వలన లాభ పడతారు. మీ మేధస్సుతో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటారు.ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం:** చాలాకాలంగా పరిష్కారం కాని కుటుంబ సమస్యలు ఈ రోజు పరిష్కార మవుతాయి.వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కక్ష్యలోకి 'బ్లూ బర్డ్'




రాకెట్ ప్రయోగం విజయవంతంలో అవడంతో ఆనందోత్సాహలలో చైర్మన్ నారాయణ, ఇతర శాస్త్రవేత్తలు

>> నిప్పులు చెరుగుకుంటూ ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ నింగికి ఎగిసింది. షార్‌లోని శాస్త్రవేత్తలు, సందర్శకుల కరతాళ ధ్వనుల మధ్య రాకెట్ గమ్యస్థానం వైపు దూసుకెళ్లింది. నింగిలోకి ఎగిసిన అనంతరం 500 కిలోమీటర్ల దూరాన్ని 15 నిమిషాల 30 సెకన్లలో చేరుకుని అత్యంత బరువైన 610 టన్నుల ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది.

**రాకెట్ గమనం ఇలా..**

రాకెట్ ప్రయోగాల్లో గతంలో నాలుగు దశలు ఉండగా, ప్రస్తుత ప్రయోగం మూడు దశల్లో ముగిసింది. మొదటి దశలో స్ట్రాపాన్ బూస్టర్లలో ఉన్న 400 టన్నుల ఘన ఇంధనం మండుకుని 105.98 సెకన్ల పాటు రాకెట్‌ను నింగిలోకి తీసుకెళ్లింది. అక్కడి నుంచి రెండో దశ ప్రారంభమైంది. 110 టన్నుల ద్రవ ఇంధనంతో రాకెట్ 301.70 సెకన్లపాటు మండుతూ రాకెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లింది. మూడో దశలో కీలకమైన క్రయోజనిక్ దశ ప్రారంభమై 304.36 సెకన్ల పాటు రోదశిలోకి బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఎఎస్‌పి స్పేస్ మొబైల్ సంస్థతో ఇండియాకు చెందిన ఎన్‌ఎస్‌ఐఎల్ చేసుకున్న వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. రోదశి రంగంలో ప్రపంచ దేశాల్లో ప్రప్రథమంగా భారీ ఉపగ్రహ ప్రయోగం నిర్వహించి ఇస్రో మరో మైలురాయిని అధిగమించింది.

**భళారే బాహుబలి**

ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఎల్‌వీఎం3-ఎం6 అత్యంత బరువైన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపి బాహుబలి పేరును సార్థకం చేసుకుంది. ఎల్‌వీఎం సిరీస్‌లో ఇప్పటికి 8 ప్రయోగాలు సక్సెస్ కాగా, 9వ ప్రయోగం అమెరికాకు చెందిన బ్లూబర్డ్ భారత ఉపగ్రహం కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ ఆశించిన దాని కన్నా ఈ ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి మంచి ఫలితం అందినట్లయింది. ఇస్రోకు ఇది 104వ ప్రయోగం. ఈ ప్రయోగ విజయంతో వాణిజ్య ప్రయోగాలకు ఇస్రో రాచబాట వేసినట్లయింది. ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా ఇప్పటివరకు మూడు వాణిజ్య ప్రయోగాలు జరిగి ఉన్నాయి. ప్రస్తుతం నాలుగవ ప్రయోగం కూడా విజయవంతం కావడంతో భవిష్యత్‌లో మరెన్నో ప్రయోగాలు ఇస్రో వాణిజ్యపరంగా చేసేందుకు ఈ ప్రయోగం దోహదపడుతుంది. ప్రపంచ దేశాల్లో భారీ ప్రయోగాలు చేసే సంస్థగా ఇస్రో గుర్తింపు తెచ్చుకుంది.

**ప్రయోగ విజయం స్ఫూర్తినిచ్చింది:ఇస్రో చైర్మన్ వి.నారాయణన్**

ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగ విజయం భవిష్యత్ ప్రయోగాల నిర్వహణకు నమ్మకంతో పాటు స్ఫూర్తినిచ్చిందని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. బుధవారం ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగ విజయం అనంతరం ఆయన శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్2 వాణిజ్య ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టామని తెలిపారు. చంద్రయాన్-4, 5తో పాటు వీనస్ మిషన్, మరెన్నో ప్రయోగాలు, గగన్‌యాన్, మానవరహిత ప్రయోగం, ఎయిర్ స్పేస్ స్టేషన్ ప్రయోగాలకు ఈ రాకెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం జరిగిన ప్రయోగం అత్యంత కఠినమైనదని, భారత భూభాగం నుంచి అత్యంత బరువైన ఉపగ్రహాన్ని రోదశిలోకి పంపడం ఇదే ప్రథమమని చెప్పారు. నవంబర్ 2వ తేదీన ప్రయోగం జరిగిన తర్వాత 52 రోజుల్లో తిరిగి భారీ ప్రయోగం చేపట్టి అది విజయవంతం చేయడం ఇస్రో శాస్త్రవేత్తల కృషికి నిదర్శనమన్నారు. నాసా, ఇస్రో సంయుక్త ఆధ్వర్యంలో 10,300 కోట్ల రూపాయలతో బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు ప్రత్యేకమైన యాంటెన్నా నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమైనట్లు నారాయణన్ చెప్పారు.




బుధవారం ఖమ్మంలో సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరుపుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## మంచి ఆహారం, మెరుగైన విద్య

# ప్రతి విద్యార్థికి అందించాలి

### ఖమ్మం జిల్లాలో సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించిన డి.సిఎం భట్టి

**ఖమ్మం డిసెంబర్ 24, ప్రభాతవార్త:** నాణ్యమైన మానవ వనరులతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్య, సంక్షేమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ..రాబోయే విద్యా సంవత్సరం నాటికి మధిర నియోజకవర్గ పరిధిలో చేపట్టిన 3 మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో తీసుకుని రావాలని అన్నారు. ఆంగ్లం, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో అత్యున్నతమైన బోధన చేసే టీచర్లను గుర్తించి వారి ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు వచ్చే విద్యాసంవత్సరం నాటికి అందుబాటు లోకి తీసుకుని రావాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. జనవరి 15 లోపు ఇంటర్ విద్యా సంస్థల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని, జిల్లాలో నూతనంగా మంజూరైన 5 జూనియర్ కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. గురుకులాలకు సంబంధించి డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు ప్రభుత్వం రెగ్యులర్‌గా విడుదల చేస్తుందని, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని అన్నారు.గురుకులాలో ఉన్న పిల్లలను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నెలకు ఒకసారి విజిట్ చేసి విద్యార్థులకు హెల్త్ కార్డు తయారు చేయాలని అన్నారు. పిల్లలు కొంచెం అనారోగ్యం బారిన పడిన వెంటనే అవసరమైన చికిత్స అందించాలని ఎటువంటి నిరక్ష్యం వహించరాదని అన్నారు. గురుకులాల సందర్శన సందర్భంగా జిల్లా అధికారులు బోధన పద్ధతులు, నాణ్యమైన ఆహారం, రన్నింగ్ వాటర్, పరిసరాల పరిశుభ్రత, పిల్లల ఆరోగ్యం, అక్కడ అవసరమైన సౌకర్యాల కల్పనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి రిపోర్ట్ అందించాలని అన్నారు. భవిష్యత్తులో సంక్షేమ హాస్టల్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, అక్కడ ఏమైనా తప్పుడు రిపోర్టులు అందించినట్లు తెలిస్తే పరిశీలించిన జిల్లా అధికారులపై కూడా చర్యలు తీసుకుంటానని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆన్ లైన్ పద్ధతిలో స్పెషల్ క్లాస్ తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. గురుకులాలను వీలైనంత వరకు సొంత భవనాలలో నడపాలని, అవసరమైన చోట నూతన హస్టల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం, మంచి నైపుణ్యాలు, నాణ్యమైన సౌకర్యాలు, ఆరోగ్యం, విద్య చిన్నతనం నుండి అందిస్తే మన రాష్ట్రానికి మంచి సంపద సృష్టించే మానవ వనరులు తయారు అవుతారని అన్నారు.

# ముస్తాబైన మెదక్ చర్చి

>> స్తున్న వారిని ఆదుకోవాలన్న సదాశయంతో ఈ చర్చ్ నిర్మించడం విశేషం. సిఎస్ఐ చర్చిని నిర్మించి శతాబ్దం గడుస్తున్నా చెక్కుచెదరని అందం దీని సొంతం. మెతుకుసీమలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న సమయంలో ఆకలి దప్పికలతో అల్లాడుతున్న వారిని ఆదుకునే సదుద్దేశంతో క్రైస్తవ గురువు చార్లెస్ వాకర్ పాస్నెట్ చర్చ్‌ను నిర్మించడం జరిగింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వివిధ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మెదక్ కేథడ్రల్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ తరుణంలో మరోవైపు క్రిస్మస్ సంబరాలకు ముస్తాబైంది.పర్యాటకంగా ప్రసిద్ది చెందడంతో చర్చిని అన్ని మతాల వారు సందర్శిస్తారు.ముఖ్యంగా ఆదివారాలు, సెలవు రోజుల్లో అధికంగా తరలివస్తారు. ఆవరణలో చాలా సేపు సేద తీరుతారు. క్రైస్తవులు చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిలువ వద్ద కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించి భక్తిని చాటుకుంటారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించనుండటంతో అందుకు తగిన సన్నాహాలు చేస్తున్నారు. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్లుగా చర్చి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక దుకాణాలు, రంగుల రాట్నాలతో చర్చి ఆవరణ జాతరను తలపిస్తోంది. సుందర కట్టడంగా పేరొందిన మెదక్ కెథడ్రల్ చర్చి ఎందరో మహానుభావుల ఆర్కిటెక్ పనితనంతో ఇంకా సుభాగా విరాజిల్లుతోంది. ప్రత్యేకంగా క్రిస్మస్ సందర్భంలో దేదీప్యమానంగా వెలిగిపోతుంది.

# అసెంబ్లీ సమావేశాలకు నోటిఫికేషన్ జారీ

>> సిఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం. కాగా, మొదటి రోజు అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడిన తర్వాత బిఎసి సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీలో చర్చించే అంశాలపై అజెండాను ఆమోదించనున్నారు. 30,31, జనవరి 1వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలకు సెలవు ఇవ్వనున్నారు. జనవరి 2వ తేదీ నుంచి 3,4 రోజుల పాటు సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

## క్రిస్టియన్ సోదరులకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు 24:** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రిస్టియన్ సోదరులకు, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రమంతటా క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏసు ప్రభువు బోధనలను అనుసరించి అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. క్రిస్టియన్ మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమని అన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమే నని ఆయన ఎంచుకున్న మార్గం ఆదర్శనీయమన్నారు.

## రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు 24:** యేసుక్రీస్తు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని, మాజీ ముఖ్యమంత్రి,బిఆర్ఎస్ అధినేత, కె. చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.పాపులను సైతం క్షమించమనే త్యాగశీలత, ఓర్పు, సహనం, మానవ సమాజానికి క్రీస్తు చూపిన అత్యద్భుతమైన అహింసా శాంతి మార్గమని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రిస్టియన్ మైనారిటీలకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను దేశానికే ఆదర్శంగా అమలు చేశామని తెలిపారు.క్రిస్మస్ పర్వదినాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సెక్యులర్ సంప్రదాయాన్ని అమలులోకి తెచ్చిందని గుర్తు చేశారు.పీడన నుంచి విముక్తి లభించేలా దీవిస్తూ, రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని యేసు క్రీస్తును కేసీఆర్ ప్రార్థించారు.

## బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఎంఐఎం కీలక మధ్యవర్తి
## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు 24:** రాజకీయాలు కేవలం అధికార సాధనకే పరిమితం కాకుండా, విలువలను రాబోయే తరానికి అందించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. గతంలో రాజకీయ ఫిరాయింపులను అరికట్టేలా యాంటీ డిఫెక్షన్ చట్టం తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ. అయితే ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీడిఫెక్షన్‌లా నియమాలను పూర్తిగా పక్కనపెట్టింది. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని తప్పుపట్టారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ .పార్టీలు మారిన ఎమ్మెల్యేలు... తాము ఏ పార్టీలో ఉన్నారో కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితి రావడం తెలంగాణ రాజకీయాల దౌర్భాగ్యం అని వ్యాఖ్యానించారు. గ్రామ పంచాయతీలకు రూ.3000 కోట్లు వస్తాయని కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, ఆ నిధులు కేంద్ర ప్రభుత్వమే అందిస్తున్నాయి. 72, 73వ రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు నిధులు రావాలంటే స్థానిక సంస్థల ఎన్నికలు తప్పనిసరిగా జరగాలన్నారు.. అయితే ఎన్నికలను ఆలస్యం చేయడం వల్లే ఆ నిధులు ఆలస్యం అయ్యాయి. దీనికి పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు..ఎంఐఎం ఎప్పుడూ అధికారంలో ఏ పార్టీ ఉంటే .. ఆ పార్టీతో అంటకాగుతుంది. గతంలో బీఆర్ఎస్‌తో దోస్తీ చేసిన ఎంఐఎం ఇప్పుడు కాంగ్రెస్‌తో అంటకాగుతోంది. అసలు ఆ పార్టీలకు నైతిక విలువలే లేవన్నారు.

# రెండు వారాల్లో యుపిఎస్‌సికి డిజిపి ఎంపిక ప్యానెల్

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

### జనవరిలో జాబితాను పంపనున్న సర్కారు?

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఎంపికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం మరోసారి విచారణ జరిగిందఇ. శివధర్ రెడ్డి ఎంపిక నిబంధనల మేరకు జరగలేదని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్‌సికి ఎలాంటి జాబితాను పంపలేదని పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, డిజిపి ఎంపిక నిబంధనల మేరకు మరోసారి జరపాలని ఆయన కోరారు. దీనిపై వారం రోజుల క్రితం విచారణ చేసిన హైకోర్టు బుధవారం నాడు మళ్లీ విచారించింది. అనంతరం దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితాను సీనియారిటీ ప్రకారం యుపిఎస్‌సికి పంపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే డిజిపిగా శివధర్ రెడ్డి నియామకం విషయంలో తాము జోక్యం చేసుకోబోమని పేర్కొన్న హైకోర్టు దీనిపై విచారణను రెండు వారాలు వాయిదా వేసింది. కాగా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితాను సీనియారిటీ ప్రకారం యుపిఎస్‌సి పంపేం దుకు సర్కారు సిద్దమవుతోంది. పోలీసు శాఖలో సీనియారిటీ ప్రకారం 1991 బ్యాచ్ అధికారి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్ సీనియర్. ఆయన తరువాత 1994 బ్యాచ్‌లో కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే ద్వితీయ స్థానంలో వున్నారు. వీరిద్దరి తరువాత ఇ దే బ్యాచ్‌కు చెందిన డిజిపి శివధర్ రెడ్డి మూడవ స్థానంలో వున్నారు. వీరి తరువాత ఇదే బ్యాచ్‌కు చెందిన తెలంగాణ పోలీసు అకాడమి డైరక్టర్ అ భిలాష్ బిస్త్, ఆమె తరువాత జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, ఆమె తరువాత తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్‌గా వున్న శిఖా గోయల్ సీనియర్లుగా వున్నారు. అయితే డిజిపి ఎంపికలో కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే పేరును పరిగణలోకి తీసుకునే అవకాశాలు లేవని తెలిసింది. దీంతో మిగతా వారి పేర్లను మాత్రమే పరిగణలోకి తీసుకునే వీలుంది. ఈ లెక్కన డిజిపి ఎంపికలో నలుగురి పేర్లను ప్రభుత్వం యుపిఎ స్‌సికి పంపాలని అనుకుంటే ఆనంద్, శివధర్ రెడ్డి, అభిలాష్ బిస్త్, సౌమ్యా మిశ్రా పేర్లను పంపే వీలుంది. ఒకవేళ ఐదుగురి పేర్లను పంపాలని అ నుకుంటే వీరితో పాటు శిఖా గోయల్ పేరును కూడా పంపే వీలుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన పేర్లలో ముగ్గురిని యుపిఎస్‌సి ఎంపిక చేసి ఈ జా బితాను తిరిగి రాష్ట్రానికి పంపుతుంది. ఇదంతా నిబంధనల మేరకు జరిగే ప్రక్రియ. ఈ జాబితా నుంచి ఒకరిని రాష్ట్రం డిజిపిగా ఎంపిక చేసుకునే వీలుంది. రాష్ట్రం నుంచి వచ్చే జనవరిలో యుపిఎస్‌సికి డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితా వెళ్లే వీలుంది. అనంతరం అదే నెలలో యుపిఎస్ సి నుంచి ఎంపికకు సంబంధించిన జాబితా తిరిగి వచ్చే వీలుంది. దీని తరువాత డిజిపి ఎంపిక ఖరారవుతుంది. గతంలో అనురాగ్ శర్మ, మహేం దర్ రెడ్డిల విషయంలో ఇలాగే జరిగింది. ఈ కారణంగా అనురాగ్ శర్మ మూడేళ్లకు పైగా మహేందర్ రెడ్డి ఐదేళ్లకు పైగా డిజిపిగా విధులు నిర్వహిం చ గలిగారు. ఒకవేళ శివధర్ రెడ్డిని యుపిఎస్‌సి పంపిన జాబితా నుంచి రాష్ట్రం ఎంపిక చేస్తే ఆయన కచ్చితంగా రెండేళ్ల పాటు డిజిపిగా విధులు ని ర్వహించాల్సి వుంటుంది. ఆయన వచ్చే యేడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన మళ్లీ పూర్తిస్థాయి డిజిపిగా పదవీబాధ్యతలు చేబడితే మరో రెండేళ్లపాటు ఆ పదవిలో వుంటారు. ఎపి డిజిపి హరీష్‌గుప్తా ఇలాగే కొనసాగుతున్నారు.

## నాన్‌కేడర్ ఎస్‌పిలు, అదనపు ఎస్‌పిల బదలీలు

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలుచోట్ల పనిచేస్తున్న ముగ్గురు నాన్ కేడర్ ఎస్‌పిలు, నలుగురు అదనపు ఎస్‌పిలను బదలీ చేస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పోలీసు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎస్‌పిగా వున్న కె. ప్రసాద్‌ను సిఐడిలో బదిలీ చేయగా వరంగల్ పోలీసు శిక్షణా కళాశాలలో ప్రిన్సిపాల్‌గా వున్న పూజను కమాండ్ కంట్రోల్‌లో నియమించారు. సి డిలో ఎస్‌పిగా వున్న వెంకటలక్ష్మిని సిటీ పోలీసు పరిపాలన విభాగంలో డిసిపిగా నియమించారు. కాగా పౌర సరఫరాల విభాగంలో అదనపు ఎస్‌పి గా వున్న సూర్యనారాయణను ఎసిబికి బదలీ చేయగా నగర పోలీసు విభాగంలోని పశ్చిమ మండల అదనపు డిసిపిగా వున్న గోవర్ధన్‌ను సైబరాబాద్ ఎస్‌ఓటిలో నియమించారు. వెయిటింగ్‌లో వున్న అదనపు ఎస్‌పి నరేందర్‌ను నిఘా విభాగంలో నియమించగా, సిఐడిలో వున్న సుదర్శన్‌ను బాలా నగర్ అదనపు డిసిపిగా బదలీ చేశారు.

# పెన్సిల్ గొంతులో గుచ్చుకుని బాలుడి మృతి

## ప్రైవేటు పాఠశాల ఆవరణలో విషాదం

**కూసుమంచి, డిసెంబరు 24 ప్రభాతవార్త :** పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పెన్సిల్ గొంతులో గుచ్చుకుని ఓ బాలుడు దుర్మరణం చెందిన ఘటన కూసుమంచి మండలం, నాయకన్ గూడెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక చందన స్కూల్‌లో యూకేజీ చదువుతున్న నాయకన్ గూడేనికి చెందిన మేడారపు ఉపేంద్రాచారి పెద్దకుమారుడు మేడారపు విహార్ (8) బుధవారం మధ్యాహ్నం పాఠశాలలో విరామ సమయంలో పరుగెత్తుకుంటూ వస్తూ కిందపడిపోయాడు. దీంతో విద్యార్థి వద్ద ఉన్న పెన్సిల్ బాలుడి గొంతులో గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగి విలవిల్లాడుతుండగా గమనించిన ఉపాధ్యాయులు ఏం జరిగిందో తెలుసుకునే లోపే బాలుడు అపస్మారక స్థితిలోకి వెల్లడంతో హుటాహుటిన దగ్గరలోని ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. పరీక్షి ంచిన ఆర్‌ఎంపీ బాలుడు పరిస్థితి గమనించి వెంటనే ఖమ్మం తీసుకెళ్లమని సూచించడంతో, తల్లిదండ్రులకు విషయం తెలిపి, ఉపాధ్యాయులు 108కు సమాచారం అందించారు. ఆంబులెన్స్ రాగానే తల్లిదండ్రులు అందులో కూసుమంచి ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లారు. అక్కడ పరీక్షి ంచిన వైద్యాధికారి అప్పటికే బాలుడు మరణించినట్లు ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటనతో పాఠశాలలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విహార్ అకాల మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

# కొత్త సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వాడకంపై ఈగల్ ఫోర్స్ నజర్

## బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్, న్యూఇయర్ వేడుకల నిర్వాహకులు డ్రగ్స్ వాడరాదని హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** ఈ నెల 31వ తేదీ రాత్రి నూతన సంవత్సరం సందర్భంగా జం ట నగరాలు, శివార్లలో జరిగే వేడుక లపై ఈగల్ ఫోర్స్ (పూర్వపు టి.నాబ్) దృష్టి సారించింది. న్యూ ఈయర్ వేడుకల్లో మాదకద్రవ్యాల వాడకాన్ని ఎవరూ ప్రోత్సహించరాదని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే నిర్వాహకు లతో పాటు పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు ఈ విషయంలో కచ్చితంగా వుండాలని ఎవరైనా డ్రగ్స్ వాడకాన్ని ప్రోత్సహించినా, అ మ్మకాలు జరిపినా వెంటనే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్‌తో పాటు ఈ సిగరెట్లను కూడా నిషేధించామని, వీటిని ఎవరూ వాడవద్దని ఆ యన కోరారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పబ్‌లతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లలో మైనర్లకు మద్యం అందుబాటులో వుంచకూడదని ఆయన తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా మైనర్లు మద్యం సేవించి పట్టుబడితే వారితో పాటు వారికి మద్యం సరఫరా చేసిన వారు కూడా అరెస్టవుతారని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్రాన్ని నిషా విముక్త్ ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈగల్ ఫోర్స్ పనిచేస్తుందని, దీనికి అన్ని వర్గాల మద్దత్తు కావాలని ఆయన కోరారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వాడకంపై ఉక్కుపాదం మోపేందుకు ట్రై కమిషనరేట్ల పోలీసులు ఇప్పటికే ప్రత్యేక బృందాలను రంగంలో దించారని, దీనికి అదనం గా ఈగల్ ఫోర్స్ తరపున మాదకద్రవ్యాల స్మగ్లర్ల భరతం పట్టేందుకు సొంత బృందం రంగంలో దిగుతోందని సందీప్ శాండిల్యా తెలిపారు. నూతన సంవతన్సర వేడుకల్లో ఎవరైనా డ్రగ్స్ వాడితే వె ంటనే 8712671111కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే.. నా ప్రయాణం కాంగ్రెస్‌తోనే

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్




**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 24, ప్రభాతవార్త:** తాను పక్కాగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అందులో ఎలాంటి సందేహం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. తాను ఏ పార్టీలో ఉంటే అదే గెలుస్తుందని, అదే తన స్పెషాలిటీ అని ఆయన ఛలోక్తి విసిరారు. బంజారాహిల్స్ జహీరానగర్, సింగాడిబస్తీలో జలమండలి అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపే లక్ష ్యంగా వచ్చే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో హైదరాబాద్ నగరంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే తమ లక్ష ్యంగా పని చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం నగరం మొత్తం కలియ తిరిగి పార్టీని బలోపేతం చేస్తానని ప్రకటించారు. ఎంఐఎంతో కలిసి ప్రచారం చేసి నగరంలోని దాదాపు 300 డివిజన్లలో తాను పర్యటిస్తానని దానం తెలిపారు. ము ఖ్యంగా కాంగ్రెస్ పార్టీతో పాటు, మిత్ర పక్షంగా ఉన్న ఎంఐఎం అభ్యర్థుల గెలుపు కోసం కూడా తాను ప్రచారం చేస్తానని ఆయన వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల కూటమి సత్తా చాటుతుందని, ప్రజల మద్దతు తమకే ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇంత బడ్జెట్ ఇచ్చి, అభివృద్ధి కార్యక్రమాలఉల చేస్తుంటే కాంగ్రెస్ కాకుండా మరో పార్టీ ఎలా గెలుస్తుందన్నారు. ఫిరాయింపులపై సెటైర్లు, పార్టీ మార్పుల గురించి వస్తున్న వార్తలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. ఇతర ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో, ఎటు వెళ్తున్నారో తనకు తెలియదని, కానీ తాను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణం కాంగ్రెస్‌తోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లేని 1,441 పాఠశాలలు తాత్కాలిక మూసివేత

## ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రులు కోరితే మళ్లీ తెరవడానికి సిద్ధం

## తెలంగాణ పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** రాష్ట్రంలో విద్యార్థులు లేని జీరో ప్రభుత్వ పాఠశాలలపై పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు లేని పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వాటిని ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం గణాంకాల్లో చూపించరు. ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తెలంగాణలో అధికంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరపు లెక్కల ప్రకారం తెలంగాణలో ఇలాంటి పాఠశాలలు 2,245 ఉన్నాయి. పాఠశాల విద్యా శాఖ పరిధిలో 2 వేలకు పైగా పాఠశాలలు ఉండగా, వాటిలో 1,441 చోట్ల విద్యార్థులు లేరు.

ఉపాధ్యాయ పోస్టులు కూడా లేవు. మరో 600 పాఠశాలల్లో విద్యార్థులు లేకున్నా ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతానికి 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసి వేయనున్నారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలు పని చేయడం లేనందున తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గ్రామస్థులు తమ పిల్లలను బడికి పంపిస్తామని కోరితే పాఠశాలలను తిరిగి తెరుస్తామని, ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మారుమూల శివారు తండాల్లో కూడా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది 200 పాఠశాలలను కొత్తగా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు.

# నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

## నన్ను ఎవరూ ఆపరేట్ చేయలేరు

## జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన జాగృతి జనం బాట కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల బాణానని, తనను ఎవరూ ఆపరేట్ చేయడం లేదని జాగృతి వ్యవస్థాపకురాలు కవిత స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన జాగృతి జనం బాట కార్యక్రమంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 2029 ఎన్నికలు వస్తాయని భావిస్తున్నామని, ఆ ఎన్నికల్లో జాగృతి కచ్చితంగా బరిలో ఉంటుందని తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటివరకు పార్టీ స్పష్టమైన కారణం చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉరి వేసే వ్యక్తికైనా కారణం చెబుతారని, కానీ తన విషయంలో మాత్రం ఎలాంటి వివరణ ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌లో జరిగిన తప్పులకు ఆ పార్టీలో ఉన్న సమయంలో తానూ భాగస్వామి నేనని ఒప్పుకుంటూ, ప్రజలకు జరిగిన అన్యాయానికి క్షమాపణలు తెలిపారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో పెద్దల భూములను కాపాడేందుకు పేదల భూములను బలి పెడుతున్నారని ఆరోపించారు. నాయకుల అవినీతి కోసం ఇష్టాను సారం అలైన్‌మెంట్లు మార్చారని తెలిపారు. దీనిపై జాగృతి తరఫున క్షేత్రస్థాయిలో ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. జనవరి 5న హైదరాబాద్‌లో బాధిత రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్ట్‌లో భాగంగా బస్వాపూర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 11.7 టీఎంసీకి పెంచినా ఇప్పటివరకు చుక్క నీరు కూడా రాలేదన్నారు. కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీ ఛానెల్స్ పూర్తి కాలేదని, 96 ఎకరాల భూములకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా తీసుకున్నారని విమర్శించారు. కలెక్టర్ చొరవ తీసుకుని వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జాగృతి ఓట్ల కోసం వచ్చిన సంస్థ కాదని, ప్రజల సమస్యలపై పోరాడే ఉద్యమని కవిత స్పష్టం చేశారు. 19 ఏళ్లుగా జాగృతి పేరుతో ప్రజల్లో ఉన్నానని, తెలంగాణ భాష, యాస, సంస్కృతి కోసం ఉద్యమం చేశామని గుర్తు చేశారు. బతుకమ్మ, బోనాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా కృషి చేశామని తెలిపారు. భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎయిమ్స్‌లో ఇప్పటికీ ఎమర్జెన్సీ మందులు లేని పరిస్థితి ఉందని తెలిపారు. కేంద్రం నుంచి రూ.750 కోట్లు వచ్చినా భవన నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని విమర్శించారు. భవనాలను త్వరగా పూర్తి చేసి, ఎయిమ్స్‌లో వచ్చే ఉద్యోగాల్లో 80 శాతం స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకా యిలు వెంటనే చెల్లించకుండా పేద విద్యార్థులను ప్రభుత్వం అవమానిస్తోందని ఆరోపించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని విమర్శించారు. ఎక్కడ జాగృతి పర్యటన చేసినా అక్కడి సమస్యలను ఫాలోఅప్ చేస్తామని, పటిష్టమైన క్యాడర్‌ను నిర్మించి ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.




మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వారిని పోలీస్ అరెస్ట్ చేసిన దృశ్యం

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

## ప్రియుడు, ప్రియురాలు అరెస్ట్

## కాకినాడ యువతి హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్మకం


**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబర్ 24, ప్రభాతవార్త :** మహానగరం క్రమంగా మత్తు పదార్థాల ప్రభావంలో చిక్కుకుంటోంది. తాజా లెక్కల ప్రకారం హైదరాబాద్‌లోనే 10 వేల మందికి పైగా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు అంచనా ఉంది. ఇప్పటి వరకు డ్రగ్స్ సరఫరాలో నైజీరియన్ గ్యాంగులు, అంతర్రాష్ట్ర ముఠాలే ప్రధానంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు చదువుకున్న, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారే డ్రగ్స్ విక్రయాల్లోకి రావడం నగరాన్ని కలవరపెడుతోంది. బీటెక్ పూర్తి చేసి, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఓ యువతి డ్రగ్స్ అమ్మకాల్లో పాల్గొని పోలీసులకు చిక్కడం ప్రస్తుతం హైదరాబాద్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఏపీలోని కాకినాడకు చెందిన సుస్మిత అనే యువతి హైదరాబాద్‌కు వచ్చి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. ఆమె తన బాయ్‌ఫ్రెండ్ ఇమ్మాన్యుయెల్‌తో కలిసి డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిద్దరితో పాటు మరో ఇద్దరిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఎండీఎంఏ, ఎల్‌ఎస్డీ బాటిళ్లు, ఓజీ కుష్ వంటి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీసులు - హెచ్‌ఎన్‌ఈడబ్ల్యూ, చిక్కడపల్లి పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి, (01) స్థానిక డ్రగ్ పెడ్లర్, (02) స్థానిక డ్రగ్ సబ్ పెడ్లర్లు మరియు (01) వినియోగదారుడిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 22 గ్రాముల ఓజీ (హైడ్రోఫోనిక్ గంజాయి), 5 గ్రాముల ఎండిఎంఎ, 5.57 గ్రాముల ఎక్స్‌టసీ మాత్రలు, 06 ఎల్‌ఎస్‌డి బ్లాట్స్, 04 మొబైల్ ఫోన్లు, రూ. 50,000/ నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో కొండాపూర్ ప్రాంతానికి చెందిన ఈవెంట్ మేనేజర్ ఉమ్మిడి ఇమ్మాన్యుయేల్( (25 ), స్థానిక డ్రగ్ సబ్‌పెడ్లర్ల చోడవరుపు సుస్మితా దేవి లిల్లీ ( 21 ) , రాపిడో స్విగ్గీ డెలివరీ బాయ్ గోర్ల సాయి కుమార్ ( 28 ), వినియోగదారుడు, చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన తలబత్తుల తారక లక్ష్మీ ్మకాంత్ అయ్యప్ప, ( 24 ) లను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ లావాదేవీల కోసం గతంలో ఫోన్ కాల్స్, వాట్సాప్ వంటివి ఉపయోగించేవారు. అయితే వాటిని గుర్తించే అవకాశం ఎక్కువగా ఉండటంతో ఇటీవల టెలీగ్రామ్ యాప్ ద్వారా రహస్యంగా వ్యవహారాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. చదువుకున్న యువతే ఈ తరహా నేరాల్లో భాగస్వాములవడం హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియా ఎంత లోతుగా విస్తరించిందో చెబుతోంది.



# తైవాన్‌లో తీవ్రస్థాయి భూకంపం

## రిక్టర్ స్కేలుపై 6.1గా నమోదు

**తైపేయి, డిసెంబరు 24:** తైవాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఆగ్నేయ తీరప్రాంత కౌంటీ అయిన టైటుంగ్‌లో బుధవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదైంది. ఈ ప్రభావంతో రాజధాని తైపీ లో భవనాలు కుప్పకూలిపోయాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం.. భూకంపం భూమికి 11.9 కిలో మీటర్ల లోతులో నమోదైంది. స్థానిక మీడియా సంస్థ తైవాన్ న్యూస్ ప్రకారం.. భూకంపం కేంద్రం టైటుంగ్ కౌంటీ హాల్‌కు ఉత్తరాన 10 కిలోమీటర్ల దూరంలో ఉంది.



# 15 గ్రామాల్లో మహిళలు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నిషేధం

## రాజస్థాన్ జాలోర్ జిల్లాలో గ్రామపెద్దల 'ఫోన్' పంచాయితీ

**జాలోర్(రాజస్థాన్), డిసెంబరు 24:** ప్రపంచం మొత్తం 6జివైపు దూసుకుపోతుంటే రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాలోని 15 గ్రామాలు మాత్రం స్మార్ట్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు పెట్టాయి. గ్రామాల్లోని మహిళలు కేవలం కీప్యాడ్‌ఫోన్లు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. సంధమాత పట్టి పంచాయత్‌లోని చౌదరి కమ్యూనిటీ ఈమేకు మహిలలు, బాలికలు స్మార్ట్‌ఫోన్లు వినియోగించకూడదని నిషేధం విధించింది. దీనివల్ల మొబైల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని గ్రామపెద్దలు ఆరోపిస్తు చిన్నారుల్లో కంటిచూపులోపాలు కూడా పెరుగుతున్నట్లు చెప్పారు. వచ్చేనెల 26వ తేదీనుంచి ఈ నిషేధం నిర్ణయాలు అమలులో ఉంటాయి. మహిలలు కేవలం కీపాడ్‌ఫోన్లు మాత్రమే వినియోగించాలి. అలాగే పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలయాలకు ఫోన్లు కూడా తీసుకువెళ్లకూడదు. ఇరుగుపొరుగు ఇళ్లకు వెళ్లినా వెంట ఫోన్లు తీసుకెళ్లకూడదని ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన పంచాయతీ తీర్మానం చదువుతున్న పెద్దతోపాటు ఇతర పెద్దల విడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. కెమేరా ఉన్న ఫోన్లు మహిలలు వాడకూడదు. మాట్లాడేందుకు కెమేరాలేని కీపాడ్‌ఫోన్లమాత్రమే వాడాలి. విద్యార్థినులు ఇళ్లనుంచి వెళ్లేటపుడు బయటకు ఫోన్లు తీసుకెళ్లకూడదు. పాఠశాల వెళ్లే బాలికలు మాత్రం ఇంట్లో ఫోన్లు వాడుకోవచ్చు. బయటి ఫంక్షన్లకు వీటిని తీసుకెళ్లకూడదు. మహిళలకు స్మార్ట్‌ఫోన్లు ఉండటం వల్ల పిల్లలు వాటిని తీసుకుని బానిసలవుతున్నారని అందువల్లకంటిచూపు లోపిస్తోందని పెద్దలు చెపుతున్నారు. గాజిపూర్‌గ్రామంలోజరిగినీ పంచాయతీలో తీర్మానం చేసారు. పట్టి కులానికి చెందిన అద్యక్షుడు సుజన్‌రామ్ చౌదరి ఈ తీర్మానం ప్రతిపాదించారు. ఈ కులపెద్దల నాయకత్వం ప్రకారం పంచ్ హిమమ్మతరం ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఈ నిర్ణయం ఇతర గ్రామాల్లోకూడా అమలుచేస్తున్నారు. భిన్మల్ ప్రాంతంలోని ఘాజిపూర్, పావాలి, కల్డా, మనోజ్‌ఉయావాస్, రాజికవాస్, దాట్లవాస్, రాజ్‌పుర, కోడి, సిద్‌రోడి, ఆల్డి, రోప్సి, ఖండేల్వాల్, సావిధర్, హత్మికి ధని, ఖాన్‌పూర్ తదితర పంచాయితీల్లోకూడా ఈతీర్మానం అమలవుతోంది. సోషల్ మీడియాలో తీవ్రస్థాయి విమర్శలు వెల్లువెత్తాయి. మహిళా హక్కుల సంఘాలు కూడా విమర్శించాయి. మహిళా వ్యతిరేకిగా ఈ తీర్మానం ఉందని, మహిళలపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు పెరిగాయి.

# పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర చిన్నారుల విక్రయ ముఠా

## 11 మంది అరెస్టు - ఇద్దరు చిన్నారులను కాపాడిన పోలీసులు

## నిందితులకు గోపాలపురం సృష్టి కేసుతో సంబంధం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి రితురాజ్ తదితరులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 24, ప్రభాతవార్త:** రోజుల వయస్సు ఉన్న చిన్నారులను వి క్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠా సైబరాబాద్ పోలీసుల చేతికి చిక్కింది. ఈ ముఠాలోని మొత్తం 11మందిని అరెస్టు చేసిన పోలీసులు వీరి వద్ద నుంచి 10 రోజుల వయస్సు ఉన్న ఇద్దరు శిశువులను కాపాడి శిశువిహార్‌కు తరలించారు. గతంలో నగరంలోని గోపాలపురంలో సంచలనం స ృష్టించిన స ృష్టి కేసులో నిందితులుగా ఉన్న పలువురు ఈ ముఠాలో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. పాత కేసుల్లో బెయిలు మీద విడుదలైన నిందితులు మరోసారి పిల్లల అక్రమ రవాణా చేపడుతూ మియాపూర్ పోలీసులకు చిక్కారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి రితురాజ్ వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కడప జిల్లాకు చెందిన వి.బాబురెడ్డి(49) నగరానికి వచ్చి మేడ్చల్‌లో నివాసం ఉంటూ ఐవిఎఫ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈస్ట్‌గోదావరి జిల్లా నుంచి నగరానికి వచ్చి సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్న వి.గంగాధర్‌రెడ్డి(39) సైతం గతంలో ఐవిఎఫ్ ఏజెంట్‌గా పనిచేశాడు. వీరు తమ అనుచరులతో గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకొని శిశువుల అక్రమ రవాణా, అక్రమ విక్రయాలకు పాల్పడసాగారు. వీరు స్పెర్మ్ డొనేషన్, ఐవిఎఫ్ ఏజెంట్, సరోగసి ఏజెంట్లుగా సైతం వ్యవహరించారు. తమ అనుచరులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులలో ఉండి అప్పుడే ప్రసవించిన కుటుంబాలను కలిసి డబ్బు ఆశ చూపించి శివుశులను కొనుగోలు చేస్తుంటారు. అనంతరం పిల్లలు లేక ఇబ్బందులు పడుతున్న వారికి లక్షల రూపాయలకు సదరు శిశువులను విక్రయించసాగారు. గంగాధర్‌రెడ్డి గతంలో నగరంలోని గోపాలపురం స ృష్టి కేసులో అరెస్టయి జైలుకు వెళ్లాడు. గతంలో ఇతనిపై 13 కేసులు నమోదయ్యాయి. బాబురెడ్డి మీద సైతం గతంలో రెండు కేసులు ఉండగా, అరెస్టయి జైలుకు వెళ్లాడు. గతకొన్ని రోజుల క్రితం జైలు నుంచి విడుదలైన వీరు తమ అనుచరులతో కలిసి మరోసారి చిన్నారుల అక్రమ రవాణా చేపడుతున్నారు. కొత్తగూడెం జిల్లా మనుగూరుకు చెందిన దారం లక్ష్మి(28), జగద్గిరిగుట్టకు చెందిన సంగీతాదేవి(33), మూసాపేట్‌కు చెందిన కె.హర్షరాయ్(31)లను తన అనుచరులుగా చేసుకొని వీరి ద్వారా గుజరాత్ ఆహ్మదాబాద్‌లోని తల్లిదండ్రుల వద్ద 10రోజుల వయస్సు ఉన ్న శిశువును కొనుగోలు చేశారు. ఇదే తరహాలో బాబురెడ్డి సైతం తన అనుచరులు నారపల్లికి చెందిన సుజాత(40), సికింద్రాబాద్‌కు చెందిన అనురాధ(55), బేగంపేటకు చెందిన జ్యోతి(35), చింతల్‌కు చెందిన మాధవి(28)లతో కలిసి సిద్దిపేట జిల్లా రామన్నపేటలో మద్యవర్తి ద్వారా 10 రోజుల శిశువును కొనుగోలు చేశారు. వీరికి జీడిమెట్లకు చెందిన రామ్ హరిరాయ్(37), ముషిరాబాద్‌కు చెందిన శోభ(44)లు సైతం జత కలిశారు. వీరంతా కొనుగోలు చేసిన శిశువులను నగరానికి తరలిస్తుండగా, సమాచారం అందుకున్న మియాపూర్, ఎస్‌ఓటీ శంషాబాద్ పోలీసులు 11మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ఇద్దరు శిశువులను రక్షించి శిశువిహార్‌కు తరలించారు. అప్పుడే పుట్టిన శిశువులను డబ్బు ఆశ చూపించి కొనుగోలు చేసి ఎక్కువ డబ్బుకు పిల్లలు లేని దంపతులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులందరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు నిందితులకు ఐవిఎఫ్ సెంటర్లు, ఆసుపత్రులతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా, శిశువులను విక్రయించిన మద్యవర్తులు, తల్లిదండ్రుల వివరాల సేకరిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ ముఠా ఎంత మంది శిశువులను విక్రయించారనే విషయాలను సైతం విచారణలో తెలుస్తుందని అన్నారు. సమావేశంలో ఎస్‌ఓటీ డిసిపి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్త

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.

-ఐ.జాన్సన్

# ముదిమిలోనూ ఊరట!

వృద్ధాప్య వేగాన్ని వ్యాయామం ద్వారా తగ్గించుకోవచ్చునంటే ఓస్ ఇంతేనా!? అని అనిపిస్తుంది. అలా అనడమే తప్ప రోజూ ఓ అరగంట వ్యాయామం చేద్దామంటే అసలు తీరికే చిక్కదు.ప్రతి ఒక్కరు తమ జీవనశైలిని ఎప్పటికప్పుడు ఒత్తిడి, నిద్ర లేమి, ఊబకాయాల దుష్ప్రభావాల నుంచి బయటపడే స్థాయిలోకి మార్చుకోవాలంటే కాస్త కష్టమే మరి! అలా మార్చుకోకపోతే ఆరోగ్య రీత్యా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని 'న్యూ సైంటిస్ట్' అనే శాస్త్ర విజ్ఞాన ఆంగ్ల పత్రిక ఒక అధ్యయన వ్యాసంలో ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా వృద్ధాప్య ఛాయలు తమ సహజ పెరుగుదలతో నిమిత్తం లేకుండా ముందస్తుగానే హెచ్చరించే పరిస్థితి కనపడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి, వేడిమి,ఊబకాయం, హృద్రోగాలు, కేన్సర్ మనుషుల సహజ వయసుపై ప్రభావం చూపుతున్నాయన్న విషయం విదితమే. వాటి తీవ్రత తెలుసుకోకపోతే ముందస్తు మరణాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా గతంలో కంటే వేగంగా వృద్ధాప్యం తరుముకొస్తున్నట్లు వస్తున్న తాజా అధ్యయనాలు కొంత భయపెట్టేవే. అయితే ఇలాంటి ప్రమాదాన్ని తగ్గించుకోగల అవకాశాలపై శాస్త్రవేత్తల పరిశోధనలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఒకనాడు వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు ఇప్పుడు అంతకన్నా చిన్న వయసులోనే సంక్రమిస్తున్నాయని వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో తాజాగా జరిగిన అధ్యయనంలో తేలింది. 1965కి ముందు జన్మించిన వ్యక్తులలో, ఇటీవలి దశాబ్దాలలో పుట్టిన వారిలో కంటే నిదానంగా వృద్ధాప్యపు ఛాయలు కనిపిస్తున్నాయి. 1965 తర్వాత జన్మించిన వారు ఎక్కువ ప్రభావానికి లోనవుతున్నారని, వీరికే వార్ధక్య లక్షణాలు కనపడుతున్నాయని గుర్తించింది. వృద్ధాప్యం, వృద్ధాప్య బాధలు,వ్యాధుల లక్షణాలు, సంక్రమిస్తున్న వ్యాధులపై జరిగిన అధ్యయనంలో ఎన్నో విషయాలను శాస్త్రజ్ఞులు గుర్తించారు. 2016లోఊబకాయంపై అధ్యయనం చేస్తున్న స్పెయిన్ వైద్య పరిశోధకులబృందం గుర్తించింది. ఊబకాయ జీవ సంబంధమైన ప్రభావాలు వృద్ధాప్యాన్ని ముందే తెస్తున్నాయని చెప్పారు.ఊబకాయం వల్ల కొవ్వు కణాలు పెరిగే పరిస్థితులు, ఆ తర్వాత అవి కరిగే అంశాల్ని పరిశీలించి చూస్తే వ్యాయామం వల్లకలిగే ప్రయోజనాలు తెలుస్తాయి. సామర్థ్యం క్షీణించటం, జీవ క్రియల్లో చురుకుదనం తగ్గటం, వాతం మూలంగా కండరాలు, ఎముకలు, గుండె నాళాల వ్యవస్థ సహా శరీరంలోని అనేక అవయవాల పనితీరు సన్నగిల్లటం ఇందుకు కారణమని పరిశోధకుల శాస్త్రీయ అంచనా. నిరుడు వాషింగ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధన శాలలలో శీఘ్ర వృద్ధాప్యాలను గమనించేందుకు 1లక్ష 50వేల మంది రక్త నమూనాలను ప్రదర్శించారు.ఆ నమూనాలన్నీ 37నుంచి 54 ఏళ్ల వయసు వారివే. ఆ పరిశోధనలో 1965 తర్వాత జన్మించిన వారిలో 17శాతం వృద్ధాప్య ఛాయలు ఎక్కు వ వేగవంతంగా ఉన్నట్లు తేలింది.వారిలో ముందుగానే ఊపిరితిత్తులు, జీర్ణావయవ, గర్భాశయ, పేగు క్యాన్సర్లు వచ్చే సంకేతాలు కనిపించాయి. నడి వయస్కులు కేవలం ఊబకాయం వల్లనే వృద్ధాప్యానికి చేరువవుతున్నారని నిర్ణయించారు. వరల్డ్ ఒబెసిటీ ఫెడరేషన్ డేటా ప్రకారం 519ఏళ్ల వారిలో ఊబకాయం రేట్లు 1975 - 2022మధ్య సుమారు 1000 శాతం వరకు పెరిగాయి. జీవనశైలిలో మార్పులు చేసుకోవటం ద్వారా ఊబకాయాన్ని,వృద్ధాప్య వేగాన్ని తగ్గించుకోవచ్చని శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. వయోవేగాన్ని గుర్తించి వారు అంత వేగంగా ఎందుకు వృద్ధాప్యంలోకి జారుకుంటున్నారో తెలుసుకునేందుకు 'ఎపి జెనెటిక్' పరీక్ష చేస్తారు.తద్వారా ఆ వ్యక్తి డీఎన్ఏలో మార్పులను గమనించి వారి వృద్ధాప్యవేగాన్ని అంచనా వేస్తారు. దానిని బట్టి కూడా పలు జాగ్రత్తలు తీసుకునే వీలుంది. ఇది రోజువారీ ప్రక్రియ కాదు. కనుక తరచు పరీక్షలు చేసుకోవడం సాధ్యంకాదు. ఊబకాయులందరూ సాధారణంగా తీసుకునే జాగ్రత్తలే తీసుకుంటే అనారోగ్యం పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. జీవన శైలి తేడా లతో కొంతమంది వారి వాస్తవ వయసు కంటే 10 ఏళ్లు ఎక్కువగాలేదా 10ఏళ్లు తక్కువగా కనిపిస్తున్నారు.ఆరోగ్య కరమైన ఆహారం,లేదా బరువు తగ్గించే మందుల ద్వారా ఊబకాయాన్ని నివారించటం ద్వారా వయసు మీద పడే వేగాన్ని తగ్గించవచ్చు. ముందస్తు వార్ధక్యానికి కేవలం ఊబకాయం, ఒత్తిడి, కాలుష్యం కాదు. వాతావరణ మార్పులూ దోహదపడుతున్నాయి. శరీరంలోని అవయ వాలు సతాయించకుండా ఉంటే శతాధిక వత్సరాలు బతి కేయడం అలాంటి పరిస్థితి చక్కని వ్యాయామం ద్వారానే సాధ్యమని చెప్పిన మాటలను నమ్మడం తప్పని సరి. ప్రపంచంలోనే అమెరికాలో ఉన్న కెన్ని నికోలే 115 ఏళ్లు బతికింది.జపాన్‌కు చెందిన మి స్వాజుకి 117 ఏళ్లు.ఇప్పటికీ బతికేఉంది. ఇవి నిదర్శనాలు కాదనగలమా! ఈ ఏడాది ఆరంభంలో సదరన్ కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో 50 ఏళ్ళు పైబడిన 3,686 మంది వివరాలను పరిశోధించారు. వాతావరణంలోని అధిక స్థాయిలకు గురైన వ్యక్తులు మరింత వేగంగా వృద్ధాప్యానికి చేరువవుతున్నారని, ఉష్ణోగ్రతలో ప్రతి 10శాతం పెరుగుదల వారి వయసును 1.4 నెలలు పెంచుతోందని కనుగొన్నారు. గత ఆగస్టులో హాంకాంగ్ విశ్వవిద్యాలయం లో జరిగిన మరో అధ్యయనంలో 25 వేల మంది వయోజనుల డేటా పరిశీలన చేసి వారి శారీరక, మాన సిక ఆరోగ్య పరిస్థితులను బట్టి స్థిరమైన వ్యాయామమే మేలని నిర్ణయించారు. వృద్ధాప్య వేగాన్ని వ్యాయామం ద్వారా తగ్గించుకోగలగడం శుభకరం.

# గ్రామీణ ఉపాధి 'భరోసా' పదిలమేనా?

**ప్రపంచ ఆర్థిక మాంద్యం, కరోనా సమయంలో కోట్లాదిమంది వలస కూలీలు మనదేశంలో ఆర్థికంగా ఎటువంటి ఒడిదొడుకులను ఎదుర్కోలేదంటే ప్రత్యేక కారణం ఉపాధి హామీ చట్టమే.రాష్ట్ర విభజన సందర్భంలో సాక్షాత్తు పార్లమెంట్లో ముక్తకంఠంగా ఇస్తామన్న ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తాన్నన్నవారు ఇప్పటివరకు ఆ ఊసేలేదు. అటువంటిది 40శాతం నిధులు రాష్ట్రాలు సమకూర్చుకోవాలంటే ప్రస్తుతమున్న తెలుగు రాష్ట్రాలకు వీలవుతుందా, పనిరోజులు పెంచి కేంద్రం నిధులకు నీళ్లొదిలింది ఈ కొత్త చట్టంతో. పార్లమెంటులో మన రాష్ట్ర పార్టీలు ఈపథకంపై రాష్ట్ర ఆర్థిక, సామాజిక పరిస్థితిని లేదా వారిసలహాలు, సూచనలు ఇవ్వకపోవడం గ్రామీణ పేదకూలీలను పరిహసించ డమే అవుతుంది.**

డా. ఎ . భాగ్యరాజ్

చారిత్రాత్మక ఉపాధి హామీ చట్టంలో వచ్చిన మార్పులు గ్రామీణ కూలీ, కార్మికుల హక్కులను బలపరుస్తాయా లేదా అనే భయాలు మొదలయ్యాయి. బలహీనత చట్టంలో కాదు ఉద్దేశంలోను, నిర్మాణపరంగా ఉందా అనేది చూడాలి. ఉపాధి హామీ ఒక పథకం కాదు, ఒక హక్కు.భారత ప్రజాస్వామ్యంలో ఉపాధిహామీ పథకం (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) కేవలం పేదలకు పనికల్పించే ప్రభుత్వ పథకం మాత్రమే కాదు. అది గౌరవంగా బతికే హక్కుకు అనుబంధమైన ఒక సామాజిక భద్రతా చట్టం. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు అంటే కేవలం ప్రాణం నిలుపుకోవడం కాదు, గౌరవంతో బ్రతికేందుకు అవసరమైన పని, ఆహారం, ఆశ్రయం, భద్రత అన్నీకూడా ఈ చట్టంలో భాగమే.ఈపథకానికి చట్ట రూపం ఇచ్చిందే 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టం. 1990ల తర్వాత భారతదేశం ప్రైవేటీకరణ,ప్రభుత్వ ఉద్యోగాల తగ్గింపు, వ్యవ సాయ రంగంలో సంక్షోభం, గ్రామీణ నిరుద్యోగం పెరుగు దలవలన రైతులు కూలీలు, కూలీలు,వలస కూలీలు గ్రామాలు వదలి వెళ్లటం వలనఖాళీ అవుతున్న ఊర్లుగా మారాయి. ఈ సామాజిక విపత్తుకు సమాధానంగా రూపొందిందేఉపాధి హామీ చట్టం. ఈ చట్టం వలన ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజులు పని హక్కుగా ఇవ్వడం జరిగింది. స్థానికంగా ఉపాధి కల్పించడం వలన వలసలను అరికట్టడం,గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రధానమైనది. ఉపాధి లేకపోతే ఆహారం లేదు, ఆరోగ్యం లేదు, విద్య లేదు, స్వేచ్ఛలేదు. ఉపాధి హామీ చట్టం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పథకంకాదు,డిమాండ్ చేసినప్పుడు పని ఇవ్వాల్సినది ప్రభుత్వ బాధ్యత. పని ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇదే చట్టం లక్షణం. స్వాతంత్ర్యానంతరం ప్రజలలో గణనీయమైన మార్పును అందించిన పథకాలలో జాతీయ ఉపాధి హామీ పథకం ఒకటి. మన్మోహన్ సింగ్ ప్రధాని కాలంలో ప్రముఖంగా చెప్పుకోవలసిన ప్రధానమైన పథకంగా చెప్పుకోవచ్చు. ఇది నగర గ్రామీణ ఆర్థిక వ్యత్యాసాలను రూపుమాపడానికి, గ్రామాల్లో పంటకాలం మినహా నిరుద్యోగం ఎక్కువగా ఉంటుంది. దాని వలన వలస కూలీలుగా పక్క రాష్ట్రానికో, పట్టణానికో ఎక్కువగా ఉండేది. దానిని రూపుమాపడానికి వచ్చిన పథకమే ఈ ఉపాధి హామీ పథకం(2005). తరువాత ఇది చట్టంగా రూపు దిద్దుకొని 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా మారింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం ప్రజల మధ్య ధనచక్రాన్ని పెంచడమే ప్రధాన ఉద్దేశం. తొలిదశలో ఉపాధి హామీ 2006-2013 మధ్య కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధి, మహిళల భాగస్వామ్యం 50 శాతానికి పైగా దళితులు, ఆదివాసీలకు ఉపాధి కల్పించింది. గ్రామాల్లో చెరువులు తవ్వడం, రహదారులు, కాలువలు నిర్మించుకోవడం వలన గ్రామీణ పేదల ఆదాయం పెరగడం, స్థానిక మార్కెట్లకు గిరాకి, పేదరికం తగ్గడానికి ముఖ్య కారణంగా మారింది. 2014 తర్వాత పాలకుల దృష్టిలో ఉపాధి హామీ చట్టం భారంగా, పేదలను సోమరులుగా చేసే పథకంగా, ఉత్పాదకత లేని ఖర్చుగా చూడడం కారణంగా బడ్జెట్ కత్తిరింపులు,చెల్లింపుల్లో ఆలస్యం, పని దినాల తగ్గింపు,హక్కుగా ఉన్న ఉపాధి వారి దయా దాక్షిణ్యాలపై ఆధారపడింది. ఉపాధి హామీ చట్టం ప్రకారం డిమాండ్ ఉన్నంత పని ఇవ్వాలి.నిధులు అడ్డంకికాకూడదు. కానీ వాస్తవం ఏంటంటే సంవత్సరాంతానికి నిధులు ఖాళీ అని, నెలల తరబడి కూలీ వేతనాలు బకాయి చెల్లించక పోవడం, రాష్ట్రాలపై నిందలేయడం పూర్తిగా చట్ట ఉల్లంఘన తప్పించుకొనే ప్రక్రియగా మారింది. ప్రస్తుత పథకం (విబిజి రామ్‌జి)బిజెపి ప్రభుత్వం ఎటువంటి ముందస్తుగా



ప్రతిపక్షాలకు తెలియజేయకుండా, చర్చలు జరపకుండా నిన్నటి శీతాకాల సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదంపొందిన ఈ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబిజిరామ్‌జి) గురించి మొదటిదిగా చెప్పుకోవలసింది ఏదైనా పని ఉంటే మాత్రమే పనికి తీసుకుంటాము అనేది. దీనివలన పని ఇవ్వాలనే చట్టం నీరుగారిపోతుంది అనేది ప్రతిపక్షాల ఆదోళన. రెండోది డిమాండ్‌పై పని చేయండి అనేది పోయి, ఆ గ్రామంలో ఉండే పనికి ఎంతమంది,ఎన్నిరోజులు అవసరమో అన్నిరోజులు మాత్రమే పని ఉంటుంది. ఒకొక్క రాష్ట్రానికి తగ్గట్టు రోజు కూలీ నిర్ణయించబడుతుని అని చెబుతూ రాష్ట్రాలు 40 శాతంనిధులు సమకూర్చుకోవాలని పెట్టడం రాష్ట్రాలకు ఇబ్బందికరమైనది. రాష్ట్రాల నుంచి పన్నులన్నీ కేంద్రంతీసుకొని రాష్ట్రంపై బరువు పెడితే ఎలా? చట్టంగా ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం సరిగా నిధులివ్వడం లేదు. అటువంటిది బాధ్యతల పేరుతో రాష్ట్రంపై40శాతం నిధులను సమకూర్చుకోవడానికి భాగస్వామ్యం చేసి కేంద్రం వెనక్కితగ్గడమే ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఇది ఒకరకంగా కేంద్రం చేస్తున్న రాజకీయమే.పాత ఉపాధి హామీలో 33శాతం మహిళలకు ప్రథమంగాఉండాలి. కానీ ఈ చట్టంలో కచ్చితమైన సంఖ్య చెప్పలేదు.మహిళలు, దళితులు, ఆదివాసీలు మొదట నష్టపోతారు. ఉపాధి హామీ బలహీనపడితే ముమ్మాటికీ గ్రామాలలో పేదమహిళల ఆదాయం తగ్గుతుంది. దళితుల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింటుంది. ఆదివాసీల జీవనాధారం కూలిపోతుంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, సామాజిక న్యాయంపై దాడిగా చూడవలసి వస్తోంది. డిజిటలైజేషన్ పేరుతో ఆధార్ లింకింగ్, మస్టర్ (హాజరు పట్టిక)రోల్ ఫోటోలు పెట్టడం మంచిదే. వాటివలన గ్రామాలలో పని వాటి విలువలలో పారదర్శకత ఉంటుంది.కానీ అందరికి ఆండ్రాయిడ్ చరవాణి అందుబాటులో ఉంటుందా అనేది ప్రశ్న.దేశవ్యాప్తంగా ఉన్న పేదవారికి అడిగినన్ని రోజులు వారు డిమాండ్ చేసినన్ని రోజులు పని ఇవ్వాలనేది పాత చట్ట రూపకల్పనకు ఆత్మ. కానీ ఈ చట్టంలోని సెక్షన్ 5(1) ప్రకారం ఎప్పుడు, ఎక్కడ పథకం అమలౌతుందనే విచక్షణాదిహారం కేంద్రం చేతిలో ఉంటుంది. ఇది ఆమోద యోగ్యమైనది కానిది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి నడిపించిన గాంధీ పేరుని ఈ పథకంపేరు నుండి తీసివేయడం వారిరాజకీయ దురుద్దేశాన్ని తెలియజేస్తుంది. చూస్తుంటే ఒక విధంగా ఇది రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది.బిజెపి గత పదిసంవత్సరాలనుండి మొదటి నాళ్లలో ఇందిరాగాంధీని అత్యవసర (ఎమర్జెన్సీ) కాలాన్ని చూపించి పదేపదే ఆమెను తక్కువ చేసి చెప్పారు.తరువాత నెహ్రూని చైనాతోయుద్ధం, కాశ్మీర్ వ్యవహారం, సోషలిజంపై నిరంతరం చిన్నబుచ్చే పనిచేయడం చేస్తున్నారు. ఆ క్రమంలోనే గాంధీ పేరును ఈ ఉపాధి హామీపేరును మార్చి రాముడి పేరు చేర్చిమత రాజకీయానికి స్థిరమైన బీజంవేస్తోంది.అన్ని మతాలవారు ఈ పథకంలో పనిచేసే వారుంటారు. కానీ ఈ ప్రభుత్వం జాతీయ నాయకుల స్ఫూర్తిని మరచి మతరాజకీయానికి తెరలేపింది. రాముడి పేరుచేర్చాలంటే కొత్తగా ఒకపథకం పెట్టిచేయలేరా! ఒక విధంగా భవిష్యత్తు తరాలకు మతవాదాన్ని పెంచే విధంగా ఉంది.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి నడిపించిన నాయకులను దూరంచేయడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.గాంధీ దేశ నిర్మాణాన్ని తన సిద్ధాంతాలతో, త్యాగాలతో, పోరాటాలతో ఒక్క చుక్క రక్తం చిందించకుండా ముందుకు నడిపించి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుడు. ఇప్పటికీ ఈదేశంలో అంతఃకలహాలు,మతకలహాలు లేకుండా ఉన్నాయంటే కారణం ఆయన నడిచిన, చూపిన దారి వల్లనే.అంతటి మహనీయుని పేరుని గ్రామీణ ఉపాధి చట్టం నుంచి తొలగించడం దేశానికే అవమానకరమైనది. ఈ పథకం వలన ముఖ్యంగా రైతుల ఆత్మహత్య, వలసలు తగ్గింది.ప్రపంచ ఆర్థిక మాంద్యం, కరోనా సమయంలో కోట్లాదిమంది వలస కూలీలు మనదేశంలో ఆర్థికంగా ఎటువంటి ఒడిదొడుకులను ఎదుర్కోలేదంటే ప్రత్యేక కారణం ఉపాధి హామీ చట్టమే.రాష్ట్ర విభజన సందర్భంలో సాక్షాత్తు పార్లమెంట్లో ముక్తకంఠంగా ఇస్తామన్న ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తాన్నన్నవారు ఇప్పటివరకు ఆ ఊసేలేదు. అటువంటిది 40శాతం నిధులు రాష్ట్రాలు సమకూర్చుకోవాలంటే ప్రస్తుతమున్న తెలుగు రాష్ట్రాలకు వీలవుతుందా, పనిరోజులు పెంచి కేంద్రం నిధు లకు నీళ్లొదిలింది ఈ కొత్త చట్టంతో. పార్లమెంటులో మన రాష్ట్ర పార్టీలు ఈపథకంపై రాష్ట్ర ఆర్థిక,సామాజిక పరిస్థితిని లేదా వారిసలహాలు, సూచనలు ఇవ్వకపోవడం గ్రామీణ పేదకూలీలను పరిహసించడమే అవుతుంది. మన తెలుగు రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు బెంగాల్,తమిళనాడు సభ్యులను చూసినేర్చుకోవాలి. ప్రభుత్వాలకు పథకాల పేర్లమార్పు మీదఉన్న శ్రద్ధకంటే నిర్వహణ మీదచూపిస్తే బాగుంటుంది. ●

# కమ్యూనిస్టు ఆలోచనల తిరోగమనం!



అభిషేక్ జగిని

ఇటీవల కేరళ రాష్ట్రంలో ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు భారత రాజకీయాల్లో ఓ కొత్త అధ్యాయానికి నాంది పలికాయి. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ-ఎన్డీయే కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించి, 45 ఏళ్లుగా కొనసాగిన ఎల్డీఎఫ్ ఆధిపత్యాన్ని చరిత్రలో నిలిచిపోయేలా తుడిచిపెట్టింది. 100 వార్డుల్లో 51 స్థానాలు గెలుచుకుని, తొలి సారిగా మేయర్ పదవిని చేపట్టబోతోన్న బీజేపీ విజయం, కేరళ యువత అభివృద్ధి, ఆధునికత వైపు తలంచిన స్పష్టమైన సంకేతం. ఇది కేవలం రాజకీయ విజయం కాదు. కమ్యూనిస్టు ఆలోచనాపద్ధతి కూలిపోతున్న సంకేతం. త్రిపుర, బెంగాల్ అనంతరం ఇప్పుడు కేరళలో కమ్యూనిస్టు ఆధిపత్యం వెనక్కి వెళ్లడం, భారత రాజకీయ పరిణామంలో సహజమైన తదుపరి ఎనర్జీ మార్పు అని చెప్పవచ్చు. తిరువనంతపురంతోపాటు మొత్తం 93వార్డులు గెలుచుకున్న బీజేపీ, పాలక్కాడ్ మున్సిపాలిటీలో తన పట్టు కొనసాగించింది. త్రిపునితురలో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడం,గత ఎన్నికలతో పోలిస్తే గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీనడ్డా ఈ విజయాన్ని కేరళలో మార్పుకోసం ప్రజల కోరికగా విశ్లేషించారు. ప్రధాని నరేంద్ర మోడీ వికసిత కేరళ దృష్టి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన రహదారులు, ఆరోగ్యం, విద్యవంటి అభివృద్ధి కార్యక్రమాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఉదాహరణకు, తిరువనంతపురంలో డెలివరీ వర్కర్‌గా ప్రారంభించి ఎన్నికల్లో విజయం సాధించిన శ్రుతి ఎమ్ వంటి అభ్యర్థులు పార్టీని ప్రతిబిం బించే మెరిట్ ఆధారిత వ్యవస్థకు నిదర్శనం.ఇది వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక విలువలను నిలబెడుతోంది. కమ్యూనిస్టు ఆధిపత్యం కుంగిపోతుంది. త్రిపురలో ఒకశాతం ఓట్లతో ప్రారంభించి బీజేపీ రెండుసార్లుప్రభుత్వం ఏర్పాటు చేసింది. బెంగాల్‌లో సీపీఎమ్ ఆస్తిత్వమే ప్రశ్నార్థకమైంది. ఇప్పుడు కేరళలో ఎల్డీఎఫ్ ఒక్క కార్పొరేషన్‌కే పరిమితమైంది. ఉత్తర కేరళలో ముస్లిం ఓటర్ల లో కూడా కొత్త తరహా ఆలోచన చోటు చేసుకుంటోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టుగా, కేరళలో 25శాతం ఓటు షేర్ సాధించాలని బీజేపీ తీసుకున్న సంకల్పం ఈ ఫలితాలతో మరింత బలమైనది. బీజేపీ నాయకులు సోషల్ మీడియాలో యువత అభివృద్ధి, జాతీయ వాదం వైపు మొగ్గు చూపుతున్నట్టు విశ్లేషిస్తున్నారు. న్యూస్ రిపోర్టులు కూడా ఈ ధోరణిని ధృవీకరిస్తున్నాయి. హిందూ ఓటర్లు బీజేపీ వైపు సానుకూలంగా మారుతున్నారు. ఎల్డీ ఎఫ్ హిందూ అవుట్‌రీచ్ విఫలమైంది.సమతుల్య దృష్టితో చూస్తే యూడీఎఫ్ (కాంగ్రెస్ నేతృత్వం) ఇప్పటికీ నాలుగు కార్పొరేషన్లు, అనేక పంచాయతీలు గెలుచుకొని ఆధిక్యంలో నిలిచింది. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ బీజేపీ ప్రదర్శన 'చారిత్రాత్మకమని'పేర్కొనడం,రాష్ట్రరాజకీయ డైనమిక్స్ మార్పుకు ప్రతీక. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బీజేపీ బలపడటం అవసరమే అయినప్పటికీ,ఈఎన్నికల ఫలితాలు యూడీఎఫ్-ఎల్డీఎఫ్ మధ్యసుదీర్ఘ ద్వంద్వ రాజకీయాలకు సవాల్ విసురుతున్నాయి. ముగింపుగా,కేరళ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ వ్యాప్తిని, కమ్యూనిస్టు క్షీణతను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.ఉత్తరంనుంచి దక్షిణం వరకు వికసిత భారత్" దిశగా యువత ముందుకు సాగుతోంది. ●

# సామాజిక రుగ్మతల నుంచి బయటపడలేమా?

మేకిరి దామోదర్

ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమని అందరికీ తెలుసు. దీనిపై ప్రభుత్వాలూ, వైద్య నిపుణులూ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. పొగాకు, మద్యం ఉత్పత్తులపై భయానక చిత్రాలు,ప్రకటన బోర్డులు, సినిమాల్లో కూడా మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే హెచ్చరికలు తప్పనిసరిగా దర్శనమిస్తుంటాయి. అయితే ఈ హెచ్చరికలు చూసి నిజంగా ఎంతమంది ఈ దురలవాట్లకు దూరమవుతున్నారు? సమాధానం అందరికీ తెలిసినదే. హెచ్చరికలు పెరుగుతున్నా, వ్యసనాలు తగ్గడం లేదు. ఫలితంగా ప్రాణాంతకమైన క్యాన్సర్లు, గుండె జబ్బులు, కాలేయవ్యాధులు వంటి అనేక రుగ్మతలు పెరుగుతున్నాయి. ఎన్నో పచ్చటి సంసారాలు ఈ వ్యసనాలబారిన పడి ఛిన్నాభిన్నమవుతున్నాయి. ధూమపానం, మద్యపానం వంటి ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే ఉత్పత్తులను సమూలంగా నిర్మూలించాల్సిన ప్రభుత్వాలు, వాటిపై పన్నులు పెంచడమే పరిష్కారమని భావిస్తున్నాయా? పన్నులు పెరిగితే ప్రజలు వాడకం మానేస్తారని ప్రభుత్వంఆశిస్తుందా? వాస్తవానికి ఇది పనిచేయడం లేదు. ఎందుకంటే ఈ ఉత్పత్తులపై వచ్చే ఆదాయమే ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆధారంగా మారింది. గ్రామీణ పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంపాదన ఈ దురలవాట్లలోనే కరిగిపోతోంది. ఒకవైపు ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరిట ఒక చేయి ధనం ఇస్తూ, మరోవైపు మద్యపానం, ధూమపానం ద్వారాపన్నుల రూపంలో ప్రజల జేబులను ఖాళీ చేయడం పరిపాటిగా మారింది. ఇది నిజంగా సంక్షేమ పాలనా? లేక ద్వంద్వ విధానమా? ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే ఈ వ్యసనాల ద్వారా ఆదాయం సంపాదించడమే అత్యంత విషాదకరమైన వాస్తవం. ప్రజల ఆరోగ్యం కంటే ఆదాయమే ముఖ్యమన్న భావన ప్రభుత్వ విధానాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ధూమపానం, మద్యపానం విడివిడిగా ప్రమాదకరమే అయినా, ఈ రెండూ కలిస్తే ఆరోగ్యానికి మరింత ప్రమాదకరమని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు వ్యసనాలకు పరస్పర సంబంధం ఉందని శాస్త్రీయంగా రుజువైంది. సాధారణంగా ధూమపానం చేయని వారు కూడా మద్యం సేవించే సమయంలో పొగతాగడం గమనించవచ్చు. దీనికి కారణం ఏమిటి అనే అంశంపై సీసీఎంబీ పరిశోధకులు అధ్యయనం చేశారు. పొగాకులోని నికోటిన్ మద్యం తాగాలనే కోరికను పెంచుతుందని, అలాగే మద్యం సేవించిన వారికి నికోటిన్ తీసుకోవాలనే కోరిక మరింత బలపడుతుందని వారి పరిశోధనలో తేలింది. ఆల్కహాల్, నికోటిన్ పదేపదే తీసుకోవడం వల్ల మెదడులోని అభ్యాస సర్క్యూట్‌లో ఇవి జతగా మారతాయి. దాంతో ఒకటి తీసు



కుంటే మరొకటి కావాలనే తపన పెరుగుతుంది. ఈప్రక్రియ వ్యాధుల ప్రమాదాన్ని మరింత పెంచుతుందని, ప్రాణాంతకమయ్యే అవకాశాలుఎక్కువగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు వ్యసనాలు క్యాన్సర్, గుండె జబ్బులు, కాలేయ సమస్యలతోపాటు మానసిక ఆరోగ్యంపైకూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. విడివిడిగా ఈ వ్యసనాలను మాన్పించడానికి చికిత్సలు, మందులు ఉన్నప్పటికీ, రెండు అలవాట్లు కలిగినవారిలో చికిత్స ప్రభావం తక్కువగా ఉంటోంది. ఒక వ్యసనాన్ని లక్ష్యంగా చేసుకుని చికిత్సఅందిస్తే, మరో వ్యసనం మరింత పెరిగే ప్రమాదం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. వ్యసనాల మూలం మద్యపానం, ధూమపానం ఒకదానితో ఒకటి బలంగా జతకట్టడానికి కారణం గ్లూటమేట్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్. ఇది మెదడులోని అతిపెద్ద ఉత్తేజక రసాయనం. ఆల్కహాల్, నికోటిన్ తీసుకోవడం వల్ల గ్లూటమేట్ స్థాయి పెరుగుతుంది. దీంతో మెదడులోని"రివార్డ్ సర్క్యూట్రీ" మరింత చురుకుగా మారి వ్యసనాన్ని కొనసాగించేలా చేస్తుంది. న్యూరాన్లు పరస్పరం సంభాషించుకునే విధానం, ఆనందం-విశ్రాంతి వంటి అనుభూతులు కలిగించే ప్రక్రియలపై ఈ పదార్థాల ప్రభావం ఇప్పటికే శాస్త్రవేత్తలకు స్పష్టమైంది. ఆహారం, శృంగారం, సామాజిక సంబంధాలు సహజంగా ఈ సర్క్యూట్రీని యాక్టివేట్ చేస్తాయి. కానీ మద్యపానం, ధూమపానం వంటి కృత్రిమ ఉత్తేజకాలు ఈ ప్రక్రియను దుర్వినియోగం చేసి మనిషిని వ్యసనాల బానిసగా మారుస్తాయి. ఇంతగా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న మద్యపానం, ధూమపానాన్ని నియంత్రించి ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించడం రాజ్యాంగం ప్రభుత్వాలకు విధించిన కర్తవ్యం. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబాధ్యతను పూర్తిగా నిర్వర్తించలేకపోతున్నాయి. మద్యపానం, ధూమపానం వల్ల అధికంగా డబ్బు ఖర్చు చేసి అనారోగ్యం పాలవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆరోగ్యవంతమైన రాష్ట్రం, దేశంఎలాసాధ్యమవుతుంది? సామాజిక రుగ్మతల వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ, వీటిపై వచ్చే ఆదాయాన్ని ప్రధాన వనరుగా భావించడం అమానవీయతకు పరాకాష్ట. ఇది సంక్షేమ రాజ్యం, శ్రేయో రాజ్య భావనకు పూర్తిగా విరుద్ధం. జబ్బు ఒకటి - మందొకటి అనే ద్వంద్వం విడనాడాలి. నిజంగా ప్రజా సంక్షేమమే ప్రభుత్వాల ఆశయమైతే, మద్యపానం, ధూమపానంపై పన్నులు వేస్తూ హెచ్చరిక ప్రకటనలతో కాలం గడపడం సరిపోదు. ఈ ఉత్పత్తులే ప్రధాన ఆదాయ వనరుగా భావించడం మానవీయ పాలన కాదు. మద్యపానం, ధూమపానం తదితర మత్తుపదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వాలు కట్టుబడాలి. వాటి ఉత్పత్తి కేంద్రాలను దశలవారీగా మూసివేయాలి. ప్రభుత్వాల ప్రచార ఆర్భాటాలు, దుబారా ఖర్చులను తగ్గించి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయాలి. ప్రజారోగ్యాన్ని కేంద్రీకృతంగా చూసే విధానాలకు మారాల్సిన అవసరం ఉంది. ఈ విషవలయంలో నుంచి ప్రజలను బయటకు తీసుకురావడమే నిజమైన సంక్షేమం, శ్రేయో రాజ్య నిర్మాణానికి సరైన మార్గం. ●

దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.



హెచ్. లాంగ్‌ఫెలో

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు. ఎమర్సన్

## ప్రజావాక్కు



### వృద్ధులు అనాథలు కాకూడదు !

**తల్లిదండ్రుల** ఆస్తులుపంచుకోవటానికి కొడుకులు, కూతుళ్లు ముందుకు వస్తారు. తల్లిదండ్రుల్ని ప్రేమగా చూసుకునేందుకుమాత్రంవాళ్ళమనస్సులు వెనక్కిపోతున్నాయి. ఇప్పుడేదోవయస్సులో వుండి,ఆరోగ్యంతో, ఒంటిబలంతో ఉన్నామనుకుంటే పొరపాటు. ఎప్పుడూ ఇలాగే ఉంటామనుకుంటే మహాపొరపాటు.అందరికీ వయస్సు పెరుగుతుంది. వృద్ధాప్యం వస్తుంది.చేసుకోలేని స్థితి దాపురిస్తుంది.ఇప్పుడు కళ్ళుమూసుకుపోయికన్నవాళ్ళని అనాదరణకి గురిచేసి, అసహించుకొని, అన్యాయంచేస్తే చేసుకున్నవాడికిచేసుకున్నంత మహదేవ!అన్నట్లు రేపువీళ్ల కొడుకులు, కూతుళ్లు అలాగేచేస్తారు.అప్పుడు తెలుస్తుంది చేసిన పాపమేమిటో! కొడుకులు, కూతుళ్ళ అభివృద్ధి కోసంఇదివరకు అమ్మ,నాన్నపడిన ఆరాటాన్ని,ఆతృతని, ఆవేదనని గుర్తుచేసుకొని, అర్థం చేసుకొని, తమ ఇంత అభివృద్ధికి వాళ్లే కారణమని వాళ్ళనిఅనాథల్ని చేయకుండా, చూసుకోవాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

**ఇటీవలి** కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్ల పై నుండి ప్రవహించి రోడ్లు కోతకు గురైయ్యాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి,కంకరతేలి ప్రమాదాలు జరిగేవిధంగా తయారయ్యాయి. అదేవిధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగివాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి.

- టి. యోగేందర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా

### ఆయుర్వేద వైద్యంపై దృష్టి

**మనదేశంలో** 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగామారింది.ఇటీవల జాతీయస్థాయిలో సంప్రదాయవైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు, మందులు వగైరా ఏర్పాటు నిమిత్తం దృష్టిసారించారు.ఆయుర్వేద వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలు అలవాటు పడడం మంచిది.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

### భారత్‌కు కృతజ్ఞత చూపాలి

**భారత్**చరిత్రలో నిలిచిపోయే గొప్పసహాయం 1971లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మొక్కవోని సంకల్పంతో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి బంగ్లాదేశ్ అనే దేశాన్ని నిర్మించినందుకు ప్రతీ బంగ్లా పౌరుడు భారత్‌కు జీవితాంతం కృతజ్ఞత చూపాలి. ఈ ప్రయత్నంలో బంగ్లా బంధువుగా పేరుగాంచిన షేక్ ముజఫర్ రహ్మాన్‌నిత్యంమన మహాత్మాగాంధీని స్మరించుకోవాలి. ఆయన విగ్రహానికి జయంతి, వర్ధంతి రోజున పూలదండలు వేసి ఆయన చేసిన కృషిని తలచుకోవాలి. ఆయన కుమార్తె షేక్ హసీనా పాలనవరకు భారతదేశంతో స్నేహహస్తాన్నిసారించింది. ఇప్పుడా బంగ్లాదేశ్ కృతజ్ఞతగా మెలగవలసిన సమయంలో కృతఘ్నత చూపిస్తున్నది.అవామీలీగ్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దెదించిన మూల విరాట్టుగా చెప్పబడుతున్న షరీఫ్ ఉస్మాన్ హాది మరణంతో ఈ విధ్వంస కాండ జరిగిందని వార్త. అన్ని ప్రజా ప్రభుత్వాలు ఈ చర్యను తీవ్రంగా ఖండించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వైద్య కళాశాలల విస్తరణ అవసరం

వైద్య విద్యను, ఆరోగ్య సేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగాఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్య కళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రైవేటువైద్య కళాశాలల సంఖ్య ప్రభుత్వ కళాశాలల కంటే ఎక్కువగాఉంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 18 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే, తెలంగాణలో ఇటీవల 8 కొత్త కళాశాలలు మంజూరు కావడంతో ప్రభుత్వ కళాశాలల సంఖ్య 34కి పెరిగింది. ప్రభుత్వ వైద్య కళాశాలలు విద్యా, సామాజిక రీత్యా అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సర్పంచ్‌ల బాధ్యతలు

**నూతనంగా** ఎన్నికైన సర్పంచ్‌లు ఆయా గ్రామాలలో ఇతర కులాలు, గ్రామాలు, ఇతర మండలాలకు చెందినవాళ్ళు ఎస్సి, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన ఇంటి స్థలం అక్రమంగా ఆక్రమించి మరుగు దొడ్లు, స్నానం గదులు నిర్వహించడం జరుగుతుంది. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీచట్టం కిందకేసులు నమోదు చేసి ఎస్సీ ఎస్టీల వికలాంగుల భూములు వారికి అప్పగించి తగిన న్యాయం చేసే విధంగా ప్రభుత్వం నూతన సర్పంచులకు ఆదేశాలు జారీ చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రపంచంలో అతిపెద్ద మెట్రో..ఢిల్లీ




## మరో మూడు కారిడార్లకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

## ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.12,014.91 కోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌కమిటీ ఢిల్లీమెట్రో ఐదో దశ ప్రాజెక్టును ఆమోదించింది. మొత్తం రూ. 12,014.91కోట్ల వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్‌కె ఆశ్రమ్ మార్గ్‌నుంచి ఇంద్రప్రస్థ, ఏరోసిటీనుంచి ఐజిఐ ఎయిర్‌పోర్టు టెర్మినల్ వన్, తుగ్లకాబాద్‌నుంచి కాళిందికుంజ్‌వరకూ మొత్తంమూడు మెట్రో కారిడార్లను ఆమోదించింది. ఢిల్లీమెట్రో ఐదోదశ ప్రాజెక్టు మొత్తం 16.076 కిలోమీటర్ల నిడివితో ఉంటుందని మొత్తం ప్రాజెక్టు వ్యయం 12వేల కోట్లకుపైబడి ఉంటుందని కేబినెట్ సమావేశం తర్వాత పీఎంఓ ప్రకటన విడుదల చేసింది. అలాగే సెంట్రల్ విస్టా కారిడార్‌తో కర్తవ్యభవన్‌లు అన్నింటికీ కనెక్టివిటీపెరుగుతుంది. ఆఫీసులకువెళ్లేవారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సుమారు 60వేలమంది ఆఫీసులకు వెళ్లేవారు, రెండు లక్షలమందికిపైగా సందర్శకులకు ఈ కారిడార్‌వల్ల ఎంతోమేలు జరుగుతుంది. అలాగే శిలాజ ఇంధనాలవల్ల ఎలాంటి కాలుష్యం ఉండదని కేంద్రం చెపుతోంది. ఈ విస్తరణ పనుల్లో మొత్తం 13 స్టేషన్లు ఉంటాయి. వీటిలో పది స్టేషన్లు భూగర్భంలోను మూడు స్టేషన్లు ఎలివేటెడ్ స్థాయిలో ఉంటాయి. నాలుగోదశనిర్మాణంలో ఉంది. 111 కిలోమీటర్ల 83 స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. 80.43 శాతం నిర్మాణం పూర్తైయ్యింది. డిసెంబరు 2026 నాటికి మొత్తం పూర్తవుతుందని అంచనా. ఢిల్లీ మెట్రో సాయంతో మొత్తం 65 లక్షలమంది ప్రయాణీకులు రాకపోకలు వీలవుతోంది. ఒక్కసారి రోజుకు 81.87 లక్షలమంది కూడా ప్రయాణిస్తుంటారు. మొత్తం 12 మెట్రో లైన్లు 395 కిలోమీటర్ల నిడివితో 289 స్టేషన్లతో ఢిల్లీమెట్రో నడుస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రోప్రాజెక్టుగా ఢిల్లీమెట్రో నడుస్తోంది.

# బిజెపి విధానాలు చిన్నవ్యాపారులకు దెబ్బ

## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చిన్న వ్యాపారాలు దెబ్బతీసేలా ఉన్నాయని, ముఖ్యంగా వైశ్య వర్గానిని దెబ్బతీస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఆ వర్గానికి తాను మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీజెపి మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వైశ్యవర్గానికి చెందిన వ్యాపారులతో రాహుల్ భేటీ అయ్యి మాట్లాడారు. వర్గాల అనంతరం వారి సమస్యలపై రాహుల్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మా వ్యాపారం పతనానికి దగ్గరగా ఉంది అంటూ వైశ్య సమాజం నుంచి వచ్చిన ఆవేదన నన్ను తీవ్రంగా కలచివేసింది. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో దోహదపడిన సమాజం నేడు ఇలా నిరాశలో కూరుకుపోవడం ఓ హెచ్చరిక లాంటిది. గుత్తాధిపత్య సంస్థలకు స్వేచ్ఛనిచ్చి చిన్న, మధ్యతరహా వ్యాపారులపై అధికారం, జీఎస్టీ వంటి విధానాలతో ప్రభుత్వం భారం మోపుతోంది. ఇది కేవలం విధాన వైఫల్యం మాత్రమే కాదు. ఉత్పత్తి, ఉపాధితో పాటు భారత భవిష్యత్తు పైనా ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. బీజెపి ప్రభుత్వ మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని రాహుల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో దేశ వాణిజ్యానికి వెన్నెముక అయిన వైశ్య వర్గానికి తాను మద్దతుగా నిలబడతానన్నారు.

# 20 యేళ్ల తర్వాత కలిసిన థాకరే సోదరులు

## మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని వెల్లడి



**ముంబయి, డిసెంబరు 24:** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. విభేదాలతో విడిపోయిన ఠాక్రే సోదరులు ఉద్ధవ్ ఠాక్రే రాజ్ ఠాక్రే మళ్లీ కలిశారు. ముంబై స్థానిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి పోటీ చేస్తామని ప్రకటించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నదమ్ములిద్దరూ కీలక ప్రకటన చేశారు. జనవరి 15న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో శివసేన (ఠాక్రే వర్గం), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. ముంబైకి మరాఠీ మేయర్ రానున్నారని వెల్లడించారు. కాగా, 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. ఈ ఏడాది జులైలో ముంబైలో నిర్వహించిన వాయిస్ ఆఫ్ మరాఠీ కార్యక్రమంలో తొలిసారి ఒకే వేదికపై కనిపించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని సోదరులు అప్పుడు స్పష్టం చేశారు. ఇక అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విడాకుల నోటీసు పంపించిందని భార్యను కాల్చి చంపిన ఐటి ఉద్యోగి



**బెంగళూరు, డిసెంబరు 24:** తనతో విడిపోయి దూరంగా ఉంటున్న భార్య విడాకుల నోటీసు పంపడంతో తట్టుకోలేకపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆమెను కాల్చి చంపాడు. ఆపై పోలీసులకు లొంగిపోయాడు. ఐటీహబ్ బెంగళూరులో జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం నిందితుడు బాలమురుగన్ (40), భువనేశ్వరి (39) 2011లో ప్రేమ వివాహం చేసుకున్నారు. బాలమురుగన్ గతంలో ప్రముఖ ఐటీ సంస్థ క్యాప్‌జెమినిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాడు. భువనేశ్వరి యూనియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై బాలమురుగన్ అనుమానం పెంచుకోవడంతో వారి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఏడాదిన్నర కాలంగా వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. భర్త వేధింపులు తట్టుకోలేక ఆరు నెలల క్రితం భువనేశ్వరి తన పిల్లలతో కలిసి వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ఇల్లు తీసుకుని రహస్యంగా ఉంటోంది. భార్యపై కక్ష పెంచుకున్న బాలమురుగన్ ఆమె ఎక్కడ ఉందో ఆరా తీసి, నాలుగు నెలల క్రితమే ఆమె నివసించే ప్రాంతానికి సమీపంలోనే అద్దెకు దిగాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం భార్య నుంచి విడాకుల నోటీసు అందడంతో బాలమురుగన్ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో భువనేశ్వరి బ్యాంక్ పని ముగించుకుని ఇంటికి వస్తుండగా, ఆమె కోసం అప్పటికే మాటు వేసిన బాలమురుగన్ తన వద్దనున్న పిస్టల్‌తో అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపాడు. బుల్లెట్లు శరీరంలోకి దూసుకెళ్లడంతో రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హత్య అనంతరం నిందితుడు నేరుగా మగడి రోడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తన భార్యను తానే చంపినట్లు నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103 కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అతడికి తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భార్య కస్టడీకి పిల్లలను అప్పగించాలన్న కోర్టు

# పిల్లలను చంపి, తల్లితో సహా భర్త ఆత్మహత్య

**తిరువనంతపురం, డిసెంబరు 24:** విడిగా నివసిస్తున్న భార్య కస్టడీకి పిల్లలను అప్ప గించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి ఇద్దరు పిల్లలను హత్యచేశాడు. ఆ తర్వాత తల్లితో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేరళలోని కన్నూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పయ్యన్నూర్ గ్రామంలోని రామంతలికి చెందిన 36 ఏళ్ల కళాధరన్ భార్య నయనతార విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. భర్త నుంచి విడిగా నివసిస్తున్న ఆమె ఇద్దరు పిల్లల సంరక్షణను తనకు అప్పగించాలని కోర్టును కోరింది. కాగా, పిల్లల కస్టడీని నయనతారకు అప్పగించాలని ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. దీంతో పిల్లల స్వాధీనానికి ఆమె పోలీసుల సహాయం కోరారు. ఈ నేపథ్యంలో పిల్లలను భార్యకు అప్పగించాలని కళాధరన్‌కు పోలీసులు చెప్పారు. అయితే ఆరేళ్ల హిమ, రెండేళ్ల కన్నన్‌ను భార్యకు అప్పగించడానికి ఇష్టపడని కళాధరన్ మరునాడు దారుణానికి పాల్పడ్డాడు. డిసెంబర్ 22న రాత్రి వేళ 56ఏళ్ల తల్లి ఉషాతో కలిసి వారిని చంపాడు. పురుగుమందు కలిపిన పాలు పిల్లలకు తాగించగా వారు మరణించారు. మరోవైపు కళాధరన్, అతడి తల్లి ఉషా కూడా పురుగుమందు కలిపిన పాలు తాగారు. ఇంట్లో సీలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒక సూసైట్ నోట్‌ను డోర్ ముందు ఉంచారు. మంగళవారం ఉదయం ఆటో డ్రైవర్ అయిన కళాధరన్ తండ్రి ఇంటికి చేరుకున్న తర్వాత ఎవరూ ఎంతకీ డోర్ తెరువలేదు. అక్కడ ఉన్న సూసైడ్ నోట్‌ను గమనించిన ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. తలుపులు తొలగించి లోపలకు వెళ్లి చూశారు. కళాధరన్, అతడి తల్లి ఉషా, ఇద్దరు పిల్లల మృతదేహాలను కనుగొన్నారు. పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# టర్కీ విమానప్రమాదంలో మృతిచెందిన లిబియా సైనిక చీఫ్



**అంకారా, డిసెంబరు 24:** టర్కీ రాజధాని అంకారాలో మంగళవారంరాత్రి ఘోర విమాన ప్రమా దం సంభవించింది. లిబియా సైన్యాధిపతి జనరల్ మహమ్మద్ అలీ అహ్మద్ అల్‌హద్దాద్‌తో సహా ఎనిమిది మంది ప్రయాణిస్తున్న ప్రైవేట్ జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపంతో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఐదుగురు ఉన్నతాధికారులు, ముగ్గురు సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రక్షణ రంగ చర్చల నిమిత్తం టర్కీకి వచ్చిన లిబియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పర్యటన ముగించుకుని తిరిగి బయలుదేరిన 30 నిమిషాలకే ఈ విషాదం చోటు చేసుకుంది. అంకారాలోని ఎసెన్‌బోగా విమానాశ్రయం నుంచి రాత్రి 8:30 గంటలకు బయలుదేరిన ఫాల్కన్ 50 బిజినెస్ జెట్ దక్షిణాన ఉన్న హేమనా జిల్లా వద్దకు రాగానే రాడార్‌తో సంబంధాలు కోల్పోయింది. విమానంలో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు స్థానిక టీవీ చానళ్లు ప్రసారం చేసిన సీసీటీవీ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఈ ప్రమాదంపై లిబియా ప్రధాని అబ్దుల్ హమీద్ దబీబా స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం ఒక గొప్ప సైనిక మేధావిని కోల్పోయిందని, ఇదొక తీరని లోటని పేర్కొన్నారు. మృతుల్లో అల్‌హద్దాద్‌తో పాటు గ్రౌండ్ ఫోర్స్ చీఫ్ జనరల్ అల్‌ఫితౌరీ ఘ్రైబిల్, మిలిటరీ మాన్యుఫ్యాక్చరింగ్ అథారిటీ చీఫ్ బ్రిగేడియర్ జనరల్ మహమూద్ అల్‌ఖతావి వంటి కీలక అధికారులు ఉన్నారు.
పశ్చిమ లిబియాలో అత్యున్నత కమాండర్‌గా సేవలందిస్తున్న అల్‌హద్దాద్ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో విచ్ఛిన్నమైన లిబియా సైనిక విభాగాలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అటువంటి నాయకుడు మరణించడం లిబియా అంతర్గత భద్రతా వ్యవహారాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంకారా విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, పలు విమానాలను దారి మళ్లించారు. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు టర్కీ ప్రభుత్వం నలుగురు ప్రాసిక్యూటర్లను నియమించింది. సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

## ఢిల్లీ కాలుష్యంతో మూడురోజుల్లోనే అలర్జీ

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీ కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న మూడు రోజుల్లోనే తనకు అలర్జీ వచ్చిందని వెల్లడించారు. దేశ రాజధానిలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను. ఈ కాలుష్యం వల్ల నాకు ఎలర్జీ వచ్చింది. నేను రవాణాశాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉంది. శిలాజ ఇంధనాలు



పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం మాత్రం పెరిగిపోతోంది. మనం వాటి వాడకాన్ని తగ్గించలేమా? కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ప్రోత్సాహం లభించాలి అని గడ్కరీ వ్యాఖ్యలు చేశారు. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఏటా దాదాపు రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. కేంద్రమంత్రి ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా తయారుచేసిన తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ అని పిలుస్తారు. ఇది కాలుష్యాన్ని, శిలాజ ఇంధనాలపై ఆధారప డటాన్ని తగ్గిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## ఇల్లినాయ్‌పై ట్రంప్ నిర్ణయాన్ని తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**వాషింగ్టన్, డిసెంబరు 24:** ఇల్లినాయ్ రాష్ట్రంలోకి నేషనల్ గార్డ్ బలగాలను పంపాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 63 ఓట్ల తేడాతో ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది. ఇల్లినాయ్‌లో చట్టాలను అమలు చేయడానికి మిలిటరీని ఉపయోగించే అధికారం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందో నిరూపించడంలో యంత్రాంగం విఫలమైందని కోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ వివాదం అక్టోబర్ 4న మొదలైంది. షికాగో పరిసర ప్రాంతాల్లో భద్రత కోసం ఇల్లినాయ్ నేషనల్ గార్డ్‌కు చెందిన 300 మంది సభ్యులను ట్రంప్ ఫెడరల్ సర్వీసులోకి పిలిచారు. ఆ తర్వాతి రోజే టెక్సాస్ నేషనల్ గార్డ్‌ను కూడా షికాగోకు పంపారు. అయితే, ఫెడరల్ బలగాల మోహరింపును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే జిల్లా కోర్టు, అప్పీల్ కోర్టు స్టే ఇచ్చాయి. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ స్టేను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు తీర్పుపై వైట్ హౌస్ అధికార ప్రతినిధి అబిగైల్ జాక్సన్ స్పందిస్తూ.. ఫెడరల్ భవనాలు, ఆస్తులను అల్లరిమూకల నుంచి రక్షించడానికి, ఫెడరల్ అధికారులకు రక్షణ కల్పించడానికే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారని సమర్థించుకున్నారు. బలగాల మోహరింపును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న ఇల్లినాయ్ డెమొక్రాటిక్ గవర్నర్ జేబీ ప్రిట్జ్కర్, షికాగో మేయర్ ఈ తీర్పును స్వాగతించారు. ఇది ఇల్లినాయ్ రాష్ట్రానికి, అమెరికా ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని అభివర్ణించారు.



## యూనస్ ఏదో ఒకరోజు దేశం వీడి పోవాల్సిందే

### హత్యకు గురైన హదీ సోదరుడు హెచ్చరిక

**ఢాకా, డిసెంబరు 24:** బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారి హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోంది. ఇటీవల జరిగిన యువ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య దేశవ్యాప్తంగా హింసకు దారితీసింది. తాజాగా హాదీ సోదరుడు ఒమర్ సంచలన ఆరోపణలు చేశారు. హాదీ హత్యలో తాత్కాలిక ప్రభుత్వం పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. మీరు హాదీని చంపారు. ఈ ఘటనను వాడుకుని వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికలను రద్దు చేయాలని చూస్తున్నారు. హాదీని హత్య చేసిన వారిని వెంటనే పట్టుకోండి. హాదీ హత్య విషయంలో న్యాయం జరగకుంటే, తాత్కాలిక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ కూడా ఒక రోజు బంగ్లాదేశ్‌ను విడిచి పారిపోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హాదీ గతేడాది విద్యార్థి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఆ ఉద్యమం షేక్ హసీనా ప్రభుత్వాన్ని దేశం వీడే స్థితికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో, హాదీ హత్య ఘటన బంగ్లాలో ఉత్కంఠకర రాజకీయ పరిణామాలను సృష్టించింది. ఇక, మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై తాత్కాలిక ప్రభుత్వం నిషేధం విధించింది. దీని వలన వచ్చే ఏడాది జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్ణయంపై అమెరికా చట్ట సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత విధానంలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఉంది. అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికలు నిర్వహించేందుకు తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నించాలి అని వారు సూచించారు. అవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని పునః సమీక్షించాలని కోరారు.



# ప్రియాంకకు ప్రధాని పదవి ప్రతిపాదనపై బిజెపి ఎద్దేవా

## కాంగ్రెస్‌లో ఎప్పుడూ గందరగోళమే: షెహజాద్ పూనావాలా

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండాలనే చర్చపై బీజేపీ స్పందించింది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గందరగోళంలో ఉంటుందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనవాలా విమర్శించారు. ఐఎన్‌ఎస్ అంటే సాధారణంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అని కానీ ఈ పేరు కంటే ఐ నీడ్ కన్ఫ్యూజన్ అనే పేరు ఆ పార్టీకి బాగా సరిపోతుందని ఎద్దేవా చేశారు. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో ముఠా రాజకీయాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా షెహజాద్ పూనవాలా పలు అంశాలను ఉదహరించారు. రాజస్థాన్‌లో సచిన్ పైలట్, అశోక్ గెహ్లాట్, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతిభా సింగ్, సుఖ్వీందర్ సింగ్ సఖు, కర్ణాటకలో డీ.కే. శివకుమార్, సిద్ధరామయ్య ఇలా నేతల మధ్య గ్రూపులు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో రాహుల్ కాంగ్రెస్, ప్రియాంక కాంగ్రెస్ వర్గాలుగా చీలి పోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రకటనలు రాహుల్ గాంధీపై విశ్వాసం లేనట్లుగా స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. కొన్నిసార్లు శశిథరూర్, రాహుల్ గాంధీ ప్రకటనలతో విభేదిస్తారని, ఇమ్రాన్ మసూద్ ప్రియాంక గాంధీని ప్రధానమంత్రిగా ప్రతిపాదిస్తారని, ఆ తర్వాత వివరణ ఇస్తుంటారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నుంచి బహిష్కరించబడిన మహమ్మద్ మోక్విమ్ కూడా రాహుల్ గాంధీ నాయకత్వ సామర్థ్యాన్ని ప్రశ్నించారని గుర్తు చేశారు.
ప్రియాంక గాంధీకి పార్టీలో మరింత కీలక పాత్ర ఇవ్వాలని ఆయన సూచించారని గుర్తు చేశారు. ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి కావాలనే వ్యాఖ్యలకు రాబర్ట్ వాద్రా కూడా మద్దతు పలికారని, ఇది కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సంక్షోభాన్ని వెల్లడిస్తోందని పూనవాలా అన్నారు. రాహుల్ గాంధీ సామర్థ్యంపై రాబర్ట్ వాద్రాకు నమ్మకం లేనట్లుగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీకి ప్రజల్లోనే కాదు, సొంత పార్టీలో కూడా నమ్మకం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబ పార్టీ అని ఆయన విమర్శించారు.

# హెచ్1బి వర్క్ వీసా లాటరీ రద్దు..




**వాషింగ్టన్, డిసెంబరు 24:** అమెరికాలో హెచ్1బీ వర్క్ వీసా విధానాన్ని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పూర్తిగా మార్చేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు అమలులో ఉన్న లాటరీ విధానాన్ని రద్దు చేసి, నైపుణ్యం, అధిక వేతనాల ఆధారంగా వీసాలు కేటాయించే వెయిటెడ్ సెలక్షన్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకివస్తాయి. 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్1బీ రిజిస్ట్రేషన్ సీజన్ నుంచే ఈ మార్పులు వర్తిస్తాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకారం ప్రతి ఏడాది సుమారు 85 వేల హెచ్1బీ వీసాల కేటాయింపుపై ఈ విధానం ప్రభావం చూపనుంది. తక్కువ వేతనాలకు విదేశీ కార్మికులను తీసుకొచ్చేందుకు కొందరు యజమానులు లాటరీ వ్యవస్థను దుర్వినియోగం చేశారని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ ఆరోపించారు. అందుకే అధిక నైపుణ్యం, ఎక్కువ జీతాలు పొందే ఉద్యోగులకు ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం భారతీయులపై భారీ ప్రభావం చూపనుంది. హెచ్1బీ వీసా ద్వారా అమెరికాలో ఉద్యోగాలు పొందుతున్న వారిలో భారతీయ టెక్ నిపుణులు, వైద్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా కెరీర్ ఆరంభ దశలో ఉన్న యువ భారతీయులకు ఈ కొత్త వేతన ప్రమాణాలు అడ్డంకిగా మారనున్నాయి. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలపై ఏడాదికి అదనంగా 1 లక్ష డాలర్ల ఫీజు విధించే ప్రకటన చేసింది. మరోవైపు ధనవంతుల కోసం 10 లక్షల డాలర్ల గోల్డ్ కార్డ్ వీసాను కూడా ప్రవేశపెట్టింది. అమెరికా కంపెనీలు ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధికి హెచ్1బీ వీసాలు కీలకమని సమర్థిస్తుంటే, విమర్శకులు మాత్రం ఇవి ఎంట్రీలెవెల్ ఉద్యోగాలకే ఎక్కువగా వెళ్తున్నాయని వాదిస్తున్నారు. మొత్తం మీద ఈ కొత్త విధానం అమెరికా ఉద్యోగ విపణిపైతో పాటు వేలాది భారతీయుల భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపనుంది.

# సంక్షిప్తంగా..

## కాలిఫోర్నియాలో 30 మంది భారతీయులు అరెస్టు



**కాలిఫోర్నియా, డిసెంబరు 24:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 30 మంది భారతీయులను యుఎస్ బోర్డర్ పెట్రోల్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరు కమర్షియల్ డ్రైవర్ లైసెన్సులు (సీడీఎల్) కలిగి ఉండి, భారీ సెమీ ట్రక్ వాహనాలను నడుపుతున్నట్లు గుర్తించారు. కాలిఫోర్నియాలోని ఎల్ సెంట్రో సెక్టర్‌లో జరిగిన తనిఖీల్లో ఈ అరెస్టులు జరిగాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) వెల్లడించింది. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 12 వరకు ఇంటర్ స్టేట్ హైవేలు, ఇమిగ్రేషన్ చెక్‌పోస్టుల వద్ద జరిగిన తనిఖీల్లో మొత్తం 42 మంది అక్రమ వలసదారులను పట్టుకున్నారు. వీరిలో 30 మంది భారతీయులు కాగా, మిగిలిన వారు ఎల్‌సాల్వడార్, చైనా, హైటి, మెక్సికో, రష్యా తదితర దేశాలకు చెందినవారు. వీరికి కాలిఫోర్నియా సహా ఫ్లోరిడా, న్యూయార్క్, న్యూజెర్సీ వంటి రాష్ట్రాలు కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## టొరాంటోలో భారత్ యువతి దారుణ హత్య



**టొరంటో, డిసెంబరు 24:** కెనడాలోని టొరంటోలో భారతసంతతికి చెందిన 30 యేళ్ల యువతి హిమాన్షు ఖురానా దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో 32 ఏళ్ల అబ్దుల్ గఫూరి అనే వ్యక్తిని ప్రధాన నిందితుడిగా గుర్తించిన పోలీసులు, అతనిపై ఫస్ట్‌డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేసి, దేశవ్యాప్తంగా అరెస్ట్ వారెంట్ జారీచేశారు. బాధితురాలు,నిందితుడు ఇద్దరికీ ముందునుంచే పరిచయం ఉందని, ఇది ఇంటిమేట్ పార్టనర్ వయలెన్స్(సన్నిహిత భాగస్వామి హింస) కేసుగా పోలీసులు అనుమానిస్తున్నారు.ఈనెల 19వతేదీ రాత్రి హిమాన్షి ఖురానా కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు గాలింపు చర్యలు చేపట్టగా, 20వ తేదీ ఉదయం 6:30 గంటలకు స్ట్రాచన్ అవెన్యూ, వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్ ప్రాంతంలోని ఒక నివాసంలో ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు.దీనిని హత్యగా నిర్ధారించిన పోలీసులు,దర్యాప్తును హోమిసైడ్ విభాగానికి అప్పగించారు.

## ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**నోయిడా, డిసెంబరు 24:** గ్రేటర్ నోయిడాలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. చదువులో రాణించలేకపోతున్నానంటూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. చనిపోవడానికి ముందు సూసైడ్ నోట్ రాశాడు. తాను ఓడిపోయానని, చదువుకోసం ఇంకా డబ్బును వృధా చేయాలనుకోవడం లేదని అందులో పేర్కొన్నాడు. ఈ మేరకు తన తల్లిదండ్రులకు క్షమాపణలు కోరాడు. బీహార్‌కు చెందిన ఆకాష్ దీప్.. ఢిల్లీ టెక్నికల్ క్యాంపస్‌లో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) మొదటి సంవత్సరం చదు వుతున్నాడు. అతడు గ్రేటర్ నోయిడాలోని నాలెడ్జ్ పార్క్ ప్రాంతంలో గల ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉం టూ చదువును కొనసాగిస్తున్నాడు. అయితే, ఆకాష్ దీప్ మంగళవారం సాయంత్రం రూమ్‌మేట్ బయ టకు వెళ్లిన సమయంలో తన గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

## జామియా మిలియా వర్సిటీ ప్రొఫెసర్ సస్పెన్షన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో ఒక సెమిస్టర్ పరీక్షా పత్రంలో సామాజిక సమస్యలపై అడిగిన ఒక ప్రశ్న అభ్యంతరకరంగా ఉందన్న ఆరోపణలతో ప్రొఫెసర్ వీరేంద్ర బాలాజీ షహారేను యూనివర్సిటీ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఈ వారం ప్రారంభంలో జరిగిన బీఏ (ఆనర్స్) సోషల్ వర్క్ మొదటి సెమిస్టర్ పరీక్షలో భారతదేశంలో సామాజిక సమస్యలు అనే పేపర్‌లో ఒక ప్రశ్న ఇచ్చారు. అందులో భారతదేశంలో ముస్లిం మైనారిటీలపై జరుగుతున్న అకృత్యాల గురించి తగిన ఉదాహరణలతో చర్చించండి అని 15 మార్కుల ప్రశ్నను అడిగారు. ఈ ప్రశ్నపత్రం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇది ఒక వర్గాన్ని కించపరిచేలా లేదా రాజకీయ ప్రేరేపితంగా ఉందని పలువురు విమర్శించారు.

## ఎయిరిండియా పైలట్‌కు సంజాయిషీ నోటీసులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ)లో ప్రయాణికుడిపై భౌతికదాడికి పాల్పడిన ఘటనను ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ తీవ్రంగా పరిగణించింది. సదరు పైలట్‌కు అధికారికంగా షోకాజ్ నోటీసు జారీచేసింది. తన ప్రవర్తనపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పైలట్ దురుసు ప్రవర్తన సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసిందని పేర్కొంటూ ఎయిర్ ఇండియాఎక్స్‌ప్రెస్ ఈ నోటీసు ఇచ్చింది. దీనిపై ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపేందుకు ఈవారమే ఒకఎక్స్‌టర్నల్ ఎంక్వైరీ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఎయిర్ లైన్స్ ప్రకటించింది. బాధితుడు అంకిత్ దేవాన్ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఇప్పటికే పైలట్‌పై స్వచ్ఛందంగా గాయపరచడం, అక్రమంగా అడ్డుకోవడం వంటి అభియోగాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# మహిళా సాధికారతకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే



## బాల్కొండలో ఇంటిగ్రేటెడ్ కళాశాల మంజూరుకు కృషి

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** మహిళలకు చదువుతోపాటు సాధికారత ఉంటేనే సమాజ అభ్యున్నతి జరుగుతోందని సావిత్రిబాయి పూలే జీవితాంతం కృషి చేసిన వ్యక్తి అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో బుధవారం బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణకు టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌తోపాటు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్త, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహిర్ బిన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, పలువురు బిసి సంఘాల నేతలుహాజరైనారు. బొమ్మ మహేష్‌కుమార్ మాట్లాడుతూ కులవ్యవస్థ వ్యతిరేకంగా పోరాడుతూ, మహిళల విద్య హక్కు కోసం ఆమె చేసిన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిని అన్నారు. మహిళల హక్కుల సాధన కోసం సావిత్రిబాయి పూలే ఎనలేని పోరాటం చేశారని కొనియాడారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణించడానికి సావిత్రిబాయి పూలే వేసిన బలమైన పునాదే కారణమని తెలిపారు. ఆమె చూపిన మార్గంలో నడుస్తూ మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల సిద్ధాంతంతో ప్రజాపాలన కొనసాగుతోందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.5 లక్షల 75 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. ఫోర్త్ సిటీ ప్రణాళికతో హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడే స్థాయికి ఎదుగుతుందని తెలిపారు. పదేళ్ల విధ్వంస పాలన నుంచి రాష్ట్రం ఇప్పుడు వికాసం వైపు పయనిస్తోందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కళాశాలలు, టెంపుల్ కారిడార్ రోడ్ వంటి అభివృద్ధి పనులతో జిల్లా పరిశ్రమలపరంగా, వ్యవసాయపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. త్వరలో నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ కళాశాల మంజూరు కోసం కృషి చేయనున్నట్లు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాను మరింత అభివృద్ధి చేయడమే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు... పంచాయతీ 2025 ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో 90 శాతం పైగా స్థానాల్లో విజయం సాధించామని గుర్తుచేశారు. కులాలుగా సంఘటిత మవుతూనే బీసీలుగా ఏకం కావాలి బీసీల చైతన్యమైతేనే ఏదైనా సాధించగలం అని నిరూపించాలని పిలుపు నిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కట్టుబడి ఉందని 42 శాతం బిసి రిజర్వేషన్లను సాధించి తీరుతామని తెలిపారు. బిసి రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి బిజెపి అడ్డుకుంటుందని,వెనకబడిన తరగతుల ప్రధాని ఉన్న బిసి బిల్లుకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు పార్టీ పరంగా బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.

**మహిళాసాధికారత కాంగ్రెస్ లక్ష్యం**

**'పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**

తెలంగాణలో మహిళా సాధికారత ప్రధానలక్ష్యంగా పాలన సాగుతోందని నవవధువు అత్తారింటికి పోయినప్పుడు ఎంతోకొంత బాసటగా నవవధువుకు బాసటగా కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్‌తో పెద్దన్నగా ముఖ్యమంత్రి సహాయంఅందిస్తున్నారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం నిజామాబాద్‌లో కళ్యాణ లక్ష్మీ , షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, స్థానిక ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, నుడా ఛైర్మెన్ కేశ వేణు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**క్రిస్మస్ శుభాకాంక్షలు**

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి క్రైస్తవ సోదర సోదరీమణులకు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, త్యాగం, మానవతా విలువలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ ద్వారా సోదరభావం, సామరస్యం మరింత బలపడాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందం, ఆరోగ్యం, శాంతితో జీవించాలని కోరుకున్నారు.



# గ్రామీణులకు సైతం సత్వర వైద్యానికి చర్యలు

### మచ్చుపేటలో 108 అంబులెన్స్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**ముత్తారం, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం సత్వర వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలో 108 అంబులెన్స్‌ను బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో కూడిన అంబులెన్స్‌లు, శిక్షణ పొందిన సిబ్బందితో 108 సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత అత్యవసర సేవలు అందించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య రంగంలో అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీఓ సురేష్, తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి, డీఎంహెచ్ఓ ప్రమోద్ కుమార్, ముత్తారం మండల వైద్యాధికారి అమరేందర్ రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, ఐదొరెడ్డి బుచ్చం రావు, సర్పంచ్ సిలివేరు జ్యోతి లక్ష్మణ్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు గోవిందుల పద్మ, ఉప సర్పంచ్ దొంతుల రాకేష్, నాయకులు గోవిందుల ఆనంద్, దుండె రాజేందర్, దుండె రాజయ్య, దుండె మహేష్ తదితరులున్నారు.



బండారు దత్తాత్రేయను సన్మానిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

# ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

## అవినీతి, అక్రమాలకు తావులేకుండా మోడీ పాలన

### హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**గజ్వేల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** దేశంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రధాని నరేంద్రమోడి పాలన కొనసాగిస్తున్నారని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ పరిధిలోని మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఫాంహౌజ్‌లో కురుమ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కురుమ ఉద్యమానికి సేవలు అందించిన కురుమ సంఘ నేతలకు, నూతనంగా గెలిచిన సర్పంచ్, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలో జాతీయ నినాదం తెలంగాణ రాష్ట్రంలో మూలమూలనా పాకిందన్నారు. పార్లమెంట్‌లో కొత్త చట్టం తీసుకువచ్చి ఉపాధిహామీ పథకానికి పేరుమార్చి రామ్‌జీరాం అనే పేరుతో 105 రోజుల పాటు పని దినాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి కేంద్రం నిధులు ఇస్తుందని, గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటుచేసి కేంద్రం అందిస్తున్న నిధులను ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. ఉపాధిహామీ పథకం అంటే మట్టి ఎత్తడం, మట్టి తీయడం కాదు, సంపదను కూడా క్రియేట్ చేస్తుందన్నారు. రైతు వేరు, రైతు కూలీ వేరు కాదని, ఒకే కుటుంబానికి చెందిన వారు అన్నారు. 2047లో ప్రపంచంలోనే భారతదేశం అగ్ర దేశంగా చెందాలంటే దేశంలో ఉన్న అన్ని గ్రామాలు అభివృద్ధి జరిగితేనే వికసిత్ భారత్ వస్తుందని తెలిపారు. గతంలో సిద్దిపేట జిల్లాలో బిజెపి పార్టీ మనుగడ కష్టంగా ఉండేదని, ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో బిజెపి పార్టీ బలపర్చిన 55 మంది సర్పంచ్ అభ్యర్థులు గెలువడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సింది డబ్బు ప్రధానం కాదని, మానవ సత్సంబంధాలే ప్రధానమని గుర్తుచేశారు. పేద వారిని నావాళ్లు అనే భావనతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం బిజెపి పార్టీ బలపర్చి గెలిచిన సర్పంచ్‌లు దివ్య రాజ్‌కుమార్, శ్యామల, మల్లేశంలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు కప్పర ప్రసాద్‌రావు, యెల్లు రాంరెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు బింగి స్వామి, బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొల్లిబత్తుల దేవదాస్, పద్మశాలి సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు గాడిపల్లి అనూఫ్, బిజెపి నాయకులు బారు అరవింద్, వెంకట్‌రెడ్డి, కుడిక్యాల రాములు తదితరులు పాల్గొన్నారు.




ధర్నాలో ప్రసంగిస్తున్న జెఎసి ఛైర్మన్ కె.లక్ష్మయ్య

# ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

### జెఎసి నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో పదవీ విరమణ ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షాకార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ కే.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి డి.సుధాకర్, మాజీ ప్రధాన కార్యదర్శి టి.సుభాకర్‌రావు, ఆర్థిక కార్యదర్శి బి.ఎన్.వి.వి.కృష్ణప్రసాద్, ఇతర నాయకులు ఏ.రాజేంద్రబాబు, ఎస్.నర్స రాజు, ఎం.వి.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీని వడ్డీతో సహా చెల్లించాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెన్షన్ బకాయిలను వడ్డీతో సహా ప్రత్యేకంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గత 20 నెలలుగా పదవీవిరమణ ప్రయోజనాలు చెల్లించకపోవటంతో పెన్షనర్స్ ఈఎంఐలు కట్టలేక, పిల్లల పెళ్లిళ్లు, చదువులు ఆగిపోయి, మనోవేదనతో కొందరు వ్యాధుల బారిన పడుతూఉంటే మరికొందరు అవమాన భారంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షనర్లకు ఈహెచ్ఎస్ (నగదు రహిత చికిత్స) పద్ధతి అమలుచేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు అమలుచేయకపోవటంతో, అనేక మంది ఆసుపత్రుల బిల్లులు కట్టలేక, ఆసుపత్రుల బిల్లులు చూసి, గుండెపోటుతో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలు పెరగముందే 2024 ఏప్రిల్ నుంచి నేటి వరకు రిటైరైన పెన్షనర్లందరికీ వెంటనే వారికి రావల్సిన బెనిఫిట్స్ జి.పి.ఎఫ్, జి.ఎల్.ఐ., లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యుటేషన్ అండ్ గ్రాడ్యుటీ తదితర బకాయిలు చెల్లించి, పెన్షనర్లను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన జేఏసీ నేతలు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాళేశ్వరం మరమ్మతుకు ఆర్వీ అసోసియేట్ ఖరారు!

## గోదావరి ప్రవాహం తగ్గడంతో బ్యారేజీల మరమ్మతులకు పెంచిన వేగం

**హైదరాబాద్, డిసెంబరు 24,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎగువ నుంచి ప్రవాహం తగ్గుతుం డటంతో నీటిపారుదలశాఖ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు అవసరమైన పునరావాస డిజైన్లు అందించేందుకు మరమ్మత్తుల పనులను ఆర్వీ అసోసియేట్స్ కు అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో ఏర్పడిన పగుళ్లు, ఇతర లోపాల మరమ్మత్తులు చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. మరమ్మతులకోసం మూడుబ్యారేజిలకుగాను డిపిఆర్‌లను ప్రత్యేకంగా ఎన్‌డిఎస్‌ఏ సూచనలకు అనుగుణంగా తెలంగాణ లను సిద్ధం చేయిస్తోంది. కాళేశ్వరం బ్యారేజీలకు శుక్రవారం నుంచి పరీక్షలు నిర్వహించడానికి నీటిపారుదల శాఖ సాంకేతిక నిపుణుల బృందంతో కసరత్తును చేయబోతున్నది. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గ డంతో డిసెంబరు జనవరి ఫిబ్రవరినెలలో బ్యారేజి పునరుద్దరణకు పరీక్షలు పూర్తి చేయాలని భావి స్తున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు అవసరమైన పునరావాస డిజైన్లు అందించే సంస్థ ఎంపికపై స్పష్టత రావడంతో టెక్నికల్, ప్రైస్ బిడ్లకు సంబంధించిన సమాచారాన్ని ఆయా సంస్థలు సెంట్రల్ డిజైన్స్ ఆర్గనై జేషన్(సీడీవో)కు అందజేసినట్లు తెలిసింది. డిజైన్ల సంస్థ ఎంపిక ఒక కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ఆ సంస్థకు సంస్థకు అవసరమైన పరీక్షల ఫలితాలను అందజేసేందుకు వీలుగా నీటిపారు దలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పుణెకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిపుణుల బృందం బ్యారేజీల ఎగువ, దిగువ పరీక్షలు చేస్తోంది. మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ 19, 20, 21 పియర్స్‌తో పాటు సమీపంలో ఉండే పియర్స్, బ్లాకుల సమీపంలో వరదల కారణంగా టెస్టులు చేయడం కొంత ఇబ్బందిగా మారింది. పెద్దఎత్తున పోగుపడిన ఇసుక పై వెళ్ళే తేలిక వాహనాలను వినియోగించి బోర్ రంధ్రాలు తవ్వడం, ఇసుకలో దిగబడే చోట తాత్కాలిక మట్టి రోడ్డునుఏర్పాటు చేసి పరీక్షలు చేయబోతున్నారు. మహారాష్ట్ర వైపు మేడిగడ్డ బ్యారేజీకి పునరావాస డిజైన్లు సిద్ధం చేయబోతున్నట్లు తెలిసింది. మరోవైపు తుమ్మిడిహట్టి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ను కూడా రూపొద్దింస్తుండగా.. వచ్చే 3 నెలల్లో రిపోర్ట్ అందించాలని సదరు సంస్థ గడువు విధించింది. రిపోర్ట్ ప్రభుభుత్వానికి అందగానే ఆయా పనులకు టెండర్లు పిలిచే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

# సమస్యల సుడిగుండంలోకి ప్రజలు

## కాంగ్రెస్ వచ్చింది, సమస్యలు తీసుకొచ్చింది

## సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల కోసం పాదయాత్ర

### జహీరాబాద్‌లో మాజీమంత్రి హరీశ్‌రావు




సర్పంచ్‌ల సన్మాన సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

**జహీరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** గత శాసన సభ ఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ హయాంలో అమలయిన సంక్షేమ పథకాలను బంద్ చేసి ప్రజలను సమస్యల సుడిగుండంలో నెట్టేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా నియోజకవర్గమైన జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమానికి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సిఎం రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీని అడ్రస్ లేకుండా చేస్తానని బీరాలు కలికి చివరకు ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో బిఆర్ఎస్ 4వేల పంచాయితీలను కైవశం చేసుకుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో అమలైన రైతు బంధు, దళిత బంధు, బిసి బంధు, మమిళలకు పెన్షన్లు, బతుకమ్మ చీరల పంపిని తదితర పథకాలన్నింటిని బంద్ చేసి ప్రజలు ఇబ్బందులకు గరయ్యేలా చేశారని మండిపడ్డారు. జహీరాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.మిషన్ కాకతీయ ద్వార పూడిక తీసిన ప్రాజెక్టుకు మరమ్మతులు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును నిర్లక్ష్యం వహిస్తుండటంతో నీరంతా కిందకు వృధాగా పోతోందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి మాజీ సిఎం కేసిఆర్ 50 కోట్లను మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి 50 కోట్లను వాపస్ తీసుకుందని విమర్శించారు. జహీరా బాద్‌లో బిఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యను అందుకున్న 19 మంది విద్యార్థులు డాక్టర్ సీట్లను సాధించారని ఆనందం వ్యక్తం చేశారు.

**సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల కొరకు పాదయాత్ర**

బిఆర్ఎస్ హయాంలో జహీరాబాద్, నారాయణ ఖేడ్ ప్రాంతాలకు సాగు నీటి కొరకు మంజూరు చేసిన సంగమేశ్వర, బసవేశ్వరర ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని, ప్రాజెక్టుల సాధనకు త్వరలోనే జహీరాబాద్ నుంచి నారాయాణఖేడ్ వరకుఉ బిఆర్ఎస్ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. రానున్న మున్సిపల్, ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలో బిఆర్ఎస్ పార్టీ అధిక సీట్లను సాధించుకోనుందని జ్యోషం చెప్పారు. రానున్న శాసన సభ ఎన్నికల్లో కేసిఆర్ ముఖ్యమంత్రి కావడ తధ్యమన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్, సంగారెడ్డి ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎం శివకుమార్, జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, నర్సింలు, మున్నూర్ రవీందర్, సంజీవరెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్న భాస్కర్, బిఆర్ఎస్ నాయకులు ఎంఇ తంజీత్, నామ రవికిరణ్, బండి మోహన్, సరస్వతిరెడ్డి, మంజుల, నియోజవర్గం లోని ఆయా గ్రామ పంచాయిల నుంచి బిఆర్ఎస్ మద్దతుతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యూరియాకు యాప్ కష్టాలు

## స్మార్ట్‌ఫోన్ల కోసం అప్పులు.. సాంకేతిక పరిజ్ఞానం లేక ఇబ్బందులు

## గ్రామీణ ప్రాంతాల్లో వేధిస్తున్న నెట్‌వర్క్ సమస్య

### యూరియా లభ్యం కాక రైతుల ఆందోళన

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** యూరియా పంపిణీలో అతివినియోగానికి అడ్డుకట్ట వేయడంతో పాటు, పారదర్శకత, సౌలభ్యం కోసం రాష్ట్ర సర్కార్ ప్రవేశపెట్టిన యూరియా యాప్ ఒక ప్రహసనంలా తయారైంది. దీంతో రబీ సీజను ఆరంభంలోనే రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. యూరియా కొరతను అధిగమించేందుకు తీసుకొచ్చిన కొత్త నిబంధనలు రైతులను అవస్థలపాలు చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత రబీ సీజనులో రాష్ట్రంలోని ఆదిలాబాద్, జనగామ, మహబూబ్ నగర్, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా వ్యవసాయ శాఖ అమలు చేస్తోంది. ఈ యాప్ ప్రారంభమైన రెండు రోజుల్లోనే 19 వేల 695 మంది రైతులు యాప్‌లో బుకింగ్ చేసుకున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

తద్వారా మొత్తం 60 వేల 510 యూరియా బస్తాలు కొనుగోలు చేశారు. ఇందులో 217 మంది కౌలు రైతులు 678 బస్తాల యూరియాను బుక్ చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా డీలర్ వారీగా యూరియా స్టాక్ వివరాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ఓటీపీ విధానంతో రైతులు తమకు నచ్చిన సమయంలో యూరి యాను కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు.

యూరియా నిల్వలను యాప్‌లో నమోదు చేయాలని డీలర్లను అధికారులు ఆదేశించారు. దీంతో వారు స్టాకు నమోదు చేసి పాత పద్ధతిలో విక్రయాలను నిలిపివేశారు. యూరియా కోసం వెళ్లిన రైతులకు కాళ్లరిగేలా తిరిగినా యాప్‌లో బుక్ చేసుకుంటేనే ఇస్తామని చెబుతుండటంతో అవాక్కవుతున్నారు. కొత్తగా తెచ్చిన యాప్‌లో బుకింగ్ చేసుకుని రావాలని స్పష్టం చేస్తున్నారు. దీంతో ఈ యాప్‌పై అవగాహన లేని అన్నదాతలు ఇళ్లకు తిరుగుముఖం పడుతున్నారు. ఈ యాప్ విధానంతో లాభం కంటే నష్టమే ఎక్కువగా ఎదుర్కోవాల్సి ఉంటుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ తీసుకొచ్చిన యాప్ ఇక్కట్ల పాల్చేస్తోందని వాపోతున్నారు. నిరక్షరాశ్యులు, స్మాట్ ఫోన్ లేని వారు, అవగాహన లేని పలువురు రైతులు యూరియా యాప్ తెలియక యూరియా ఇవ్వక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యూరియా కోసం అప్పులు చేసి కొందరు స్మార్ట్ ఫోన్ కొంటున్నా, దాన్ని వినియోగించే సాంకేతిక పరిజ్ఞానం రెతులకు ఉండటం లేదు. కొందరి వద్ద స్మాట్ ఫోన్ ఉన్నా రీచార్జి సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ లేకపోవడం, ప్రతీ బస్తా నమోదుకు ఇతరుల మీద ఆధారపడటం వంటి సమస్యలను చవిచూస్తున్నారు.

అలాగే స్మాట్ ఫోన్ వినియోగం తెలియక యూరియా బుక్ చేయమని ఇతరుల చేతికిస్తే అందులోని మొత్తం సమాచారం ఇతరులకు తెలుస్తుండటంతో ఎక్కడ అక్రమాలు జరుగుతాయనేది సందిగ్దంలో కొట్టుమిట్టాడుతున్నారు. అంతేకాకుండా తరచూ వచ్చే సందేశాలకు ఎలా స్పందించాలో తెలియకపోవడం, ఓటీపీలు చెబితో డబ్బు పోతుందనే భయపడటం, ఫోన్ పే, గూగుల్ పే లాంటి వాటిని పిన్ నెంబరు ఇతరులకు ఎలా చెప్పగలమని అంటున్నారు. కాగా యాప్ ప్రారంభ దశలో ఎదురైన ప్రాథమిక సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించినట్టు అధికారులు తెలిపారు. యాప్ అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతోందని వెల్లడించారు.

ఇక త్వరలో తెలంగాణ వ్యాప్తంగా యూరియా యాప్‌ను అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతు న్నాయని చెబుతున్నారు.

తెలంగాణలోని రబీ సీజన్ అవసరాల కోసం ఇప్పటికే 5 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు, వచ్చే జనవరి, ఫిబ్రవరి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోందన్నారు.

# పబ్లిసిటీ కోసం ఫ్లాప్ యాక్టర్ శివాజీ వ్యాఖ్యలు

### తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత

**హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త :** టాలీవుడ్ నటుడు శివాజీ ఫ్లాప్ యాక్టర్ అని పబ్లిసిటీ కోసమే ఇలాంవి చేస్తున్నాడని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలిసునీత ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏ తల్లి కన్నదో ఆ తల్లిని ఇనుపసామాన్ల డబ్బాతో శివాజీ పోల్చడం పాలు తాగి రొమ్ముగుద్దే రకంగా ఉందని కాంగ్రెస్ మహిళా నేత సునితా రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. శివాజీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు కలిగిన బీజేపీతో ఉన్నాడన్నారుమొన్న నితీష్ కుమార్ కూడా ఓ మహిళ హిజాబ్ గుంజారన్నారు. ఆయన గురించి మాట్లాడడం కూడా అనవసం అని అసహనం వ్యక్తం చేశారు. మహిళల బట్టల గురించి మాట్లాడే హక్కు శివాజీకి ఎక్కడిది అనే ప్రశ్నించారు.

ఇద్దరు కొడుకులే ఉన్నారని ఒక కూతురు ఉంటే శివాజీకి మహిళల విలువ తెలిసేదన్నారు. మహిళా కమిషన్ ఇప్పటికే సుమోటాగా కేసును స్వీకరించిందని చర్యలు కూడా తప్పవన్నారు. ఎలాంటి స్టేజిపై శివాజీ మాట్లాడాడో అలాంటి వేదికపైనే మహిళలందరికీ క్షమాపణ చెప్పించాలని అన్నారు. నువ్వో ఫ్లాప్‌యాక్టర్ చెప్పుదెబ్బలు తింటావ్ అంటూ శివాజీకి ఘాటుగా సునీత హెచ్చరికలు జారీచేశారు

# ఉత్తమ కథానిక, సాహిత్య, నవలకు కొలకలూరి సాహిత్య పురస్కారాలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), డిసెంబరు 24. ప్రభాతవార్త:** ఉత్తమ కథానిక, ఉత్తమ సాహిత్య ఉత్తమ నవలకు కొలకలూరి సాహిత్య పురస్కారాలను ప్రధానం చేయబోతున్నట్లు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమ కిరణ్ ప్రకటించారు. ఈ పురస్కారాలు గత పద్దెనిమిది సంవత్సరాలుగా వివిధ ప్రక్రియలకు ప్రధానం చేస్తున్న విధంగానే ఈ సంవత్సరం కూడా మూడు ప్రక్రియ గంథాలకు మూడు పురస్కారాలను అందచేస్తామని, రూ.20 వేల చొప్పున కొలకలూరి భగీరథీ కథానిక పురస్కారం, కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం, కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారం అందిస్తామన్నారు. ఆయా ప్రక్రియల్లో ప్రచురితమైన గ్రంథాలు నాలుగేసి ప్రతులు పంపాలి. ముగ్గురు సాహితి స్రష్టలు, వేత్త, న్యాయమూర్తుల సంఘాలు మూడు వీటిని పరిశీలించి, పురస్కార గ్రంథాలను నిర్ణయిస్తాయి. ఈ గ్రంథాలు 2024 జనవరి 1 తరువాత ముద్రితమై ఉండాలని, రచయితలు, రచయిత్రులైనా తమ గ్రంథాలు 2026 జనవరి 15 లోగా ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి తెలుగు శాకాధ్యక్షులు, పరీక్షల విభాగం డీన్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం , తిరుపతి .517502 ఆంధ్ర ప్రదేశ్ కు పంపాలని కోరారు. కథానిక, నవల, విమర్శన ప్రక్రియలలో ఒక్కో రచయిత, రచయిత్రులు ఒక్క కథానిక సంకలనం, వ్రాసిన నవల, విమర్శన సంకలనం పంపాలని, 2026 ఫిబ్రవరి 26 న నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఎంపిక చేసిన రచయితలు, రచయిత్రులకు పురస్కారాలు అందజేస్తారు. ఇతర వివరాలకు 99635 64664 సంప్రదించవచ్చు.

# గొత్తికోయ ఆదివాసీలకు తొలి సర్పంచ్

## ఎస్టీ సర్టిఫికెట్లపై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తా:

### ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**చర్ల, డిసెంబరు 24, ప్రభాతవార్త:** అనాదికాలంగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటు అడవినే నమ్ముకొని జీవిస్తున్న గొత్తికోయ ఆదివాసీలు ఇప్పుడిప్పుడే ప్రజాజీవనంలో కలుస్తున్నారు అనడానికి నిదర్శనమే ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు వారిలో చైతన్యాన్ని నింపాయి.గొత్తికోయ గిరిజనం ఏకమై రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో భాగంగా చర్ల మండలంలో తిప్పాపురం పులిగుండాల బోదనెల్లి పంచాయితీలలో సర్పంచ్ అభ్యర్థులు ముగ్గరు బరిలో నిలుచున్నాయి.అయితే రెండు పంచాయతీలలో స్వల్ప ఓట్లతో ఓటమిపాలైనా బోదనెల్లి పంచాయితీలో విజయం సాదించి రాష్ట్రంలో తొలి కొత్తికోయ ఆదివాసీ పంచాయతిని కైవశం చేసుకొని వార్తల్లో నిలిచారు. సర్పంచిగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిలబడి గెలిచి తమ సత్తా చాటటమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు నిచ్చి కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళీ లంకరాజు కొటేరు శ్రీనివాసరెడ్డి బ్రహ్మానందరెడ్డి ఇర్పా వసంత్ రాంపండు ముమ్మనేని అరవింద్ పాపిన గంగాధర్ గుండేపూడి సతీష్ నేతృత్వంలో ఎంఎల్‌ఏ సమక్షంలో ఇటీవల ఆపార్టీలో చేరారు.కాగా భుదవారం ఎంఎల్ ఏ తెల్లం వెంకట్రావుని తమ గ్రామానికి అహ్వానించి పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు.తమ స్వగ్రామం అయిన బూరుగుపాడు నుండి ఆర్.కొత్తగూడెం సత్యనారాయణ గ్రామాలలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో అబ్బుర పరిచారు. ఎంఎల్‌ఏని అగ్రబాగాన నిలబెట్టి ర్యాలీతో ముందుకుసాగారు.

**ఆదివాసీ సమస్యలను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే వెంకట్రావు**

గొత్తికోయ ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా అన్నారు.ఇటివల జరిగిన పంచాయతి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వంజం సింగయ్యను ఆయన మొదట అభినందించారు.ఆదివాసీలు మరింత చైతన్యులు కావాలని వారి ప్రధాన సమస్య అయిన ఎస్టీ కులధృవీకరణ పత్రాల మంజూరు కోసం మంత్రి పొంగులేటి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెత్తానని అన్నారు.గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున ఆదివాసీ యువత మహిళలు పిల్లలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళలకు అండగా ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ భవనాలు

## గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి నిర్మాణాలు చేపట్టాలి: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలు, ఫెడరేషన్‌లకు శాశ్వత వేదికగా నిలిచే భవనాల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. గ్రామస్థాయిలో మహిళా సంఘాల బలోపేతానికి ఇది చారిత్రాత్మక ముందడుగు అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో గ్రామ సంస్థలు (వీఓలు),ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ల కోసం శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వానికి ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఒక్కో భవనానికి గరిష్టంగా రూ.10 లక్షల వరకు వ్యయం చేయనున్నారు. 200 గజాల్లో, కనీసం 552 చదరపు అడుగుల్లో భవనం ఉండేలా డిజైన్ సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ. గ్రామీణ మహిళలు కేవలం పొదుపు సంఘాలకే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి, నిర్ణయాధికార కేంద్రాలుగా ఎదగాలి. అందుకే ప్రతి గ్రామంలో ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ భవనం ఉండాలి. మహిళలకు గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. దశల వారిగా అన్ని గ్రామాల్లో ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ భవనాలు నిర్మించనున్నారు. అయితే గ్రామ సభ తీర్మానం ఆధారంగా ప్రతిపాదనలు మండల, జిల్లా స్థాయిల ద్వారా జిల్లా కలెక్టర్ అనుమతితో పనులు చేపట్టనున్నారు. నిర్మాణ పనులను పీఆర్ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో పూర్తిచేస్తారు. ఉపాధీ హామీ నిధులతో చేపట్టే ఈ పనులకు సామాజిక తనిఖీ తప్పనిసరిగా నిర్వహించనున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తైన ఆరు నెలలలోపు సోషల్ ఆడిట్ పూర్తి చేయాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మార్గదర్శకాలను జిల్లా కలెక్టర్లు, పీఆర్ ఆర్ డీ అధికారులు కచ్చితంగా అమలు చేసి, మహిళా సంఘాల బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.



# టైరు పేలి, డివైడర్ దాటి రెండు కార్లను ఢీకొన్న బస్సు

## తొమ్మిది మంది ఘటనాస్థలంలోనే మృతి

**కదలూరు, డిసెంబరు 24:** జిల్లాలోని తిట్టకుడి ప్రాంతంలో రాష్ట్రఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్టేషన్ బస్సు రెండు కార్లు ఢీకొనడంతో జరిగినప్రమాదంలో తొమ్మిది మంది చనిపోగా మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. పోలీసులు, స్థానిక ప్రత్యక్ష సాక్షుల కథనాలప్రకారం ఎయిర్పూరుడుక్ ఈ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ సర్వీసుల్లోని బస్సు తిరుచినుంచి చెన్నైకి వస్తుండగా ముందుటైర్ పేలిపోయింది. దీనితో బస్సు డ్రైవర్ నియంత్రణనుంచి తప్పింది. డివైడర్‌ను ఢీకొని ఆవలివైపు రోడ్‌లోకి దూసుకుపోయింది. దీనితో ఆ బస్సు అటుగా వస్తున్న అంటే చెన్నైనుంచి తిరుచ్చి వస్తున్న రెండు కార్లను ఢీకొన్నది. రెండుకార్లల్లోని ఏడుగురు కూడా అక్కడే చనిపోయారు. రామనాథపురం పోలీసులు స్పాట్‌కు హుటాహుటిన చేరుకుని మృతదేహాలను రికవరీ చేసుకున్నారు. బాధితులు,మృతుల వివరాలను సేకరిస్తు వారి ప్రయాణ వివరాలపైనా ఆరాతీస్తున్నారు. వారి స్వస్థలాలువారు వెళ్లాల్సిన గమ్యస్థానం వంటి వాటిని ఆరాతీసి పోస్టుమార్టం అనంతరం వారివారి కుటుంబాలకు అప్పగిస్తామని పోలీసులు చెప్పారు.

# అటల్‌జీ ఆచరణాత్మక విలువలను పాటించడమే నిజమైన నివాళి

## అటల్ స్మృతిన్యాస్ సొసైటీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించిన ఎం. వెంకయ్యనాయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** భారతదేశం గర్వించదగిన రాజనీతిజ్ఞుడు అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితాన్ని, సిద్ధాంతాలను, విలువలను భవిష్యత్ తరాలకు తెలియజేసే అవకాశం రావడం అటల్ జీ అందించిన ఆశీస్సులుగా భావిస్తున్నట్లు అటల్ స్మృతి న్యాస్ సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దివంగత మాజీ ప్రధాని మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకార్థం ఏర్పాటు చేసిన అటల్ స్మృతి న్యాస్ సొసైటీకి అధ్యక్షులుగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. వాజ్‌పేయి ఆశయాలను, స్మృతులను భావితరాలకు అందించే లక్ష్యంతో పనిచేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సొసైటీకి ఇకపై వెంకయ్య నాయుడు నాయకత్వం వహించనున్నారు. బుధవారం ఢిల్లీలోని 1, త్యాగరాజ మార్గ్‌లో ఉన్న శ్రీ వెంకయ్య నాయుడు అధికార నివాసానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, బీజేపీ ప్రధాన కార్యదర్శి, ప్రధాన కార్యాలయ ఇంఛార్జ్ అరుణ్ సింగ్, బీజేపీ కార్యాలయ కార్యదర్శి మహేంద్ర పాండే, అటల్ స్మృతిన్యాస్ సొసైటీ వ్యవస్థాపక సభ్యులు, ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ ట్రస్ట్ అధ్యక్షులు రాం బహదూర్ రాయ్ తదితరులు విచ్చేశారు.

# జనవరిలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

## సర్పంచ్‌లను భాగస్వామ్యం చేయాలి

## సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** జనవరి 1 నుండి నెల రోజుల పాటు జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమాల్లో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టాలని అందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ అధికారులతో జరిగే జూమ్ సమావేశంలో పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుండి రాజధాని వరకు ఉన్న ప్రతి స్కూల్, కాలేజీలలో రవాణా శాఖ అధికారులు స్వయంగా వెళ్లి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.రాష్ట్రంలో నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల 20 మంది వరకు మరణిస్తున్నారని మరణాల రేటును జీరోకి తగ్గించడమే లక్ష్యంగా అవగాహన కల్పించాలని తెలిపారు.ఎన్ఎస్ఎస్, లయన్స్ క్లబ్,రోటరీ క్లబ్‌లను భాగస్వామ్యం చేసి వారిని జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంస పత్రంతో సత్కరించాలని తెలిపారు.

# పెండింగ్ ఫీజు బకాయిలు మొత్తం ఇవ్వాలి

## నిధులు విడుదల చేయకపోతే యుద్ధం చేస్తాం : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు బకాయాలను పూర్తి మొత్తంలో విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని, ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లా పల్లి అంజి, నీలం వెంకటేష్, రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ మోడీరాందేవ్, జి.అనంతయ్య నాయకత్వంలో కొత్తపేటలో వందలాదిమంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రూ.6వేల కోట్ల ఫీజు బకాయిలు ఉంటే కేవలం రూ.36కోట్లు విడుదల చేసి విద్యార్థులను ప్రభుత్వం అవమానిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ రిజర్వేషన్లను 42 శాతం నుంచి 1 శాతానికి తగ్గించడం అన్యాయం అన్నారు. కళాశాల కోర్సులు చదువుతున్న 15లక్షల మంది విద్యార్థుల రూ పదివేల కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారని కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చి సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో ఉద్యోగాలు వచ్చినవారు అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు తీసుకోలేని పేదవారు ఉద్యోగాలు కూడా కోల్పోతురన్నారు. కళాశాల యాజమాన్యాల పరిస్థితి కూడా హద్దులు కట్టలేక అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం పోరాట ఫలితంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రియంబర్స్మెంట్ పథకం ప్రవేశపెట్టడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని నేడు ఉపాధి పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో 8 కళాశాలలో 15 లక్షల మంది విద్యార్థులు కష్టపడి చదువుతుంటే ప్రభుత్వంలోని అగ్రకులాలు ఓర్వలేక పోతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి మారిన ప్రతిసారి స్కీం అమలు చేయడంలో బడ్జెట్ కేటాయించడంలో అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. లక్షల కోట్లు అప్పులు తీసుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం కేవలం 6000 కోట్లు ఇవ్వడానికి మనసు ఒప్పడం లేదా అని ప్రశ్నించారు. బిసి వర్గాలు చదువుతుంటే అసూయ దేశంతో ఓర్వలేక ఫీజుల బడ్జెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.



ప్రదర్శనలో పాల్గొన్న ఎంపి ఆర్.కృష్ణయ్య

# కొత్త యేడాదిలో యాంత్రీకరణ పథకం పునఃప్రారంభం

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కొత్త ఏడాది రైతు యాంత్రీకరణ పథకాన్ని పునఃప్రారంభించనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో నిలిపివేసిన కేంద్ర పథకాలలో ఒక్కొక్కటిగా తాము పునరుద్ధరిస్తున్నట్ల చెప్పారు. ఇప్పటికే పప్పుదినుసుల విత్తనాలను సబ్సిడీపై అందించామన్నారు. ఇప్పుడు యాంత్రీకరణ పథకంలో భాగంగా 1.31 లక్షల మంది రైతులకు సబ్సిడీపై వివిధ పనిముట్లు/యంత్రాలు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ పథకానికి ఇప్పటికే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. జనవరి నెలలోగా ఈ ప్రక్రియను పూర్తిచేసి, రైతులకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రిగారి చేతుల మీదుగా పథకాన్ని జనవరి మొదటి వారంలో ప్రారంభించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కారాలు అందించాలన్నారు. ఇప్పటికే కేంద్ర పథకాల కోసం స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి 400 కోట్లను వినియోగించడం జరిగిందని తెలియజేశారు. ఆయిల్ పామ్ వంటి దీర్ఘకాలిక ఆదాయం ఇచ్చే పంటల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీలు అందిస్తూ పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌పై ఐదు జిల్లాల్లో సమర్థవంతంగా అమలవుతోందన్నారు. రబీ సీజన్ రైతుభరోసా కోసం శాటిలైట్ ఇమేజ్ మ్యాపింగ్ ను త్వరితగతిన పూర్తి చేసి రైతుభరోసా నిధులు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో దీర్ఘకాలికంగా మట్టిసారాన్ని కాపాడుతూ ఖర్చులు తగ్గించే విధానాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

# అక్రమాస్తుల కేసులో అరెస్టయిన రవాణా అధికారికి 14 రోజుల రిమాండు

## చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త :** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన కేసులో ఎసిబి అరెస్టు చేసిన మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్ నాయక్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో కిషన్ నాయక్ కార్యాలయంతో పాటు బోయిన్‌పల్లిలోని ఇంటిపై ఎసిబి అధికారులు మంగళవారం దాడులు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన వద్ద 200 కోట్ల రూపాయలకు పైగా ఆస్తులు పట్టుబడడం విదితమే. కిలోల కొద్ది బంగారు నగలు, భారీగా భూ పత్రాలు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ పత్రాలు, నగదు ఇందులో వున్నాయి. ఈ కేసులో ఆయనను ఎసిబి అధికారులు అరెస్టు చేసి ఎసిబి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండు విధించారు. అనంతరం ఎసిబి అధికారులు కిషన్ నాయక్‌ను బుధవారం తెల్లవారుజామున చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు. దీనిపై ఎసి బి అధికారులు విచారిస్తున్నారు.

# నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేని సిఎం

## 2028లో కాంగ్రెస్‌ను బొందపెట్టడం ఖాయం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోస్గిలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ, 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు.నదీ జలాల హక్కులను కాపాడటం చేతకాని అసమర్థుడు అహంకారంతో మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అది చాలదన్నట్లుగా కేసీఆర్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన రేవంత్ రెడ్డి ప్రవర్తనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు,ప్రజలు ఛీకొడుతున్నా ఇంకా మారవా అని ఎద్దేవా చేశారు. శాసనసభతో పాటు జనసభలోనూ కాంగ్రెస్ పార్టీ జలద్రోహాన్ని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో వందేళ్ల వరకు కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# వ్యవసాయ సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులు యధాతథం

## హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఎసిఎస్) పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమిస్తూ జారీచేసిన జీవో అమలును యథాతథంగా కొనసాగించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రత్యేకాధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న జారీచేసిన జీవో 597ను సవాల్ చేస్తూ కామారెడ్డి జిల్లా, రాజంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నల్లవెల్లి అశోక్ మరో 11 మంది డైరెక్టర్లు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి యధాతద స్థితిని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయశాఖ జారీచేసిన జీవోకు చట్టబద్ధత లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది బుచ్చిబాబు వాదించారు. చట్టంలోని 115 డి సెక్షన్ ప్రకారం పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారులను నియమించేందుకు వీల్లేదని చెప్పారు. ప్రత్యేకాధికారులను నియమించడం చట్టవ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. వాదనల అనంతరం హైకోర్టు ప్రతివాదులైన వ్యవసాయ, సహకారశాఖ కార్యదర్శి, కమిషనర్, కామారెడ్డి జిల్లా సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, రాజంపేట్ పీఏసీఎస్ కార్యదర్శులకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఈ నెల 27కు విచారణను వాయిదా వేసింది.

# రాష్ట్రవ్యాప్తంగా ముగిసిన టిజి-సెట్ 2025 పరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** అసిస్టెంట్ ప్రొఫెసర్లు,డిగ్రీ లెక్చరర్ల నియామకంలో కనీస అర్హత కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 22 నుంచి 24 వరకు మూడు రోజుల పాటు సెట్ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ నేతృత్వంలో అధికారుల బృందం ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని టిజి-సెట్ కార్యాలయం నుంచి పరీక్షల నిర్వహణను పర్యవేక్షి ంచారు. మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష 2025కు 45వేల 127 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 37వేల 706 మంది అంటే, 83.56 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎక్కడ ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తీసుకున్న చర్యలు ఫలించాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా, అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించిన అధికారులను ఓయూ వీసీ ఆచార్య కుమార్ మొలుగరం అభినందించారు.

# యాసంగి పంటలకు వారబందీ

## 8 రోజులు నీరు, మరో 7 రోజులు బంద్

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రస్తుత యాసంగి సీజన్‌కు వారబందీ (ఆన్ అండ్ ఆఫ్) పద్ధతిలో నీటి విడుదల చేపట్టడానికి అధికారులు నిర్ణయించారు. ఈనెల 24వ తేదీ నుంచి పంటలకు ఎస్సారెస్పీ నీటి విడుదలను అధికారులు ప్రారంభించి ఏప్రిల్ 8వ వరకు నీటి విడుదలను సరఫరా చేయనున్నారు. ఎనిమిది రోజుల పాటు ఆన్, 7 రోజుల పాటు ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేస్తారు. ఈ విధంగా మొత్తం 105 రోజుల పాటు నీరు విడుదల చేయనున్నారు. ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా ఎనిమిది తడులుగా నీటి విడుదల చేయనున్నారు.

# గుంటూరు రైల్వేస్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ఏర్పాటు

**హైదరాబాద్ )తార్నాక), డిసెంబరు 24, ప్రభాతవార్త :** అతితక్కువ ధరలకు ప్రయాణికులకు ఈ సౌకర్యం దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజన్, ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగు పరచడంతో పాటు నాన్‌ఫేర్ ఆదాయాలను పెంచే లక్ష్యంతో గుంటూరు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ప్లాట్‌ఫామ్ నెం. 1, గేట్ నెం. 3 వద్ద ఏర్పాటుచేశారు. ఈ సౌకర్యం ప్రయాణీకులకు, కుటుంబాలకు,మహిళా ప్రయాణీకులకు సురక్షితమైన, ఆధునిక,సరసమైన స్వల్పకాలిక వసతి సౌకర్యాన్ని అందిస్తుంది. ప్రస్తుతం ఇటువంటి సౌకర్యం విశాఖపట్నం, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉంది.ముఖ్య మైన సౌకర్యాలు.......స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం 52 సింగిల్ బెడ్‌లు,12 డబుల్ బెడ్‌లతో మొత్తం 64 పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. మొత్తం 64 బెడ్‌లలో, కుటుంబాలు మరియు మహిళలకు బెడ్‌లు కేటాయించబడ్డాయి. వాటిలో 10 డబుల్ బెడ్‌లు, 12 సింగిల్ బెడ్‌లు ఉన్నాయి.ఈ సౌకర్యం ప్రయాణికులకు అను కూలమైన అనేక సౌకర్యాలతో కూడి ఉంది. ఇందులో ఉచిత వైపై సౌకర్యం, వేడి నీటి సరఫరా, స్నాక్స్ బార్, ట్రావెల్ డెస్క్, విశాలమైన మరియు పరిశుభ్రమైన నిద్ర ప్రాంతాలు, శుభ్రమైన టాయిలెట్ సౌకర్యాలు, వస్తువులను సురక్షితంగా నిల్వ చేయడానికి లాకర్ సౌకర్యం ఏర్పాటు చేశారు. దీనికి అతితక్కువ ధరలతో టారిఫ్ నిర్ణయించారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రయాణీకులకు అనుకూలమైన స్నేహపూరకమైన చొరవకు ప్రయాణ సమయంలో సౌకర్య వంతమైన బసను అందించినందుకు గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ గుంటూరు డివిజన్ బృందానికి అభినందనలు తెలిపారు. నాన్‌ఫేర్ ఆదాయాన్ని సృష్టించడం కోసం చర్యలు తీసుకున్నందుకు ఆయన డివిజన్ ను అభినందించారు. ఈ చొరవ ప్రారంభం ఆధు నిక మోలిక సదుపాయాల ద్వారా ప్రయాణీకుల సౌలభ్యాన్ని పెంపొందించడానికి దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన నిరంతర ప్రయత్నాలను ప్రతిబిం బిస్తూ అదే సమయంలో ప్రధాన రైల్వే కార్యకలా పాలకు మించి ఆదాయాన్ని సృష్టిస్తుందన్నారు.



గుంటూరు రైల్వే స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్లీపింగ్ పాడ్స్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

# పిహెచ్‌డి, ఎంఫిల్ అర్హతతో పదోన్నతి పొందిన అధ్యాపకులకు అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** ప్రభుత్వ జూనియర్ అధ్యాపకులు పిహెచ్.డి,ఎం.ఫిల్. అర్హతలతో పదోన్నతిపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియామకమైనప్పుడు ఇవ్వాల్సిన అడ్వాన్స్ ఇంక్రిమెంట్లపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ ఆధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్ గోపి,రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ కె సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. పిహెచ్.డి,ఎం.ఫిల్ విద్యార్హతలతో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా డిగ్రీ కళాశాలలో పదోన్నతి పొందిన జూనియర్ అధ్యాపకులకు కూడా నేరుగా నియామకం పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లతో సమానంగా ప్రోత్సాహక ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వం తేల్చి చెప్పడంతో గత తొమ్మిది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని వారు తెలియజేశారు. ఇప్పటివరకు కొందరు అధికారుల అవగాహన రాహిత్యం కారణంగా పదోన్నతిపై నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రవేశస్థాయి నియామకంగా పరిగణించకపోవడంతో పిహెచ్.డి, ఎం.ఫిల్ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు నిలిపివేశారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది అర్హులైన అధ్యాపకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి అన్నారు.అధికారులతో జరిగిన చర్చల ఫలితంగా ప్రభుత్వం ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కళాశాల కమీషనర్ 2016 లో జారీ చేసిన సర్క్యులర్ ఆదేశాలను ఉపసంహరించుకుంటూ, పదోన్నతిపై అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమితులైన వారికి కూడా పిహెచ్.డి, ఎం.ఫిల్. అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు నేరుగా నియామకం పొందిన వారితో సమానంగా ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాకి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు సంఘ బాధ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు

# జిల్లా కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణానికి కసరత్తు

## అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతి బ్లాక్ నుంచి ఉపాధ్యక్షుడు

## జిల్లాకు ఒక కోశాధికారి, ఇద్దరు ప్రధాన కార్యదర్శులు

## మున్సిపల్‌కార్పొషన్ పరిధిలో పది వార్డులకు ఓ ప్రధానకార్యదర్శి

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త :** తెలంగాణలో డిసెంబరులో మూడు విడుదలుగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మిగితా పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించడంతో ఇక జిల్లా కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంకు టిపిసిసి కసరత్తులు మొదలు పెట్టింది. తెలంగాణ కాంగ్రెస్ ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఇంచార్జ్ సెక్రటరీ సెక్రటరీలు విశ్వనాథన్ పెరమాళ్, సచిన్ సావంత్ సమాలోచనలు చేసి ఎట్టకేలకు జిల్లా కాంగ్రెస్‌కమిటి కార్యవర్గం రూపకల్పన చేయడం జరిగింది. తెలంగాణ వ్యాప్తంగా అధ్యక్షులు ఏకరూపకతతో జిల్లా కార్యవర్గాల ఏర్పాటుకు సంబంధించి వివిధ హోదాల, సంఖ్యా విధానాలపై టిపిసిసి మార్గదర్శకాలు విడుదల చేసింది. మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో విస్తృత చర్చల అనంతరం రూపొందించిన ఈ మార్గదర్శకాలను జిల్లా నాయకులు, బాధ్యులు విధిగా పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.జిల్లా నుంచి ఒక కోశాధికారి పదవిని కేటాయించారు. జిల్లా ఉపాధ్యక్ష పదవికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతి బ్లాక్ నుంచి ఒకరుచొప్పున జిల్లా కార్యవర్గంలో ప్రాతినిధ్యం వహించబోతున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో, ప్రతి బ్లాక్ నుంచి ఇద్దరు చొప్పున కార్యవర్గంలోని తీసుకోవాల్సి ఉంటుందని కొత్తగా రూపొందించిన జిల్లా సంస్థాగత నిర్మాణం నియమావళిలో చేర్చారు ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు బ్లాకులుంటే నలుగురు ప్రధాన కార్యదర్శులు ప్రాతినిధ్యం ఆ జిల్లా కార్యవర్గంలో ఉంటుంది. అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతిమండం నుంచి కార్యదర్శి పదవి ఒకరు చొప్పున ఎంపిక చేసి జిల్లా కార్యవర్గంలో చోటు ఇస్తారు. జిల్లాలో ఉన్న మొత్తం మండలాల సంఖ్యకు అనుగుణంగా కార్యదర్శుల సంఖ్య ఉండబోతుంది. జిల్లా అధికార ప్రతినిధి పదవికి ప్రతి నియోజకవర్గాన్ని ఒకరు చొప్పున ప్రాతినిధ్యం ఉంటుంది. జిల్లా కార్యవర్గ సభ్యుల నియామకంలో గరిష్టంగా 15 మంది దాటకుండా నియమించుకోవాల్సి ఉంటుంది. జిల్లా పార్టీకి చెందిన సీనియర్ నేతలకు ఈ కమిటిలో ప్రాతినిధ్యం కల్పించుకోవచ్చు. మునిసిపల్ కారొర్పరేషన్ పరిధిలో జిల్లా కార్యావర్గం సంస్థాగత రూపం కొంత భిన్నరూపంలో ఉండేలా డిజైన్ చేశారు. ఉపాధ్యక్ష పదవి ఒక బ్లాక్ నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రతి 10వార్డులకు ఒకరు చొప్పున ప్రధాన కార్యదర్శుల నియామకం ఉంటుంది. కార్యదర్శులు ప్రతి 5వార్డులుకు ఒకరు చొప్పున ప్రాతినిధ్యం వహిస్తారు. కార్యవర్గ సభ్యులు ఆయా పట్టణాల్లోని వార్డుల సంఖ్య ఆధారంగా నిర్ణయించాలి. ఒక కార్పోరేషన్ పరిధిలో ఎన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయో వాటిని అనుసంధాన్ని పరిగణలోకి తీసుకొని జిల్లా కార్యవర్గాల కూర్పును చేసుకోవాలి. జిల్లా కార్యవర్గ కమిటి కూర్పు తుది రూపం దాల్చిన అనంతరం కమిటిని టిపిసిసి అధ్యక్షుడు మాత్రమే ప్రకటిస్తారు. సంస్థాగత పదవుల సంఖ్యను టిపిసిసి చీఫ్ అనుమతితో తుది నిర్ణయం రాజకీయ ప్రత్యేక పరిస్థితి ఉన్న జిల్లాలో తీసుకుంటారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళనల సందర్భంలో నమోదైన కేసులు తప్ప ఇతర తీవ్ర క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులను కార్యవర్గ కమిటీలో ఎట్టి పరిస్థితుల్లో పరిగణలోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.

# విద్యుత్ సంస్థల్లో బదలీలకు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల్లో సాధారణ బదిలీలకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకూ ఈ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్కో), ట్రాన్స్కో, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ పంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగుల బదిలీలకు సర్కార్ పచ్చజెండా ఊపింది. టీజీ జెన్‌కో, ఉత్తర, దక్షి ణ డిస్కంలలో బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ తాజాగా ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ రోల 23వ తేదీ నుండి 2026 జనవరి 31లోగా బదిలీలను పూర్తిచేయాలని గడువు విధించారు. ఏటా సంస్థ పాలకమండలి నిర్ణయం మేరకు మే, జూన్ నెలల్లో బదిలీలు పూర్తి చేసేవారు. కానీ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం విధిస్తూ గత జూలై 31న జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వ రంగ స్థలకు సైతం ఈ నిషేధం వర్తిస్తుందని అప్పట్లో ఆర్థిక శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో తమకు బదిలీల నిషేధం నుండి సడలింపు ఇవ్వాలని విద్యుత్ విభాగాల అధికారులు, ఉద్యోగులు గత అగస్టు 30న సర్కార్‌కు లేఖ రాశారు. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన నిషేధాన్ని ఇప్పుడు ఎత్తివేసింది. అయితే ఈ వారంలో సెలవులు ఉండటంతో వచ్చేవారంలో కసరత్తు చేసి జనవరి మొదటి వారంలో బదిలీలు చేపట్టే అవకాశాలున్నాయి. మరోపక్క బదిలీలపై నిషేధం ఎత్తివేయడంతో పలువురు పైరవీల దందాకు తెరతీసినట్లు తెలియవచ్చింది. తమకు నచ్చిన చోట పోస్టింగ్ వేయించుకునేందుకు పలువురు ప్రయత్నాలు మొదలెట్టినట్లు సమాచారం.

# గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ఏర్పాటు



గుంటూరు రైల్వే స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్లీపింగ్ పాడ్స్‌ను ప్రారంబిస్తున్న అధికారులు

**తార్నాక, డిసెంబర్ 24 ప్రభాతవార్త :**అతితక్కువ ధరలకు ప్రయాణీకులకు ఈ సౌకర్యం దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజన్, ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు నాన్‌ఫేర్ ఆదాయాలను పెంచే లక్ష్యంతో గుంటూరు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ప్లాట్‌ఫామ్ నెం. 1, గేట్ నెం. 3 వద్ద ఏర్పాటుచేశారు. ఈ సౌకర్యం ప్రయాణీకులకు, కుటుంబాలకు, మహిళా ప్రయాణీకులకు సురక్షితమైన, ఆధునిక, సరసమైన స్వల్పకాలిక వసతి సౌకర్యాన్ని అందిస్తుంది. ప్రస్తుతం ఇటువంటి సౌకర్యం విశాఖపట్నం, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉంది. ముఖ్యమైన సౌకర్యాలు.......స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం 52 సింగిల్ బెడ్‌లు, 12 డబుల్ బెడ్‌లతో మొత్తం 64 పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. మొత్తం 64 బెడ్‌లలో, కుటుంబాలు మరియు మహిళలకు బెడ్‌లు కేటాయించబడ్డాయి. వాటిలో 10 డబుల్ బెడ్‌లు, 12 సింగిల్ బెడ్‌లు ఉన్నాయి. ఈ సౌకర్యం ప్రయాణీకులకు అనుకూలమైన అనేక సౌకర్యాలతో కూడి ఉంది. ఇందులో ఉచిత వైఫై సౌకర్యం, వేడి నీటి సరఫరా, స్నాక్స్ బార్, ట్రావెల్ డెస్క్, విశాలమైన మరియు పరిశుభ్రమైన నిద్ర ప్రాంతాలు, శుభ్రమైన టాయిలెట్ సౌకర్యాలు, వస్తువులను సురక్షితంగా నిల్వ చేయడానికి లాకర్ సౌకర్యం ఏర్పాటుచేశారు. దీనికి అతితక్కువ ధరలతో టారిఫ్ నిర్ణయించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రయాణీకులకు అనుకూలమైన స్నేహ పూరకమైన చొరవకు ప్రయాణ సమయంలో సౌకర్యవంతమైన బసను అందించినందుకు గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ గుంటూరు డివిజన్ బృందానికి అభినందనలు తెలిపారు. నాన్‌ఫేర్ ఆదాయాన్ని సృష్టించడం కోసం చర్యలు తీసుకున్నందుకు ఆయన డివిజన్ ను అభినందించారు. ఈ చొరవ ప్రారంభం ఆధునిక మోలిక సదుపాయాల ద్వారా ప్రయాణీకుల సౌలభ్యాన్ని పెంపొందించడానికి దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన నిరంతర ప్రయత్నాలను ప్రతిబింబిస్తూ అదే సమయంలో ప్రధాన రైల్వే కార్యకలాపాలకు మించి ఆదాయాన్ని సృష్టిస్తుందన్నారు.

# వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలి

## - పౌరసరఫరాల శాఖ ఎండి ఢిల్లీరావు



వినియోగదారులకు అవగాహనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఢిల్లీరావు తదితరులు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 24, ప్రభాతవార్త :** వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పౌరసరఫరాలశాఖ యండి డిల్లీరావు సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి వేడుకలను బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిల్లీరావు మాట్లాడుతూ వినియోగదారుల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని, వినియోగదారులకు నష్టం కలిగితే వెంటనే వినియోగదారులకోరు ట్లో ఫిర్యాదు చేయాలన్నారు. గతంలో వస్తువు కొన్న చోట కేసు పెట్టాల్సి ఉండేదని, ప్రస్తుత చట్టం ప్రకారం వినియోగదారులు నివసించే చోట ఇంటివద్ద నుండే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, కేసు విచారణకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరుఅయ్యే అవకాశం ఉందన్నారు. బిస్‌కేర్ యాప్‌ద్వారా హాల్‌మార్క్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ-జాగృతి యాప్‌ద్వారా కేసు స్థితిని తెలుసుకునే అవకాశం ఉందని డిల్లీరావు తెలిపారు. నూతన చట్టం ప్రకారం నష్టపరిహారం ఎంతైనా అగడవచ్చని కానీవస్తువు కొనుగోలు కోసం చెల్లించిన విలువ రూ.50లక్షలలోపు ఉండాలన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం వస్తువులు కొనుగోలు చేసేవారు మాత్రమే వినియోగదారుల చట్టం పరిధిలోకి వస్తారని, వ్యాపార లావాదేవీల కోసం వస్తువులు కొనుగోలు చేసేవారు ఈచట్టం పరిధిలోకి రారని వివరించారు. పౌరసరఫరాలసంస్థ సంచాలకులు ఆర్.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బంగారు దుకాణాల్లో ఒక మిల్లీగ్రామ్ స్కేల్ ఖచ్చితత్వాన్ని అమలు చేయటం గొప్ప విజయంగా అభివర్ణించారు. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ సమాజంలో ఏవృత్తిలో ఉన్నవారైనా ప్రతి ఒక్కరూ వినియోగదారులేనన్నారు. ఇంటర్నెట్ వినియోగం పెరగటం, స్మార్ట్‌ఫోన్‌ని విరివిగా వాడటం వల్ల సమాజంలో సైబర్‌మోసాలు పెరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈసందర్భంగా వినియోగదారుల హక్కులపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బిస్ డైరెక్టర్ ప్రేమ్ సజానీ, లీగల్‌మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ కృష్ణచైతన్య, జేసి ఎస్.ఇలక్కియ, పౌరసరఫరాలశాఖ అదనపు సంచాలకులు కె.రంగకుమారి, డిఈఓ చంద్రకళ, పౌరసరఫరాలశాఖ జిల్లాఅధికారి ఏ.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# అటల్, మోడీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన: బిజెపి ఎపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

**విజయవాడ, డిసెంబర్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** అటల్ మోదీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో వాజ్‌పేయి విగ్రహాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నేటి తరానికి వాజ్‌పేయి విలువలు ఆదర్శమని అన్నారు. వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకుని అందరూ ఆశ్చర్యవ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సుపరిపాలన యాత్ర గురించి సీఎం చంద్రబాబుకు చెప్పిన వెంటనే ఆనందం వెలిబుచ్చారని తెలిపారు. ఈ యాత్రకు కూటమిపరంగా , ప్రభుత్వపరంగా సహకారం అందించారని చెప్పారు. ఈ యత్రలు, సభల్లో కూటమి పార్టీల నేతలను భాగస్వామ్యం చేశారన్నారు. అటల్, చంద్రబాబులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లకు నాడు వాజ్‌పేయి సహకారం అందించారని గుర్తుచేశారు. సుపరిపాలన యాత్రలో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారన్నారు.



వాజ్‌పేయి ఈ దేశానికి చేసిన సేవకు, త్యాగాలను గురించి అందరూ ముక్త కంఠంతో కీర్తిస్తున్నారని తెలిపారు. ఈనెల 25న వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో స్మృతి వనం, విగ్రహాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ధర్మవరం నుంచి అమరావతి వరకు తమ యాత్రకు ప్రజలు నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాలకు రోడ్లు, ఐటీ, టెలికం, పొలిటికల్ కనెక్టివిటీలకు ఆద్యులు వాజ్‌పేయి అని కొనియాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా ప్రజలు నుంచి వస్తున్న స్పందన అపూర్వమన్నారు. నేటి యువతరం, భవిష్యత్తుతరాలు వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకోవాలని సూచించారు. తాము ఏర్పాటు చేసిన విగ్రహాలు, యాత్ర ద్వారా వాజ్‌పేయి నుంచి చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారన్నారు.

# మోసపూరిత ప్రకటనలపై వినియోగదారులు అప్రమత్తం

## - జిల్లా కన్స్యూమర్ కమిషన్ ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ సలీం

**చిత్తూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** మోసపూరిత ప్రకటనల పట్ల వినియోగదారులు నిత్యం అప్రమత్తంగా వుండాలని జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జ్ ప్రెసిడెంట్ సలీం పేర్కొన్నారు. చిత్తూరు బిఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ వినియోగదారుల రక్షణ చట్టం-2025 సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జ్ ప్రెసిడెంట్ సలీం పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం వారికి అవగాహన కల్పించడానికి, వారి హక్కులను గుర్తు చేయడం కోసం ప్రతి ఏడాది డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. 2025 సంవత్సరంలో డిజిటల్ న్యాయం ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన తొలగింపు అనే థీమ్‌తో మార్గనిర్దేశం జారీ చేయడం జరిగిందన్నారు. ప్రతి వస్తువు కొనుగోలుపై బిల్లును కచ్చితంగా పొంది మీకు వున్న అధికారంను పొందాలన్నారు. జిల్లా కమీషన్‌లో రూ.50 లక్షల వరకు ఫిర్యాదు చేయవచ్చునని, రూ.2 కోట్ల వరకు రాష్ట్ర కమీషన్‌కు ఫిర్యాదు చేసి సత్వర న్యాయంపొందవచ్చు నన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీన కన్నన్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మీడియంల్లో ఒకొక్క విభాగం నుండి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలును అతిథులు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు 12 బహుమతులు, జూనియర్ కళాశాల విద్యార్థులకు 12 బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శంకరన్, సర్వశిక్షాభియన్ పిఓ వెంకటరమణ, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ రమాదేవి, బిఎస్ ప్రభుత్వ బిఎస్ కన్నన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్‌మౌలా,



వినియోగదారుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జీ ప్రెసిడెంట్ సలీం

బిఎస్ కన్నన్ పాఠశాల హెడ్మాస్టర్ కోమల, పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్ర, చిత్తూరు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నప్పశ్రీనివాస్, డిటిసి ఎఓ చక్రపాణి, చిత్తూరు అర్బన్ తహసిల్దారు కులశేఖర్, రూరల్ తహసిల్దారు కళ్యాణి,

సమగ్ర శిక్ష అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైలైజేషన్ ఆఫీసర్ బి.మధుసూధన్‌నాయుడు, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.అరుణ్‌కుమార్, బంగారుపాళ్యం, యాదమరి, పులిచెర్ల, ఐరాల, జిడినెల్లూరు, నగరి కన్స్యూమర్ వాలంటీర్ అర్గనైజేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి క్యాంటిన్‌లో ఆహార పదార్థాలపై ఎలుకల దాడి



విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతి నిధి:** విజయవాడలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకలి రాజ్యం క్యాంటీన్‌లో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ప్రైవేటు హోటల్లో ఎలుకలు నూడిల్స్ తింటూ కనిపించాయి. ఈ దృశ్యాలను అక్కడ చదువుకుంటున్న ఓ పీజీ విద్యార్థి తన మొబైల్ లో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇప్పుడు ఆ వీడియో కొన్ని గంటల్లోనే విపరీతంగా వైరల్ అయింది. డ్వాక్రా మహిళల కోటాలో టిఫిన్, భోజనం సరఫరా చేయడానికి విజయవాడ కొత్త గవర్నమెంట్ ఆసుపత్రి ప్రాంగణంలో "ఆకలి రాజ్యం" పేరుతో హోటల్ ని ప్రారంభించారు. అక్కడ కేవలం టిఫిన్ భోజనం సరఫరా చేయడానికి మాత్రమే అనుమతి ఉంది. కానీ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి ఫాస్ట్ ఫుడ్ , పిజ్జా నూడిల్స్ కూడా అందుబాటులో ఉంచారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది నిరక్ష్యంతో ఉడికించిన నూడిల్స్ ను పక్కన ఉంచి.. కనీస శుభ్రత పాటించడం లేదు. ఈ క్రమంలో క్యాంటీన్ లోపల ఉన్న ఎలుకలు వాటిని తినడం ప్రారంభించాయి. అక్కడికి వచ్చిన ఓ పీజీ విద్యార్థి ఆసుపత్రి క్యాంటీన్లో నూడిల్స్ తింటున్న ఎలుకల వీడియో తీసి వైరల్ చేశాడు.

# ఇనుమూరులో మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోండి : సిపిఎం శ్రీనివాసరావు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏలూరు జిల్లా ఇనుమూరులో గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి అడ్డొచ్చిన గిరిజనులపై, గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన పోలీసు, రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్షణం ఈ విషయంలో పోలీసు జోక్యాన్ని ఆపాలని డిజిపికి ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఆ గ్రామాన్ని చుట్టిముట్టి భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని, వారిని ఉపసంహరించి పేద గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్.. రెవెన్యూ అధికారుల జోక్యాన్ని ఆపాలన్నారు. గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా పంటను ధ్వంసం చేయడం దుర్మార్గమని తెలిపారు. గిరిజన మహిళలపై మగ పోలీసులే దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను గిరిజనులు తమ పూర్వీకుల నుంచి చదును చేసి సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అసైన్‌మెంట్ చేయాలని అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు నమోదై ఉన్నప్పటికీ పోలీసులు భూస్వాముల పక్షం వహించడం కోర్టు ధిక్కరణే అవుతుందని పేర్కొన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీలో ఈ రకంగా పోలీసు, అధికార యంత్రాంగం వ్యవహరించడం, గిరిజనులపై చట్టవిరుద్ధంగా దాడికి దిగడాన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యా ప్రమాణాలు మెరుగుకు 'మన బడి మన బాధ్యత'



**విజయవాడ, డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాల విద్యా ప్రమాణాలు మెరుగుకు గుంటూరు జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమం ప్రారంభించింది. ముఖ్యంగా తొమ్మిది, పదవ తరగతి విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు పట్ల అవగాహన కల్పించడం తద్వారా పది పరీక్షలలో శత శాతం ఫలితాలు సాధించడం లక్ష్యంగా "మన బడి మన బాధ్యత" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో గల 185 ఉన్నత పాఠశాలలకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి ఆయా పాఠశాలల పర్యవేక్షణ చేయుటకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది, పది విద్యార్థుల్లో మానసిక ఆందోళన తగ్గించడం, చదువు పట్ల ఏకాగ్రత కలిగించడం, విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిలో మంచి తర్ఫీదు ఇవ్వడం, అందులో ఉన్న భయం పోగొట్టడం, అదే సబ్జెక్టులో ఉన్నత విద్య అభ్యసించి అందులో నిపుణులుగా తయారు అయ్యే విధంగా మలచడం వంటి అంశాలు పట్ల దృష్టి సారించారు. విద్యార్థులకు ప్రత్యేక అధికారులు మార్గదర్శిగా, కౌన్సిలింగ్ అందించడం చేస్తారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన వ్యక్తుల జీవిత చరిత్రలు తెలియజేస్తూ ప్రేరణ కలిగించడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విద్యార్థులు సరైన అవగాహన లేక అనేక అవకాశాలు చేజార్చుకుంటున్నా రన్నారు. విద్యార్థులకు మంచి మార్గదర్శకత్వం, సూచనలు, సలహాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు అందించడం వలన భవిష్యత్తుకు గట్టి పునాది పడుతుందన్నారు. అందుకే "మన బడి మన బాధ్యత" కార్యక్రమాన్ని అమలు చేస్తూ జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులు.

# జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధూ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. పివి సింధూ గతంలో కూడా పలుమార్లు శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పాల్గొన్నారు. బుధవారం సింధూ కుటుంబసభ్యులతో రాగా ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ స్వాగతం పలికారు. ఏర్పాట్లను ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు. ఆమె ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణపూజలు జరిపించుకోవాలని

కోరగా అలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎపిఆర్ఓ రవి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి సహస్రలింగేశ్వరాలయం వద్ద వేదపండితులతో ఏర్పాటు చేసారు. పూజల అనంతరం ఆమెకు అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలుఅందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.



**ఛైర్మెన్‌చే సన్మానం:** భారతదేశంలో క్రీడల ప్రాధాన్యత మహిళలకు అవకాశాలకు హద్దులేదని నిరూపించిన పివి సింధూ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి రాగా ఆమెకు సాదర స్వాగతాలు ఏర్పాటు చేయటమే కాకుండా శ్రీకాళహస్తి ప్రాధాన్యతను వివరిస్తూ ఆమెను దుశ్శాలువతో సత్కరించారు.

# విజయవాడ- గూడూరు మధ్య నాలుగో రైల్వేలైన్ నిర్మాణం!

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి డీపీఆర్ సిద్ధమవుతుంది. దీని వలన ప్రయాణం కుడా సులభతరం అవుతుంది. గూడ్స్ రవాణాలో విజయవాడ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ప్యాసింజర్ రైళ్లతో కలిపి రోజుకు సగటున 170 వరకు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే విజయవాడ నుంచి గూడూరు మధ్య రూ.6,238 కోట్లతో 280 కి.మీ. మూడో రైల్వేలైను నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో 260 కి.మీ. పూర్తయ్యింది. త్వరలోనే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. తీరం వెంబడి సరకు రవాణాను మరింతగా పెంచడం కోసం ఇప్పటికే కేంద్రం పారిశ్రామిక కారిడార్లకు రూపకల్పన చేసింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని నాలుగో రైల్వేలైను నిర్మాణానికి సెమీ హైస్పీడ్ ప్రాజెక్టులో భాగంగా రైల్వేశాఖ డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. రానున్న బడ్జెట్‌లో కేంద్రం దీనికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లు కూడా పెరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ నుంచి గూడూరు మధ్య మూడో లైన్ వెంబడి 293 కి.మీ. మేర కొత్తగా నాలుగో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు, నాలుగు లైన్ల నిర్మాణం పూర్తయితే విజయవాడగూడూరు మధ్య ప్రయాణ సమయం మరింతగా తగ్గుతుంది. గూడ్స్ రైళ్లు సాఫీగా వెళ్లే అవకాశం కూడా ఉంది. హైస్పీడ్ రైళ్లు గంటకు 200 కి.మీ. వేగంతో పరుగులు తీయనున్నాయి. ప్రస్తుతం మూడోలైను పక్కనే నాలుగో లై ను అవసరాలకు అనుగుణంగా వంతెనలను, ఆర్వోబీలను నిర్మిస్తున్నారు. దీంతో నాలుగోలైన్ పూర్తిగా కార్యరూపం దాల్చితే ట్రాక్ పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. తీరం వెంబడి సరకు రవాణాను మరింతగా పెంచడం కోసం ఇప్పటికే కేంద్రం పారిశ్రామిక కారిడార్లకు రూపకల్పన చేసింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని నాలుగో రైల్వేలైను నిర్మాణానికి సెమీ హైస్పీడ్ ప్రాజెక్టులో భాగంగా రైల్వేశాఖ డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. రానున్న బడ్జెట్‌లో కేంద్రం దీనికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లు కూడా పెరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ నుంచి గూడూరు మధ్య మూడో లైన్ వెంబడి 293 కి.మీ. మేర కొత్తగా నాలుగో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు.

# సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిది : మంత్రి నారాయణ

**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** సిఎం సహయనిధి పేదలకు ఒక వరంలాంటిదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాకటర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి నారాయణ పంపిణీ చేశారు. 29మందికి 22,42,308రుపాయల చెక్కులు అందజేశారు. సిఎంఆర్‌ఎఫ్ మంజూరుకు సహకరించిన మంత్రి నారాయణకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం చంద్రబాబు పదికాలాలుపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదల పాలిట సంజీవనిల మారిందన్నారు. పేదల ప్రాణరక్షణకు సిఎం రిలీఫ్‌ఫండ్ అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్యంతో బాదపడుతున్న పేదల ప్రణాలకు భరోసా కల్పిస్తోందన్నారు. దరఖాస్తు చేసుకొన్న వారందరికి సిఎం సిఎం సహాయనిధి మంజూరు చేస్తున్నారని తెలిపారు. సిటీ నియోజకవర్గంలో ఏడాదిలో 292మందికి 3కోట్ల2లక్షల 12వేల 700రుపాయల చెక్కులు అందచేస్తామని పేదల సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయుడు గారు అత్యధిక ప్రాదాన్యత ఇస్తున్నారన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం మాదని ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఈకార్యక్రమంలో కమీషనర్ నందన్, రాష్రట వక్ఫ్‌బోర్డ్ ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పోరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాస్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జడ్పిటిసి విజేతారెడ్డి, నగరపార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పోరేటర్లు, డివిజన్ ముఖ్య నేతలుపాల్గొన్నారు.

# అటవీశాఖ భూములకు రెవెన్యూ పట్టాలు

## పెన్సింగ్ తొలగించి నిమ్మ, మామిడి చెట్లు నాటారంటూ అటవీశాఖకు ఫిర్యాదు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని సింహాచల కండ్రిగలో ఎంతో కాలంగా రగులుతున్న అటవీభూముల వివాదం రోజు రోజుకు ముదురుతుంది. ఈ వివాదాలకు సంబంధించి కోర్టులో స్టేటస్‌కో అమలులో ఉంది. వివాదాస్పదమైన భూముల్లో ప్రవేశించి అటవీశాఖ అస్తులను ధ్వంసం చేసినారంటూ అటవీశాఖ సెక్షన్ అధికారి గిరిశం ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు 27మందిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్ బుధవారం వివరించారు. శ్రీకాళహస్తి అటవీశాఖ పరిధిలో సింహాచల కండ్రిగ గ్రామానికి సమీపంలో అటవీ భూములున్నాయి. ఈ భూములకు గతంలో రెవెన్యూ శాఖ రైతులకు పట్టాలుజారి చేసారు. అయితే ఈ భూములకు సంబంధించి అటవీశాఖ పేచీ పెట్టింది. దాంతో ఈ సమస్య కోర్టుకు వెళ్ళింది. పలు పరిశీలనల తరువాత ఈ భూములు అటవీశాఖకు చెందినవే అంటూ కోర్టు తీర్పు చెప్పింది. ఈ భూముల్లో చెట్టను నాటటానికి నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు వెళ్ళినపుడు ఆర్నెల్ల క్రితం పట్టాలు పొందిన వారు అడ్డుకున్నారు. దాంతో ఈ సమస్య రాజకీయంగా మారింది.. మండలంలోని సింహాచల కండ్రిగ గ్రామంలో అటవీశాఖకు చెందిన భూములున్నాయి. ఇక్కడి అటవీభూములకు గతంలో పని చేసిన రెవెన్యూ అధికారులు కొందరు రైతులకు పట్టాలు ఇచ్చారు. దాంతో గ్రామస్తులు అటవీశాఖకు మధ్య పోరు ప్రారంభం అయ్యింది. ఈ పోరు శాంతి భద్రతల సమస్యగా మారింది. ఈ సమస్యకు సంబంధించి ఒక దశలో స్థానిక నాయకుడు ఒకరు కల్పించుకున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. సింహాచల కండ్రిగకు సంబంధించి అటవీభూములకు సంబందించి గ్రామస్తుల మధ్య వివాదం చోటు చేసుకోగా సమస్యను పెంచకుండా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్‌ను రప్పించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. వివాదాలకు సంబంధించిన సింహాచలకండ్రిగ వాసులకు, అటవీ ఉన్నత శాఖ అధికారులను రప్పించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానికులను ఒదార్చారు. ప్రత్యామ్నాయం భూముల ఇస్తామని నమ్మబలికారు. అయితే గ్రామస్తులకు సమీపంలో ఇస్తామన్న హామీని అమలు చేయటానికి సాధ్యం కాలేదు. రెవెన్యూ శాఖకు అందుబాటులో ఉన్న 6కిలో మీటర్ల దూరంలోని ఆంజనేయ పురం గ్రామానికి సమీపంలో ఇచ్చారు. అయితే బాధితులు అందుకు అంగీకరించక మళ్ళీ కోర్టును ఆశ్రయించారు. దాంతో సమస్య మొదటికి వచ్చింది. కానీ కోర్టులో ఈ భూముల కు సంబంధించి స్టేటస్‌కో ఉన్నా గ్రామస్తులు భూముల్లోకి ప్రవేశించి అటవీశాఖ నాటిన చెట్లను తొలగించి తమ చెట్లను నాటుకొని తమ ఫెన్సింగ్‌ను వేసుకున్నారు. అయితే అటవీశాఖ అధికారులు ఫిర్యాదుతో సరిపెట్టుకున్నారు.

# వాయులింగేశ్వరుని సేవలో సుప్రీం కోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబసభ్యులతో కలసి బుధవారం వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఇఓ టి.బాపిరెడ్డి వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించగా వేదపండితులతో వేదమంత్రాలతో ఆశీర్వదించారు.



## తిరుప్పావై

### 10వ పాశురము



నోత్తుచ్చువర్గ్గమ్ పుగుగిన
అమ్మనాయ్!
మాత్తముమ్ తారారో వాశల్
తిఱవాదార్,
నాత్త త్తుకాయుడి నారాయణన్,
నమ్మాల్
పోత్తప్పఱై తరుమ్ పుణ్ణియనాల్,
పణ్డొరునాళ్,
కూత్తత్తిన్ వాయ్వ్వీల్న్ద
కుమ్భకరణనుమ్.
తోత్తమునక్కే పెరున్దుయిల్ తాన్
తన్దానో,
ఆత్త అనన్థలుడై యాయ్ !
అరుంగలమే!
తేత్తమాయ్ వన్దు తిఱవేలో
రెమ్బావాయ్


ఇంకొక గోపిక ముందుగానే నోమునోచినది. సుఖానుభము పొందుచున్న. సుఖానుభవము పొందుచున్నది. తలుపులు తెరువకపోయినరో మాట్లాడ గాఢనిదురను నీకు కప్పంగా ఇకమైన నిదురమత్తును. వదులు, పైకము వీడు అని గోపికను మందలిస్తున్నారు. తులసీమాలల అలంకరణతో కిరీటముగల నారాయణుడు, పుణ్యస్వరూపుడు అయిన కృష్ణుణ్ణి మంగళా. శాసనములు పాడిన ఖిపరిఖి యను వాయిద్యమును మన కిచ్చును. మాకందరకు మణిరత్నంలాంటి దానిని పొగుడుతూ త్వరగా వచ్చి తలుపు తీయవమ్మా అని వేలు పలి గోపికలు లోపలి గోపికను కోరుతున్నారు. **ఫలం:** "అన్ని కష్టాలు తీరుటకొరకు"

# క్రీస్తు ఆరాధనే 'క్రిస్మస్'



'దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు, ఈయన ప్రభువైన క్రీస్తు. దానికిదే మీకానవాలు, ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొకతొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను' (లూకా 2:11).

ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధపడుతున్నారు. కొత్తబట్టలు, పిండివంటలు, క్రిస్మస్ ట్రీ డెకరేషన్, ఇంటి డెకరేషన్, చర్చిల డెకరేషన్ వంటి హంగామాతో ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తున్నది. మనం ఏదో గొప్పగా ఉత్సవాలను జరుపు కునేందుకు యేసుక్రీస్తు ఈలోకానికి రాలేదు కాని, మనందరి 'రక్షణ' కోసం జన్మించాడు. సర్వమానవాళి పాపక్షమాపణ కోసం మరణించేందుకు పుట్టాడు. సిలువలో ఘోరమైన వేదనను అనుభవిస్తూ మరణించాడు. మనమందరం పాపం చేసినవారమే. మనలో ఏ మంచి లేదు, నీతి అసలే లేదు. చీకటిలో, మరణఛాయలో జీవిస్తున్న మనల్ని విడిపించే దుకు యేసుక్రీస్తు కన్యక అయిన మరియ పరిశుద్ధాత్మ ద్వారా గర్భం దాల్చడం బట్టి 'లోకరక్షణడు' జన్మించాడు. ఆయన పుట్టుకే పరిశుద్ధ మైనది. ఆ పవిత్ర దేవాదిదేవుడు మనందరి కోసం మరణించాడు. ఈ సత్యాన్ని గ్రహించి, ఆయనను హృదయంలో రక్షకుడిగా అంగీకరిస్తే చాలు, 'రక్షణ' ఉచితంగా లభిస్తుంది. ఇలాంటివారికి 365రోజులూ క్రిస్మస్ ఆనందం వెల్లివిరుస్తుంది.



**మనకోసమే రక్షకుడిగా వచ్చాడు**

యేసుక్రీస్తు జన్మించిన తర్వాత దూత గొఱ్ఱెల కాపరులకు కనిపించి, 'నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు' (లూకా 2:11). ప్రభువు మనకోసమే పుట్టాడు.



ఈ సత్యాన్ని మొదటగా మనం గ్రహించాలి. మనం ఆర్భాటంగా ఉత్సవాలను జరుపుకునేందుకు ప్రభువు రాలేదు. పండుగలు అనేవి ప్రతి సంవత్సరం వస్తుంటాయి, పోతుంటాయి. కానీ ఆ సంతోషం నిత్యం మనం అనుభవించాలి అంటే ప్రభువే నిజమైన దేవుడని గ్రహించాలి. మనసులోకి ఆహ్వానించాలి. ఇదే గొప్ప క్రిస్మస్ రక్షణ సువార్త. ప్రభువు చెంతకు చేర్చిన నక్షత్రం(స్టార్) 'ఇదిగో తూర్పుదేశమున వారు చూచిన నక్షత్రము ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచువరకు వారికి ముందుగా నడిచెను. వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోకి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి, సాగిలపడి, ఆయనను పూజించారు' (మత్తయి 2:9,10). జ్ఞానులను నక్షత్రం (స్టార్) వద్దకు నడిపించింది. యేసుక్రీస్తు చెంతకు చేరుకున్న జ్ఞానులు ఆయనను ఆరాధించారు, పూజించారు. క్రిస్మస్ అంటేనే ప్రభువును ఆరాధించడం. మనసులో ప్రభువును రక్షకుడిగా అంగీకరించకపోతే ఆయనను పూజించలేం. కాబట్టి ఈ క్రిస్మస్‌ను మనం అర్ధసహితంగా జరుపుకుందాం. శాంట్లాకాజ్ హంగామాను తగ్గించి, ప్రభువును ఘనపరుద్దాం. ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ ఆరాధిద్దాం.

## వ్యధ

# అతి వ్యామోహం ఉన్మాదానికి దారితీస్తుంది!

**ప్రశ్న:** హైదరాబాద్‌లో లెక్చరర్ అశోక్‌ను భార్య ప్రియుడితో కలిసి గొంతునులిమి చంపేసింది. యూపీలో 38 ఏళ్ల రాహుల్‌ను భార్య రూబీ హత్య చేసి ముక్కలు చేసింది. ప్రియుడితో ఉన్న సమయంలో చూసి భర్త మందలించాడన్న కారణంతో ఈ దారుణానికి పాల్పడింది. ఇటీవలి కాలంలో ఇలాంటి సంఘటనలు తరచూ వార్తల్లోకి వస్తున్నాయి. ఇవన్నీ చూసినప్పుడు భయం, ఆందోళన కలుగుతున్నాయి.మా వదిన ప్రవర్తన కూడా ఇంచుమించు అలాగే ఉంది. ఆమె మరొక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని మా అన్నతో తరచూ గొడవ పడుతోంది. పది రోజుల క్రితం మా అన్నను కత్తితో బెదిరించింది. ఇద్దరు పిల్లలు ఉన్నందున మా అన్న అన్నీ భరిస్తున్నారు. కుటుంబం కోసం రాత్రి పగలు కష్టపడుతున్న ఆయనకు 40 ఏళ్లకే బీపీ, మధుమేహం వచ్చాయి. మా వదిన కూడా ఒక సంస్థలో పని చేస్తోంది. అక్కడి ఒక వివాహితునితో సంబంధం కొనసాగిస్తోంది.ఈ పరిస్థితుల్లో ఆమెను మార్చుకోవడం సాధ్యమా? లేక విడాకులు తీసుకోవడమే మంచిదా? దయచేసి మార్గదర్శనం చేయగలరు. **- ఒక సోదరి, నెల్లూరు**



**జవాబు:** అమ్మా, అతి వ్యామోహం ఉన్మాదానికి దారితీస్తుంది. ప్రేమలో త్యాగం, సహనం, పరస్పర గౌరవం, సర్దుబాటు వంటి సద్గుణాలు ఉంటాయి. కానీ వ్యామోహంలో స్వార్థం, సుఖాన్వేషణ, ఈర్ష్య, ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారం ప్రధానంగా పనిచేస్తాయి. తమలో రగిలే కోర్కెలను తీర్చుకోవాలనే ఆతృత పెరిగిపోతుంది. అడ్డు ఎదురైనప్పుడు వివేకం క్రమంగా నశించి, తీవ్రమైన భావోద్వేగ అస్థిరత చోటు చేసుకుంటుంది. అప్పుడు కొందరిలో కిరాతక ప్రవర్తన బయటపడే ప్రమాదం ఉంటుంది. ఈ తరహా ప్రవర్తనకు పలు మానసిక, సామాజిక కారణాలు ఉండవచ్చు. శృంగార పరమైన రుగ్మతలు, బైపోలార్ డిసార్డర్, వ్యక్తిత్వ లోపాలు, హార్మోన్ల అసమతుల్యత, దీర్ఘకాలిక నిరాశ, నిస్పృహ, మత్తు పదార్థాలు లేదా మద్యానికి అలవాటు వంటి అంశాలు దీనికి మూలాలుగా మారుతుంటాయి. అయితే ఇలాంటి తీవ్ర స్థితులు సమాజంలో అతి తక్కువ శాతంలోనే కనిపిస్తాయని గుర్తుంచుకోవాలి.మీరు చెప్పిన సందర్భంలో, అన్న, వదినల మధ్య దాంపత్య సంతృప్తి తీవ్రంగా దెబ్బ తిన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కత్తితో బెదిరించడం వంటి ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోవద్దు. ఇది కేవలం కుటుంబ సమస్య కాదు. హింసకు సంబంధించిన తీవ్రమైన హెచ్చరిక. పిల్లల భద్రత, మీ అన్న శారీరక, మానసిక రక్షణ అత్యంత ముఖ్యం. ఇలాంటి సందర్భాల్లో మొదటి దశగా, మీరు కుటుంబ సభ్యులుగా చొరవ తీసుకుని అర్హత కలిగిన సైకాలజిస్టు లేదా సైకియాట్రిస్ట్‌ను సంప్రదించి కౌన్సెలింగ్ ప్రారంభించాలి. ఆమెకు మానసిక సమస్య ఉంటే, సరైన చికిత్సతో మార్పు వచ్చే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం. అయితే ఆమె కౌన్సెలింగ్‌కు నిరాకరించినా, లేదా ప్రయత్నాలన్నీ విఫలమైతే, దీర్ఘకాలికంగా అదే పరిస్థితిని భరించమని చెప్పడం సమంజసం కాదు. కాగా హింసను సహించడం త్యాగం కాదు. అది మరింత ప్రమాదానికి దారి తీస్తుంది.అందువల్ల అవసరమైతే చట్టపరమైన సలహా తీసుకుని, పిల్లలు మరియు మీ అన్న భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ నిర్ణయాలు తీసుకోవడం కూడా తప్పుకాదు.సమస్యను దాచిపెట్టడం కాదు, ధైర్యంగా ఎదుర్కొని సరైన దారిలో పరిష్కరించుకోవడమే నిజమైన పరిణతి.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## రంగవల్లి





- ఎ.హన్సిక
బెంగళూర్

13 చుక్కలు, మధ్య చుక్క 7 వచ్చేవరకు

### ముగ్గులకు ఆహ్వానం

**మా చిరునామా:** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

# 'శంబాల' గ్రాండ్‌గా రిలీజ్



ఆది సాయికుమార్ హీరోగా తెరకెక్కిన 'శంబాల' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 25న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. డిసెంబర్ 23న ఆది సాయి కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో ముచ్చటిస్తూ 'శంబాల' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు.

**'శంబాల'పై మంచి బజ్ ఏర్పడింది? ఈ చిత్రంపై పెరిగిన అంచనాల గురించి మీరేం చెబుతారు?..**

'శంబాల' చిత్రం బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి మా సినిమా బాగా నచ్చు తుంది. అ ందరూ మా మూవీని ఎంజాయ్ చేస్తారని అనుకుంటు న్నాను.

**డిసెంబర్ 25న చాలా కాంపిటీషన్ ఉంది కదా? శ్రీకాంత్ గారితో మీకు మంచి ఫ్యామిలీ బాండింగ్ కూడా ఉంది. ఈ కాంపిటీషన్‌ను ఎలా చూస్తారు?..**

క్రిస్మస్, డిసెంబర్ 25 అనేది మంచి సీజన్. శ్రీకాంత్ గారి ఫ్యామిలీతో మాకు మంచి బాండింగ్ ఉంది. రోషన్‌తో నాకు మంచి పరిచయం ఉంది. మా క్రికెట్ టీంలో రోషన్ చురుకుగా ఉంటాడు. రోషన్ నటించిన 'ఛాంపియన్' సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను.

**'శంబాల' మూవీలోని వీఎఫ్ఎక్స్ గురించి చెప్పండి?..**

'శంబాల' చిత్రంలో ఎక్కువ వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉండవు. కానీ ఉన్న వాటిని మాత్రం చాలా జాగ్రత్తగా చేసుకున్నాం. ఆ అవుట్ పుట్ చూసి మేం అంతా సంతృప్తి చెందాం. శ్రీ చరణ్ పాకాల ఆర్ఆర్ చూసి అందరం షాక్ అయ్యాం. ఆయన ఎక్కడా కూడా ఓ పట్టాన సంతృప్తి చెందరు.

**'శంబాల'మ్యూజిక్ గురించి చెప్పండి?..**

'శంబాల'లో సాంగ్స్ ఎక్కువగా ఉండవు. ప్రమోషనల్ సాంగ్ అని అనుకున్నాం. కానీ మాకు అంత టైం సరిపోలేదు. ..మన పురాణాల్లోని 'శంబాల' ఫీల్‌ను ఎంజాయ్ చిత్రం ఆది సాయి కుమార్ హీరోగా తెరకెక్కిన 'శంబాల' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

**'శంబాల'పై మంచి బజ్ ఏర్పడింది? ఈ చిత్రంపై పెరిగిన అంచనాల గురించి మీరేం చెబుతారు?..**

'శంబాల' చిత్రం బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి మా సినిమా బాగా నచ్చుతుంది. 'శంబాల' ఫీల్‌ను ఎంజాయ్ చిత్రం ఆది సాయి కుమార్ హీరోగా తెరకెక్కిన 'శంబాల' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 25న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. డిసెంబర్ 23న ఆది సాయి కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో ముచ్చటిస్తూ 'శంబాల' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు.

## తెర

# 'మన శంకర వర ప్రసాద్ గారు' అదిరిపోయే స్టిల్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి మాస్ అండ్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు' బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సంచలనం సృష్టి స్తోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా మేకర్స్ సినిమా నుంచి రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి కొత్త స్టిల్ అదిరిపోయింది. బ్లాక్ సూట్, వైట్ షర్ట్, కళ్లకు డార్క్ గ్లాసెస్ తో ఒక చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న మెగాస్టార్ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇప్పటికే మీసాల పిల్ల, శశిరేఖ పాటలు చార్ట్‌బస్టర్ హిట్స్‌గా సంచలనం సృష్టించాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న చిరంజీవి, వెంకటేష్ పై చిత్రీకరించిన పాటని రిలీజ్ చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్ మెంట్ త్వరలోనే రాబోతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని, తమ్మిరాజు ఎడిటింగ్‌ను, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. కథను ఎస్. కృష్ణ, జి.ఆదినారాయణ సంయుక్తంగా రాశారు.

# 'మైసా' గూస్ బంప్స్ టీజర్ రిలీజ్



నేషనల్ క్రష్ రష్మిక లీడ్‌రోల్‌లో తెరకెక్కుతున్న ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మైసా పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు రవీంద్ర పుల్లే దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఆకట్టుకున్న టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ల తర్వాత, తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.వణుకు పుట్టించే ఈ టీజర్, మైసా పాత్ర డార్క్ అండ్ ఇంటెన్స్ ప్రపంచాన్ని ప్రజెంట్ చేసింది. కథానాయిక తల్లి గొంతుతో వచ్చే నా బిడ్డ ఊపిరి మోయలేక అగ్గే బూడిదైంది. నా బిడ్డను సంపలేక.. ఆఖరికి సావే సచ్చిపోయింద్థి అనే పవర్ ఫుల్ వాయిస్‌తో టీజర్ మొదలై యింది. ఈ పాత్ర కోసం రష్మిక మందన్న చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ చూస్తే షాకింగ్‌గా అనిపిస్తుంది. ఇది ఆమె కెరీర్‌లోనే అత్యంత రా అండ్ వైలెంట్ క్యారెక్టర్. రక్తం మరకలతో నిండిన రఫ్ లుక్‌లో మైసా పాత్రలో రష్మిక ఫైర్ లా కనిపించింది. టీజర్ చివర్లో ఆమె చేసే గర్జన, మైసా పాత్రలో దాగున్న ఆగ్రహాన్ని, ఆవేశాన్ని అద్భుతంగా చూపించింది. రవీంద్ర పుల్లే ఈ కథను ఎంతో డెప్త్ తో, అద్భుతంగా హ్యాండిల్ చేశాడు. కథనం ఎక్కడా రాజీ పడకుండా, పూర్తిగా ఇంటెన్స్‌గా సాగుతుందని టీజర్ స్పష్టంగా చెబుతోంది.

# 'ఈషా' థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్



ఈషా చిత్రం ప్రీరిలీజ్ వేడుకలో భాగంగా ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని డిసెంబరు 25న చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. అఖిల్‌రాజ్ త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వర్రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 25న చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర హాంటెండ్ నైట్, ప్రీరిలీజ్‌వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ కథానాయకుడు శ్రీవిష్ణు బిగ్‌టికెట్‌ను లాంచ్‌చేస బిగ్ టికెట్‌ను లాంచ్ చేసి, ప్రేక్షకుని అంగీకార పత్రంపై శ్రీవిష్ణు సైన్ చేశారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ హారర్ సినిమాలు నాకు పర్సనల్‌గా ఇష్టం. హారర్ సినిమాలు థియేటర్‌లో ఫ్రెండ్స్‌తో చూసిన ప్పుడు థ్రిల్లింగా ఫీలవుతాను. హారర్ సినిమా ఎక్స్‌పీరియన్స్ చాలా రోజులు గుర్తుండిపోతుంది. ఈ ఈషా సినిమా థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కూడా చాలా రోజులు అందరిని వెంటాడుతుంది. సో.. అందరూ ఈ సినిమా చూసి అందరూ ఆ ఎక్స్‌పీరియన్స్ పొందగలరు. దర్శకుడు శ్రీనివాస్‌మన్నెగారి కథల్లో నావెల్టీ ఉంటుంది. ఆయన కలిసినప్పుడు చాలా కథలు చెబుతుండేవాడు. ఈ కథ కూడా తప్పనిసరిగా నావెల్టీతో పాటు సినిమాలో మంచి ట్విస్టులు ఉండబోతున్నాయి.

# 'జెన్‌జెడ్ విజిలెంట్ యాక్షనర్ సిగ్మా' టీజర్ రిలీజ్



సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ మరో ప్రతిష్టాత్మక వెంచర్ సిగ్మాతో రాబోతోంది. ఈ సినిమాతో కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సందీప్ కిషన్ హీరో నటిస్తున్న ఈ చిత్రం యాక్షన్ అడ్వెంచర్ కామెడీగా రూపొందు తోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ కు అద్భుతమై రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అదిరిపోయే టీజర్ రిలీజ్ చేశారు. మంచోడు.. మహానుభావుడు.. చెడ్డోడు రాక్షసుడు.. చూసే నీ చూపుని బట్టి, ఇప్పుడు ఈ క్షణం నన్ను నేను కాపాడుకోవడానికి ఎలాగైనా మారుతాను అనే హీరో పవర్ ఫుల్ డైలాగ్ తో టీజర్ ప్రారంభమవుతుంది. ఈ లైన్ వెంటనే కనెక్ట్ అవుతూ విజిలెంట్ కథని సూచిస్తుంది.

# 'సుమతీ శతకం' చిత్రం టీజర్ లాంచ్

అంగరంగ వైభవంగా "సుమతీ శతకం" చిత్ర టీజర్ లాంఛ్ - 2026 ఫిబ్రవరి 6న విడుదల

విషన్ మూవీ మేకర్స్ బ్యానర్ పై సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాతగా ఎంఎం నాయుడు రచన దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సుమతీ శతకం. అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో టేస్టీ తేజ, మహేష్ విట్ట, రిదీజు ప్రసాద్, ఆకెళ్ళ గోపి కృష్ణ, కిరణ్ విజయ్, మిర్చి కిరణ్, నెల్లూరు నీరజ, మలక్పేట్ శైలజ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సుభాష్ ఆనంద్ సంగీతాన్ని అందించగా నహిద్ మహమ్మద్ ఎడిటింగ్ చేశారు. ఎస్ హలేష్ సినిమాటోగ్రాఫర్ గా చేశారు. ఫిబ్రవరి 6వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర టీజర్ ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ విప్ జివి ఆంజనేయులు గారి చేతుల మీదగా లాంచ్ చేయడం జరిగింది.



ఈ సందర్భంగా కార్యక్రమ ముఖ్య అతిథి ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ విప్ జివి ఆంజనేయులు గారు మాట్లాడుతూ... "చిత్ర బృందం అందరికీ మంచి సినిమా తీసినందుకు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను. ఈ కార్యక్రమానికి వచ్చినందుకు అందరికీ అభినందనలు సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

అతిధి నిర్మాత, నటుడు అశోక్ కొల్ల మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. శ్రీధర్ గారు నాకు ఎంతోకాలం నుండి తెలుసు. ఈ చిత్ర టీజర్ చాలా బావుంది.

# వరల్డ్ కప్ కోసం ఆల్‌ఫార్మాట్ ప్లేయర్లకే ఛాన్స్










## టీమిండియా భవిష్యత్‌కు మెగా ప్లాన్

**న్యూఢిల్లీ:** వన్డే ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. ఒకవేళ వారు రిటైర్మెంట్ ప్రకటించకపోతే, జట్టులో కచ్చితంగా మార్పులు ఉంటాయి. కానీ మేనేజ్‌మెంట్ మాత్రం యశస్వి జైస్వాల్, తిలక్‌వర్మ వంటి యువకులను 50 ఓవర్ల ఫార్మాట్ కోసం సిద్ధం చేస్తోంది. భారత క్రికెట్‌లో సీనియర్ల శకం ముగియనుండటంతో, వన్డే ఫార్మాట్ కోసం ప్రత్యేకంగా యువ జట్టును సిద్ధం చేయాలని సెలక్టర్లు భావిస్తున్నారు.

కేవలం రాబోయే టి20 ప్రపంచ కప్ 2026 పైనే కాకుండా, దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్ 2027 పై కూడా దృష్టి సారించాయి. భారత్ జట్టులో ఉండే ఆటగాళ్లలో కేవలం ఐదుగురు మాత్రమే వన్డే వీటికి ఎంపికయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రపంచ కప్ జట్టులోని అందరు ఆటగాళ్లు వన్డే ఫార్మాట్‌కు సరిపోరని, అందుకేకేవలం ఆల్‌ఫార్మాట్ ప్లేయర్లను మాత్రమే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు జరుగుతున్న కసరత్తులో ఐదుగురు ప్లేయర్లకు వాటిల్లో చోటు దక్కే అవకాశాలను సెలక్ట్ కమిటీ చర్చిస్తోంది. వీరిలో టీమ్ ఇండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా నమ్మదగ్గ బౌలర్‌గా ఉండగా, ఆల్‌రౌండర్‌గా జట్టుకు సమతుల్యతను అందించే కీలక ఆటగాడు. హార్దిక్ పాండ్యా పేరు పరిశీలనలో ఉంది. అలాగే నిలకడైన ప్రదర్శనతో టీ20 వైస్ కెప్టెన్‌గా ఎదిగిన అక్షర్ పటేల్ వన్డేల్లోనూ కీలకంగా ఉన్నాడు. మరో పక్క టీ20 జట్టులో చోటు కోల్పోయినప్పటికీ, వన్డేల్లో భారత్‌కు కాబోయే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పరిగణిస్తున్నారు.

ఇక స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్ చైనామన్ బౌలింగ్ వన్డే ఫార్మాట్‌కు అత్యంత అవసరం. కాగా టి20ల్లో ప్రపంచ నంబర్ 1 బ్యాటర్‌గా, జట్టు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ వన్డే ప్రపంచ కప్ రేసులో వెనుకబడినట్లు కనిపిస్తోంది. అతని వయస్సు (35 ఏళ్లు), గత వన్డే రికార్డులను పరిగణనలోకి తీసుకుంటే, 2027 నాటికి అతను వన్డే జట్టులో ఉండటం కష్టమేనని భావిస్తున్నారు. ఈ మెగా ప్లాన్ టీమిండియాను భవిష్యత్తులో మరింత బలోపేతం చేస్తుందని బోర్డు భావిస్తోంది. 2026 టీ20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే వన్డే జట్టుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.




## విజయ్ హజారే ట్రోఫీ..
# రోహిత్, కోహ్లీ సెంచరీలు

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ పునరాగమనంలో రోహిత్, కోహ్లీ సెంచరీలు బాదారు. ఇద్దరు ఆటగాళ్లు తమ ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయించారు. ఈ టోర్నీ తొలి రోజు బుధవారం మొదటి అర్ధభాగం అంతా రికార్డు సెంచరీలతో సాగగా, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రెండవ అర్ధభాగంలో తమ తమ సెంచరీలతో అందరి దృష్టిని ఆకర్షించారు. బుధవారం ముంబై తరఫున ఏడు సంవత్సరాల తర్వాత తన తొలి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో సెంచరీ సాధించి, రోహిత్ దేశీయ క్రికెట్‌లోకి సంచలనాత్మక పునరాగమనం చేశాడు. సిక్కింపై ముంబై తరఫున రోహిత్ కేవలం 62 బంతుల్లోనే అద్భుతమైన 155 పరుగుతో సెంచరీ సాధించాడు. జైపూర్‌లో సిక్కిం జట్టు 236 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించాడు, వరుసగా సిక్సర్లు, ఫోర్లు బాదడంతో లక్ష్యాన్ని సులభంగా చేరుకునే అవకాశం లభించింది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో 14,000 పరుగులకు చేరుకున్న రోహిత్ సెంచరీ లిస్ట్ ఎ క్రికెట్‌లో 37వ సెంచరీగా నిలిచింది, ఇది భారత్ తరఫున అతని 33 అంతర్జాతీయ సెంచరీల సంఖ్యకు జోడించింది. ఇక కోహ్లీ కూడా ఆంధ్రప్రదేశ్‌పై 83 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. బెంగళూరులో ఆంధ్రతో జరిగిన 299 పరుగుల ఛేదనలో కోహ్లీ 15 సంవత్సరాల తర్వాత విజయ్ హజారే ట్రోఫీకి తిరిగి వచ్చాడు. కోహ్లీ తన సాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుతమైన సెంచరీని సాధించాడు. ఇది అతని 58వ లిస్ట్ ఎ సెంచరీ. ఈ నెల ప్రారంభంలో దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత నాలుగు ఇన్నింగ్స్‌లలో అతని మూడవ సెంచరీ. ఇన్నింగ్స్‌లో తన తొలి పరుగుతోనే కోహ్లీ లిస్ట్ ఎ లో 16,000 పరుగులు సాధించిన తొమ్మిదవ ఆటగాడిగా ఎలైట్ క్లబ్‌లో చేరాడు.

# గ్లోబల్ చెస్ లీగ్ ఛాంపియన్‌గా ఆల్పైన్ పైపర్స్

**న్యూఢిల్లీ:** గ్లోబల్ చెస్ లీగ్-2025 ఛాంపియన్‌గా ఆల్పైన్ ఎస్‌జి పైపర్స్ నిలిచింది. రెండు సార్లు డిఫెండింగ్ ఛాంపియన్స్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్‌ను ఓడించిన ఆల్పైన్ టైటిల్ గెలుచుకుంది. గుకేశ్ దొమ్మరాజుకు చెందిన పిబిజి అలస్కాన్ నైట్స్ మూడో స్థానంలో నిలిచింది. పైపర్స్‌మొదటి రాపిడ్ మ్యాచ్‌ను నల్లటి పావులతో 4-2 తేడాతో గెలవగా. తరువాత తెల్లటి పావులతో 4.5-1.5 తేడాతో విజయం సాధించింది. టైబ్రేక్‌లో గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్‌లను ఓడించి పిబిజి అలాస్కాన్ నైట్స్ మూడవ స్థానంలో నిలిచింది. త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ ఫేవరెట్‌గా ఫైనల్‌లోకి ప్రవేశించింది. కానీ లీగ్ దశ రెండవ భాగంలో ఫామ్‌తో ఉన్న పైపర్స్‌లో నినో బాట్సియాష్విలి, లియోన్ ల్యూక్ మెండోంకాలు గెలవడం ద్వారా జట్టు ఆధిపత్యంలోకి వచ్చింది.

బిషప్‌నైట్ ఎండ్‌గేమ్‌లో నినో అలెగ్జాండ్రా కోస్టెనిక్‌పై విజయం సాధించగా, మెండోంకా 52 ఎత్తుగడల తర్వాత మార్క్ ఆండ్రియా మోరిజ్జీని వెనుకబడేలా చేశాడు. కాంటినెంటల్ కింగ్స్ స్టార్ ప్లేయర్ అలిరేజా ఫిరోజ్జా ఐకాన్ బోర్డులో ఫాబియానో కరువానాను ఓడించి తన జట్టును తిరిగి పోటీలోకి తీసుకువచ్చాడు. కానీ అనిష్ గిరి వీయిపై విజయం సాధించడంతో పైపర్స్ మొదటి మ్యాచ్‌ను 4-2 తేడాతో కైవసం చేసుకున్నాడు. మ్యాచ్‌లో సజీవంగా ఉండటానికి కాంటినెంటల్ కింగ్స్ 4 పాయింట్లు సాధించాల్సి ఉండగా, ఆర్ ప్రజ్ఞానంద పైపర్స్‌కు విదిత్ గుజరాతీపై విజయంతో తొలి ఆధిక్యాన్ని అందించాడు. మరియు అనీష్ గిరి ఆ తర్వాత వీయిపై రెండవ విజయాన్ని నమోదు చేశాడు. గుకేష్‌పై ఆనంద్ 49 ఎత్తుగడలలో గెలిచి ఆల్పైన్ ఎజీ పైపర్స్‌కు ట్రోఫీని రావడంలో కీలకంగా వ్యవహరించాడు.




## సబ్ జూనియర్ పురుషుల హాకీ..
# పంజాబ్, ఎస్ఎజి, సెయిల్ విజయాలు

**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా సబ్‌జూనియర్ మెన్ అకాడమీ ఛాంపియన్‌షిప్ 2025-జోన్ ఎ, బిలో రెండవ రోజు నామ్‌ధారి, రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీ క్లబ్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ హాకీ అకాడమీ, మరియు సెయిల్ హాకీ అకాడమీ కీలక విజయాలు నమోదుచేశాయి. గుజరాత్‌లో బుధవారం పూల్ డి మ్యాచ్‌తో ప్రారంభమైంది, నామ్‌ధారి జట్టు ఎస్‌జిపిసి హాకీ అకాడమీపై 2-1 తేడాతో విజయం సాధించింది. విజేతల తరఫున కెప్టెన్ గంగా సింగ్ (21వ నిముషం), కరణ్‌బీర్ సింగ్ (22) గోల్స్ చేయగా, ఎస్‌జిపిసి తరఫున సుఖ్‌ప్రీత్ సింగ్ (60) గోల్స్ చేశారు. అలాగే పూల్ సిలో రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీక్లబ్ అకాడమీ 18-1 తేడాతో సాల్యూట్ హాకీ అకాడమీపై విజయం సాధించింది. వరీందర్ సింగ్ (10, 15, 20, 42, 51), అర్జన్‌దీప్ సింగ్ (24, 27, 31, 49, 58) ఐదు గోల్స్ సాధించగా, మన్వీర్ సింగ్ (7, 22, 34, 60+) నాలుగు గోల్స్ సాధించారు. అర్ష్‌దీప్ సింగ్ (24, 36), శామ్యూల్ (3), షన్ముఖ్ సింగ్ (25) కూడా రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీ క్లబ్ అకాడమీకి తమ వంతు సహకారం అందించారు. సాల్యూట్ హాకీ అకాడమీ తరఫున అరుణ్ (18) ఏకైక గోల్ సాధించాడు. ఇదే పూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ హాకీ అకాడమీ చీమా హాకీ అకాడమీపై 2-1 తేడాతో విజయం సాధించింది. చీమా హాకీ అకాడమీ తరఫున గురుప్రీత్ సింగ్ (54) గోల్స్ సాధించారు. ఇక ఈ రోజు జరిగిన చివరి మ్యాచ్‌లో సెయిల్ హాకీ అకాడమీ జట్టు పూల్ బి పోరులో రిపబ్లికన్ స్పోర్ట్స్ క్లబ్‌పై 5-0 తేడాతో విజయం సాధించింది. విజేతల తరఫున షాహిద్ మహ్మద్ (15+), కునాల్ కవ్రే (34), మిలన్ అథోక్‌పామ్ (43), సుమన్ కిండో (48), మరియు బికాష్ స్వైన్ (54) గోల్స్ చేశారు.

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో..
# శుభ్‌మాన్‌కు ఎదురుదెబ్బ




**న్యూఢిల్లీ:** ఐసిసి వరల్డ్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మాన్ గిల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. భారత టెస్ట్, వన్డే కెప్టెన్ ఇప్పుడు ఐసిసి టాప్10 టెస్ట్‌బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌నుండి తప్పుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేయలేకపోయిన పరిణామాలను గిల్ ఎదుర్కొన్నాడు. గతవారం వరకు, టెస్ట్‌ర్యాంకింగ్స్‌లో గిల్ 10వ స్థానంలో ఉన్నాడు. కానీ బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో, అతను ఒక స్థానం దిగజారి టాప్10 నుండి తప్పుకున్నాడు. టాప్10లో మిగిలి ఉన్న ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ ఇప్పుడు 8వ స్థానంలో ఉన్నాడు. అడిలైడ్‌లో జరిగిన మూడవ యాషెస్ టెస్ట్‌లో పేలవమైన ప్రదర్శన ఇచ్చినప్పటికీ ఇంగ్లాండ్ దిగ్గజ బ్యాట్స్‌మన్ జోరూట్ నెంబర్ 1 స్థానంలో కొనసాగుతున్నాడు. అడిలైడ్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టులో స్టీవ్ స్మిత్ స్థానంలో వచ్చిన ఉస్మాన్ ఖవాజా మూడు స్థానాలు ఎగబాకి ఇప్పుడు 20వ స్థానంలో ఉన్నాడు. టాప్ 10లో ఉన్న ఇతర బ్యాట్స్‌మెన్‌లలో హెడ్, కారీ మరియు జైస్వాల్ కాకుండా, జో రూట్ నంబర్ వన్ స్థానంలో, న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ రెండవ, ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ మూడవ, ఇంగ్లాండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్ ఐదవ, శ్రీలంకకు చెందిన కమిండు మెండిస్ ఆరవ, దక్షిణాఫ్రికాకు చెందిన టెంబా బావుమా ఏడవ, పాకిస్తాన్‌కు చెందిన సౌద్ షకీల్ పదవ స్థానంలో ఉన్నాడు.

## బ్యాంకుల్లో రెండోదశ చెక్కు క్లియరెన్స్ వ్యవస్థ
# నిరవధిక వాయిదా

**ముంబయి, డిసెంబరు 24:** బ్యాంకుల్లో చెక్కులు శరవేగంగా క్లియరెన్స్‌చేసే వ్యవస్థను ఆర్బీఐ వాయిదా వేస్తోంది. వాస్తవానికి వచ్చే యేడాది జనవరి 3వ తేదీనుంచి ప్రారంభించాల్సి ఉంది. బ్యాంకులు చెక్కులు ఆమోదించడం తిరస్కరించడం వంటివి వచ్చిన మూడు గంటల్లోపే పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ కొత్త వ్యవస్థవల్ల దేశవ్యాప్తంగా చెక్కుల క్లియరెన్స్‌కు ఏకీకృత వ్యవస్థ ఉంటుందని భావించింది. ఈ ఏడాది అక్టోబరునాల్గవ తేదీనుంచేదశలవారీగా ప్రారంభించిన వ్యవస్థలో జమలు, చెల్లింపులు వంటివి ఒక ఖాతానుంచి వేరొక ఖాతాకు కొన్ని గంటల్లోనే జరిగేవిధంగా ఆదేశాలిచ్చింది.




ఈ కొత్త వ్యవస్థలో చెక్కుల క్లియరెన్స్ అనేది బ్యాంకులకు నిరంతరప్రక్రియ అని నిర్దిష్టమైన వేళలకులోబడి చెక్కులు క్లియరెన్స్‌చేయాల్సి ఉంటుంది. దీనివల్ల నిధులు ఖాతాలకు కొన్ని గంటల్లోనే చేరతాయని ఆర్బీఐ భావించింది. ప్రస్తుతం ఒకటి రెండురోజులు వ్యవధి పడుతోంది. కొత్తవ్యవస్థ వల్ల దేశవ్యాప్తంగా చెక్కులు క్లియరెన్సులు మరింత వేగవంతం అందుకుంటాయని భావిస్తున్న తరుణంలో బుధవారం ఆర్బీఐ రెండోదశ నిరంతర క్లియరింగ్ పరిష్కారం వంటి సిసిఎస్ ఫ్రేమ్‌వర్కును తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. మొదటిదశ వ్యవస్థను మాత్రం యదావిధిగా కొనసాగిస్తారని తెలిపింది. మొదటి దశను అక్టోబరు నాలుగునుంచి జనవరి 2వ తేదీవరకూ అమలుచేసింది. చెక్కులు రాత్రి ఏడుగంటల్లోపు ధృవీకరించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో చెక్కులు ఆటోమేటిక్‌గా ఆమోదం పొందుతాయి. రెండోదశ జనవరి 3నుంచి అమలుచేయాలి. దీనిలో అన్ని బ్యాంకులు మూడుగటల్లోపే ప్రతి చెక్కును ఆమోదించాలి. పదినుంచి 11 గంట ల్లోపు వస్తే మధ్యాహ్నం కల్లా ఆమోదించాలి. ఆర్బీఐ క్లియరింగ్ గ్రిడ్స్ మూడు నగరాల్లో ఉన్నాయి.

ఢిల్లీ, ముంబయి, చెన్నైల్లో ఉంటాయి. చెక్కుల ప్రాసెసింగ్ విధానంకూడా మారింది. ప్రస్తుతం ఉదయం తొమ్మిదినుంచి మధ్యాహ్నం మూడువరకూ ఈ చెక్కుల గవాక్షం పని చేస్తుంది. బ్యాంకులు అన్ని చెక్కులను తొమ్మిదినుంచి ఏడు గంటల్లోపు తిరస్కరించే వీలుంటుంది. చెక్‌టర్న్‌కేషన్ వ్యవస్థద్వారా ఆర్బీఐ సిసిఎస్ వ్యవస్థను అమలుచేస్తోంది. కొత్తవ్యవస్థలో బ్యాంకులు చెక్కులను స్కాన్‌చేసి ఎంఐసిఆర్ డేటాను క్లియరింగ్‌హౌస్‌కు పంపిస్తాయి. అయితే రెండోదశను మాత్రం ఆర్బీఐ నిరవధిక వాయిదా వేయడం అంటే బ్యాంకులు ఈ కొత్త వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసుకోలేక పోవడమేనని స్పష్టం అవుతోంది.




## బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.10వేల కోట్ల
# నిధుల సమీకరణ
## ఇన్‌ఫ్రా బాండ్ల ద్వారా గణనీయంగా నిధులు రాబట్టిన బ్యాంకు

**ముంబయి, డిసెంబరు 24:** ప్రభుత్వరంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.10వేల కోట్లు సమీకరించింది. ఇన్‌ఫ్రా బాండ్ల విక్రయం ప్రారంభించడంతో ఇన్వెస్టర్లనుంచి మంచి మద్దతు లభించింది. నిజానికి ఐదువేల కోట్లకు బిడ్లు వస్తాయని ఆసిస్తే 15,305 కోట్లకు బిడ్లు వచ్చాయి. బ్యాంకు గత ఏడాది కూడా రూ.10వేల కోట్లు సమీకరించింది. బ్యాంకు వార్షిక కూపన్‌రేటును 7.23శాతంగా ప్రకటించింది. బ్యాంకు మొత్తం 15,305 కోట్లకుగాను 83 బిడ్లు సాధించింది. అయితే 37 బిడ్లను మాత్రమే ఆమోదించి 10 వేల కోట్లుకు మాత్రమే సరిమితం అయింది. ఎలక్ట్రానిక్ బిడ్డింగ్‌ప్రొవైడర్ ప్లాట్‌ఫామ్ ఎన్ఎస్ఇ ద్వారా ఈ బాండ్లు విడుదలచేసింది. వీటన్నింటినీ దీర్ఘకాలిక బాండ్లుగానే సేకరించింది. ప్రాజెక్టులకు నిధులు కల్పన, ఇన్‌ఫ్రా అనుబంధ రంగాలకు, అందుబాటులో పక్కా గృహ నిర్మాణాలకు ఈనిధులు వెచ్చిస్తుంది. మొత్తం 13 ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకులు సుమారు 2.2 లక్షలకోట్లు ఇన్‌ఫ్రా బాండ్ల బకాయిలుంటే మొత్తం ఈ బ్యాంకుల్లో ఇన్‌ఫ్రా లోన్‌బుక్ రూ14 లక్షలకోట్లుగా తేలింది. ప్రభుత్వరంగ బ్యాంకులు వీటిని ఇష్యూచేస్తాయి. 75శాతం ఇన్‌ఫ్రా రుణాలు, 82నుంచి 85శాతం బాండ్ల జారీని కూడా బ్యాంకులే నిర్వహిస్తాయి. ఇప్పటివరకూ ఎస్‌బిఐ రూ.30వేల కోట్లు ఇన్‌ఫ్రా బాండ్లద్వారా సేకరిస్తే ఇండియన్ బ్యాంకు రూ.10వేల కోట్లు రెండువిడతలుగా సేకరించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.5 వేల కోట్లు సమీకరించింది.



# తులం బంగారం రూ.1,41,150
## కిలో వెండి రూ.2,25,393

**ముంబయి, డిసెంబరు 24:** బులియన్ మార్కెట్‌లో వెండి బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం 24 క్యారెట్ల మేలిమి పదిగ్రాముల బంగారం రూ.1,41,150కి చేరింది. వెండికూడా కిలోధర ఏకంగా రూ.2,25,393 వరకూ పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోకూడా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఔన్స్ బంగారంధరల 4495 డాలర్లు, వెండిధర 72.22 డాలర్లకు చేరింది. ఒకదశలో బంగారం బుధవారం ట్రేడింగ్‌లో 4500 డాలర్లు కూడా దాటింది. స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ బంగారంధర 4507.27 డాలర్లుగా నడిచింది. ఈ ఏడాది పసిడిధరల్లో సుమారు 70శాతం పెరుగుదల కనిపించింది. అమెరికా ఫెడ్‌రిజర్వు మరోసారి వడ్డీరేట్లలో కోతపెడుతుందన్న అంచనాలతో బంగారం, వెండి సురక్షిత ఇన్వెస్ట్‌మార్గాలుగా పెట్టుబడిపెడుతున్నారు. దీనికితోడు భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కూడా గ్లోబల్‌స్థాయిలో పెరగడంతో పసిడి,వెండి మార్కెట్లే తమకు సురక్షితంగా ఇన్వెస్టర్లు భావిస్తుండటంతో వీటిధరలు ర్యాలీతీస్తున్నాయి.

# స్వల్పనష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
## స్టాక్ మార్కెట్లకు హాలిడేమూడ్



**ముంబయి, డిసెంబరు 24:** స్టాక్ మార్కెట్లకు క్రిస్మస్ హాలిడే ప్రభావంచూపించింది. బుధవారం నిఫ్టీ, సెన్సెక్స్‌లు రెండూ కూడా దిగువ స్థాయిలోనే ముగిసాయి. ఇన్వెస్టర్లు క్రిస్మస్ హాలీడే వస్తున్నందున అప్రమత్తంగా వ్యవహరించారు. ఆయిల్ అండ్ గ్యాస్, ఫార్మా, ఐటి రంగాల్లో అమ్మకాల ఒత్తిళ్లు పెరిగాయి. దీనితో స్టాక్స్ సన్నగిల్లాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 116.14 పాయింట్ల దిగువన 85,408.70 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ కూడా 35.05 పాయింట్లు క్షీణించి 26,142.10 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. విదేశీ ఇన్వెస్టర్లుకూడా ఎక్కువగా క్రిస్మస్ వేడుకల్లో మునిగిపోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లపై ఈ ప్రభావం కనిపించింది.

విదేశీ సంస్థగత ఇన్వెస్టర్లు తమతమ పెట్టుబడులను వేగంగా విత్‌డ్రాచేసుకోవడం కూడా మరొక కారణం అయింది. నష్టాలు కేవలం కీలక రంగాల్లోనే వచ్చాయి. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ 0.76శాతం, ఐటి అండ్ ఫార్మా రంగాలు 0.51శాతం చొప్పున క్షీణించాయి. నిఫ్టీ 50 సూచీలో ఇండిగో, ఆదాని ఎంటర్‌ప్రైజెస్, డా.రెడ్డిస్ ల్యాబొరేటీస్ కూడా క్షీణించింది. హాలిటీ మూడ్‌తోపాటు సంవత్సరం ముగుస్తుండటంతో కూడా ట్రేడర్లు ఆచితూచి కొనుగోళ్లుజరిపారు. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.60 శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.28 శాతం పెరిగింది. ఇక నిఫ్టీలో మీడియా 0.44శాతం రియాల్టీ మెటల్ సూచీలు కూడా కొంతమేర ప్రకాశించాయి. స్వల్పలాభాలు తెచ్చుకోగలిగాయి.

# గడువు సమీపిస్తోంది!
## ఆధార్ పాన్ లింక్‌పై ఐటిశాఖ హెచ్చరికలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** పాన్‌కార్డు హోల్డర్లు తమతమ ఖాతాలకు లింక్‌చేయడంతోపాటు పాన్ ఆధార్ లింక్‌చేసుకోవడానికి గడువు సమీపిస్తోంది. ఈనెల 31వ తేదీలోపు పాన్‌కార్డును లింక్‌చేయకపోతే నిష్క్రియలోకి వెళ్లిపోతుంది. జనవరినుంచి కార్డులు చెల్లనివిగా మారిపోతాయి. దీనివల్ల ఐటిఆర్ ఫైలింగ్; రీఫండ్స్, బ్యాంకింగ్, ఇన్వెస్ట్‌మెంట్స్ వంటి వాటికి సమస్యలు ఎదురవుతాయి. అంతకుముందు 2024 మేనెలాఖరువరకూ గడువు విదించింది. ఆ తర్వాత గడువును పెంచుతూ ఈనెల 31వ తేదీ చిట్టచివరి వెసులుబాటుగా ప్రకటించింది. దాటిందంటే రూ.1000 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఆతర్వాత అయినా పాన్ లింక్‌చేసుకోని పక్షంలో అవి చెల్లుబాటు కావడని ఇక పాన్‌కార్డు తీసుకోవడం కూడా కష్టం అవుతుందని ఆర్థికశాఖ చెపుతోంది. ఆధార్‌పాన్ లింక్‌ను ఇన్‌కమ్‌ట్యాక్స్ ఈఫైలింగ్ పోర్టల్‌ద్వారా కూడా చేసుకోవచ్చని ఐటిశాఖ వెల్లడించింది. 2024 అక్టోబరు ఒకటవ తేదీ తర్వాత పాన్‌కార్డులు పొందినవారు వాస్తవ గడువుతేదీ దాటినవారు వెంటనే లింక్‌చేసుకోవాలని ఐటిశాఖప్రకటించింది. ఆదాయపు పన్నుశాఖ ఈపోర్టల్‌లోకివెళ్లి లింక్ ఆధార్ ఆప్షన్ ఎంచుకుని, పాన్ ఆధార్‌నంబరు ఇతర వివరాలను పూరించాలి. గడువు తేదీ దాటితే రూ.100 పెనాల్టీ చెల్లించి లింక్‌చేసుకునేందుకు రిక్వెస్ట్‌ను పంపించి వాలిడేట్‌చేసుకోవాలి.

# బిఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో రూ.43వేల కోట్ల డీల్స్
## గత యేడాదికంటే మూడురెట్లు పెరిగిన ఒప్పందాలు




**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** భారత్‌లోని బ్యాంకింగ్; ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో కార్యకలాపాలు ఈ ఏడాది ఇప్పటివరకూ మూడు రెట్లు పెరిగినట్లు ఈక్విరియస్ క్యాపిటల్ సర్వేచేసింది. మొత్తం 30 డీల్స్ జరిగినట్లు ప్రకటించింది. అదే గత ఏడాది 10 డీల్స్‌మాత్రమే జరిగాయి. ఈక్వేరియస్ ప్రచురించిన ఈ నివేదిక బుధవారం వెలుగులోకి వచ్చింది. 2025లో ఇప్పటివరకూ 30 డీల్స్ బిఎఫ్ఎస్ఐ రంగంలో జరిగినట్లు తేలింది. మొత్తం నాన్‌బ్యాంకింగ్ డీల్స్ 42,939 కోట్ల విలువకల డీల్స్‌జరిగాయని, అదే బిఎఫ్ఎస్ఐ విభాగంలో 43,014 కోట్ల డీల్స్‌జరిగినట్లు ఈక్వేరియస్ ప్రకటించింది. ప్రభుత్వరంగం కంటే ఎన్‌బిఎఫ్‌సిలు పనితీరు ఎంతో మెరుగ్గా ఉన్నట్లు గుర్తించారు. ప్రైవేటురంగ బ్యాంకులతో పోల్చినా బిఎఫ్ఎస్ఐరంగం పనితీరు భేషుగ్గా ఉందని సర్వే అంచనా వేసింది. ఎన్‌బిఎఫ్‌సిలపరంగా ఎల్‌అండ్‌టి ఫైనాన్స్ ర్యాలీ తీసింది. భారీ ప్రైవేటు బ్యాంకులు ఐడిబిఐబ్యాంకు, ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు, ఎస్‌బ్యాంకులు పటిష్టమైన వాటాధరలతో మంచి పనితీరుతో మెలిగాయి. ప్రభుత్వరంగ బ్యాంకులపరంగా ఇండియన్ బ్యాంకు, కెనరాబ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియాలు మంచి పనితీరుచూపించాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.